ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)కి జబ్బు చేసింది. దానిని బాగు చేసేందుకు ఎటువంటి చర్యలు కనిపించడం లేదు. సర్కారు ఆసుపత్రుల్లో పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుండగా.. ఇక్కడ మాత్రం పరిస్థితి దారుణంగా ఉంది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వచ్చే రోగులకు అత్యవసరం (క్యాజువాలిటీ)లో వైద్యసేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి. డ్యూటీ డాక్టర్లు, స్పెషలిస్టులు అందుబాటులో లేకపోవడంతో బాధితులు ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. జీజీహెచ్‌లో అన్ని వ్యాధులకూ స్పెషలిస్ట్ వైద్యులు ఉన్నప్పటికీ మెరుగైన సేవలు మృగ్యమయ్యాయి. పెద్దాసుపత్రిలో వైద్యం లభించక, ప్రైవేటు ఆసుపత్రుల్లో అయ్యే ఖర్చులు భరించలేక పేదలు అల్లాడుతున్నారు.



జీజీహెచ్‌కు జబ్బు



'అత్యవసరం'కి అనారోగ్యం

- క్యాజువాలిటీలో అందుబాటులో ఉండని వైద్యులు
- హౌస్ సర్జన్‌లు, నర్సులతోనే నెట్టుకొస్తున్న వైనం
- మెరుగైన వైద్యం కోసం ప్రైవేటుకు సిఫారసు
- సమీక్షలకే పరిమితమవుతున్న వైద్యాధికారులు
- పేదల పెద్దాసుపత్రిలో రోగులకు లభించని భరోసా

భయపెట్టి బయటకు పంపుతున్నారు

రొప్పుతూ క్యాజువాలిటీకి వచ్చే రోగులను అక్కడి సిబ్బంది భయపెట్టి బయటకు పంపుతున్నారనేది కొందరి వాదన. ముఖ్యంగా 108లో జీజీహెచ్‌కి వచ్చి స్ట్రెచర్‌పై పడుకోబెట్టగానే అంబులెన్స్ సిబ్బంది నుంచి నర్సులు, డాక్టర్లు, ఇతర సహాయకులు రోగి తరపు బంధువులను ఆందోళనకు గురిచేసి బయటకు పంపడం నిరంతరం జరుగుతున్న ప్రక్రియ. ఇక్కడ సరైన వైద్యం అందదు, సౌకర్యాలు లేవని బయట ఆసుపత్రికి పొమ్మని సలహా ఇస్తున్నారు. అప్పటికీ రోగి బంధువులు వినకపోతే సిటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎక్స్‌రే తదితర పరీక్షలకు తీసుకెళ్లే సమయంలో అటెండర్ స్థాయి సిబ్బంది సైతం ఇదే మాటలు చెప్పడంతో వారు వణికిపోతున్నారు. చివరకు ప్రైవేటుకే వెళ్తామని అనేలా రోగి బంధువులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. వారే స్వయంగా అంబులెన్స్‌లకు ఫోన్ చేసి పిలిపించి, తమకు నిరంతర సంబంధాలు ఉండే ప్రైవేటు ఆసుపత్రికి పంపుతున్నారు. అక్కడి వారు వీరికి పెద్దమొత్తంలో కమీషన్ ఇస్తున్నట్లు విమర్శలున్నాయి.

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పేదల పెద్దాసుపత్రిగా ఉన్న జీజీహెచ్‌లో మొక్కుబడి వైద్యసేవలు లభిస్తుండటంతో జనం ఉసూరుమంటూ వెనుతిరుగుతున్నారు. ప్రతి రోజూ సాయంత్రం 4 నుంచి మరుసటి రోజు ఉదయం 8గంటల వరకు రోగుల నాడి పట్టుకుని పరీక్షించే వారే కరువయ్యారు. ఆయా స్పెషలిస్ట్ డాక్టర్లు డ్యూటీలో ఉండకపోగా క్యాజువాలిటీ పరిస్థితి కూడా అదేవిధంగా ఉంది. ఇక్కడ డాక్టర్‌లుగా కొనసాగుతున్న కొందరు ఎక్కువగా సొంత ప్రైవేటు ఆస్పత్రులకే పరిమితమవుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. మరోవైపు అత్యధిక శాతం రోగులను చూడకుండానే గుంటూరు జీజీహెచ్‌కు, మరికొన్ని రకాల అత్యవసర వైద్యసేవలకు స్థానిక ప్రైవేటు ఆసుపత్రులకు సిఫారసు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఉదయం 8 నుంచి 2 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 8 గంటల వరకు.. రాత్రి 8 నుంచి ఉదయం 8 గంటల వరకూ డ్యూటీ డాక్టర్లు అందుబాటులో ఉండాలి. వారు ప్రాథమికంగా వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆయా జబ్బును గుర్తించి సంబంధిత స్పెషలిస్ట్ డాక్టర్‌కు సమాచారం అందిస్తే వారు ప్రత్యేక సేవలు అందించాలి. స్పెషలిస్ట్ డాక్టర్లు రోజుకు ఒకరు చొప్పున సాయంత్రం 4 నుంచి ఉదయం 8గంటల వరకూ పూర్తి సమయం అత్యవసర వైద్య విభాగంలోనే ఉండాలి. కానీ ఆ పరిస్థితి కనిపించడం లేదు. జీజీహెచ్‌లో విధుల్లో ఉండే డ్యూటీ నర్సులు, హౌస్ సర్జన్‌లు అత్యవసరంగా వచ్చేవారికి ప్రాథమిక చికిత్స చేసి ప్రైవేటుకు తరలించడం సర్వసాధారణమైంది.



క్యాజువాలిటీలో విధులు ఇలా...

సాధారణ వ్యాధులకు ఓపీ సేవలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు అందుతున్నాయి. ఆయా వ్యాధులను బట్టి అక్కడి వైద్యులు పరీక్షలు చేసి మందులు రాసి ఇస్తారు. అవసరమైతే ఆస్పత్రిలో చేర్చుకుంటారు. అత్యవసర విభాగమైన క్యాజువాలిటీలో సిబ్బంది 24గంటలూ పనిచేయాలి. మూడు షిఫ్టలలో ఒక మెడికలాఫీసర్, వారికి సహాయకులుగా

మిగతా 6వ పేజీలో



ఎం.వేములపాడులో రీసర్వే గురించి ఆర్డీవోను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ అన్సారియా

రీసర్వేలో లోపాలు లేకుండా చూడాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం
- ఎం.వేములపాడులో కార్యక్రమం పరిశీలన
- నాలుగు బృందాలకు షోకాజ్ నోటీసుల జారీకి ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేలో లోపాలు లేకుండా చూసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. సంతనూతలపాడు మండలం ఎం.వేములపాడులో మంగళవారం సాయంత్రం రీసర్వేను ఆమె పరిశీలించారు. ఈ గ్రామంలో 400 ఎకరాలకు పైగా సర్వే చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు చెప్పారు. ప్రభుత్వ భూముల సర్వే 50శాతం పూర్తయిందని ఆమె దృష్టికి తెచ్చారు. కాగా ఎంతమంది రైతుల భూములను మంగళవారం సర్వే చేశారు? ఎన్ని బృందాలు ఫీల్డ్ విజిట్‌లో ఉన్నాయి? అని ఆమె అధికారులను ప్రశ్నించారు. ఏడుగురు రైతులకు సంబంధించిన 30 ఎకరాలను సర్వే చేశామని వారు చెప్పారు. దీంతో ఆర్డీవో లక్ష్మీప్రసన్న ద్వారా ఇద్దరు రైతులకు కలెక్టర్ ఫోన్ చేయించారు. ఎన్ని రోజులు ముందుగా సర్వేకు సంబంధించి నోటీసులు ఇచ్చారు? మీ సమక్షంలోనే భూములను సర్వే చేశారా? అని ఆర్డీవో ద్వారా ఆరా తీశారు. ఐదు బృందాలకు గాను ఒకటి మాత్రమే ఫీల్డ్‌లో ఉన్నట్లు తెలుసుకున్న కలెక్టర్.. మిగిలిన నాలుగు టీంలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సర్వేశాఖ సహాయ సంచాలకుడు గౌస్‌బాషాను ఆదేశించారు. అనంతరం వేములపాడు సచివాలయాన్ని తనిఖీ చేశారు. భూముల రికార్డులకు సంబంధించిన ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను పరిశీలించారు. మ్యుటేషన్ విషయంలో నిబంధనలు ఉల్లంఘించవద్దని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సచివాలయానికి వచ్చిన రైతులతో ఆమె మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ఆదిలక్ష్మి ఉన్నారు.



ఫిర్యాదుదారుల వివరాలు ముందు ఉంచుకొని వారితో ఫోన్‌లో మాట్లాడుతున్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

సమస్య పరిష్కారమైందా.. సంతృప్తి చెందారా?

- అర్జీదారులకు జిల్లా అధికారుల ఫోన్‌లు
- గ్రీవెన్స్‌కు వచ్చే వినతులకు నిర్దిష్ట పరిష్కారాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- నేడు వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష

ఒంగోలు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): 'హలో.. మీరు ఫలానా వ్యక్తే కదా..! మీకు సమస్య ఉందంటూ కలెక్టర్ గారికి అర్జీ ఇచ్చారు. మా వాళ్ల ఆ సమస్యను పరిష్కరించామని చెప్తున్నారు. నిజమేనా..? మీ సమస్య పరిష్కారమైందా... మీరు సంతృప్తిగా ఉన్నారా? పరిష్కారం కాకుండానే చేసినట్లు మావాళ్లు రిపోర్టు ఇచ్చారా..!' ఇదీ జిల్లాలోని వివిధ ప్రాంతాల వారికి మంగళవారం పెద్దసంఖ్యలో జిల్లా అధికారుల నుంచి వచ్చిన ఫోన్లు. ప్రజా వినతుల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి వారంవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్థాయిలో కలెక్టర్లు, జిల్లా అధికారులతో సమీక్షలు చేస్తున్నారు. ఫిర్యాదుదారుల సంతృప్తి గురించి అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొందరు ఫిర్యాదుదారులకు ఆయా శాఖల జిల్లా అధికారులు స్వయంగా ఫోన్ చేసి మాట్లాడి వారి స్పందన నమోదు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా

మిగతా 6వ పేజీలో

శీనారెడ్డిపై కఠిన చర్యలు..!

- ఆయన కాలంలో భారీగా అవినీతి, అక్రమాలు జరిగాయని నివేదిక
- డ్వామాలో 70మందికిపైగా సిబ్బందిపై చర్యలకు పీడీకి ఆదేశం

ప్రభుత్వానికి సిఫారసు చేస్తూ కలెక్టర్ లేఖ



డ్వామా పూర్వపు పీడీ శీనారెడ్డిని విచారిస్తున్న కమిటీ (ఫైల్)

ఒంగోలు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : డ్వామా పీడీగా కె.శీనారెడ్డి పనిచేసిన కాలంలో జిల్లాలో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయ్యింది. అందుకు బాధ్యుడైన శీనారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫారసు చేస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా మంగళవారం లేఖ రాశారు. అదేసమయంలో శీనారెడ్డి అక్రమాలలో భాగస్వాములైన, ఆయన ద్వారా లబ్ధిపొందిన డ్వామాలోని 70మందికిపైగా వివిధ స్థాయిల్లోని సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రస్తుత పీడీ జోసఫ్‌కుమార్‌ను ఆమె ఆదేశించారు. శీనారెడ్డి కాలంలో జరిగిన అవినీతి, అక్రమాలపై నియమించిన పూర్వపు డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఆయన హయాం.. అక్రమాల మయం

గత వైసీపీ పాలనలో నాలుగున్నరేళ్లపాటు డ్వామా పీడీగా శీనారెడ్డి పనిచేయగా, నాటి వైసీపీ ప్రజాప్రతినిధులకన్నా మిన్నగా అధికారపార్టీ నాయకుని వలే పెత్తనం చెలాయించారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా డ్వామా కార్యకలాపాల్లో వ్యవహరించారు. తనకు ఇష్టమొచ్చిన వారిని అందలమెక్కిస్తూ, గిట్టని వారిని వేధింపులకు గురిచేయడంతోపాటు భారీగా అవినీతి, అక్రమాలు, అవకతవకలకు పాల్పడ్డారని ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదులు వెళ్లాయి. పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఈదర మోహన్‌తోపాటు, మరి కొందరు లిఖితపూర్వకంగా పలు అంశాలపై ఫిర్యాదులు చేశారు. నాలుగు నెలల క్రితం తొలుత ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఆశించిన స్థాయిలో ఆ విచారణ సాగలేదని భావించిన ఫిర్యాదుదారులు మరోసారి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి డాక్టర్ స్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌లు అటు సీఎంవోలోనూ, ఇటు ఉపముఖ్యమంత్రి, గ్రామీణాభివృద్ధి శాఖ

మిగతా 6వ పేజీలో

నిబంధనలను తుంగలో తొక్కి..

డ్వామాలో 2014-19 మధ్య ఫైనాన్స్ మేనేజరుగా కూడా పనిచేసిన శీనారెడ్డి అప్పట్లో ప్రభుత్వ ఉద్యోగి అయిన ఆయన భార్య పేరుతో అద్దె వాహనాన్ని చూపించి నిబంధనలకు విరుద్ధంగా బిల్లులు తీసుకున్నాడని తమ పరిశీలనలో గుర్తించినట్లు కమిటీ పేర్కొంది. 2019-24 మధ్య పీడీగా పనిచేసిన కాలంలో కొంతకాలం ఆయన వాహనానికి నెలవారీ అద్దె రూ.45వేలు మాత్రమే తీసుకునే అవకాశం ఉండగా, రూ.60వేలు డ్రా చేసినట్లు పేర్కొంది. అలాగే కమిటీ గుర్తించిన మరికొన్ని అంశాలను పరిశీలిస్తే.. త్రిపురాంతకం మండలంలో రూ.3.18 కోట్లు సిబ్బంది స్వాహా చేశారని సామాజిక తనిఖీ బృందం గుర్తించి నివేదిక ఇస్తే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా శీనారెడ్డి క్లీన్‌చిట్ ఇచ్చారు. వివిధ మండలాల్లో నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయకుండానే చేసినట్లు చూపించి పెద్దఎత్తున ఉపాధి నిధులు స్వాహా చేశారని 17మంది సిబ్బందిని రాష్ట్రస్థాయి తనిఖీ బృందాలు గుర్తించి సస్పెన్షన్‌కు సిఫారసు చేశాయి. అయితే అధికారుల అనుమతి లేకుండా కొద్దిరోజులకే వారిని తిరిగి ఉద్యోగాలలో శీనారెడ్డి నియమించారు. ఏపీవో సుభాషిణి, సుపరింటెండెంట్ పి.వెంకటస్వామిలను కలెక్టర్ అనుమతి లేకుండా ఏపీడీలుగా నియమించారు.

ఇష్టారాజ్యంగా బిల్లులు

దాసరి సురేష్ అనే కంప్యూటర్ ఆపరేటర్‌ను అర్హత లేని పోస్టులో నియమించగా జిల్లా మొత్తం డ్వామా కార్యకలాపాలను శీనారెడ్డి కాలంలో అతనే అజమాయిషీ చేశాడని పేర్కొన్నారు. కంప్యూటర్ ఆపరేటర్ నవీన్ విధులకు హాజరుకాపోయినా ఆయనకు జీతాలు చెల్లింపు చేయగా, సుహారీ క్యాటరింగ్ అనే బోగస్ క్యాటరింగ్ ద్వారా డ్వామాకు సంబంధించిన పలురకాల బిల్లులు చెల్లించారు. ఒంగోలు సీఎల్‌ఆర్‌సీ టెండర్‌లలో రూ.10లక్షలను చిరుద్యోగి చల్లా శేషారావు బ్యాంకు నుంచి డ్రా చేయగా, బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దోర్నాల మండలంలో ఒకే వ్యక్తి చేతి వేలిముద్రతో భారీగా దొంగ మస్టర్‌లు వేసి, ఉపాధి నిధులు తినేసినా శీనారెడ్డి పట్టించుకోలేదు.

డబ్బులు ఇవ్వలేదని..

- తండ్రిపై కుమారుడు గొడ్డలితో దాడి
- అన్ననూ నరికేస్తానంటూ ఊగిపోయిన నిందితుడు
- స్థానికులపైనా తిరగబడిన వైనం
- బండ్లమూడిలో ఘటన

7

డెంగ్యూ, మలేరియా కేసులను నియంత్రించాలి

అధికారులకు వైద్య, ఆరోగ్యశాఖ డీడీ రామనాథరావు ఆదేశం

'రామతీర్థం' సామర్థ్యం పెంపునకు ప్రణాళికలు



ఒంగోలులోని తన కార్యాలయంలో ఇరిగేషన్ ఎస్ఈ, డిప్యూటీ ఎస్ఈలతో మాట్లాడుతున్న ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్

- జలవనరుల శాఖ అధికారులతో బీఎన్ భేటీ
- గుండ్లకమ్మలో చెక్‌డ్యాంలు, ఇతర పనులపై సమీక్ష

ఒంగోలు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న నీటి అవసరాలకు అనుగుణంగా రామతీర్థం ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం పెంపు కోసం ప్రణాళికలు రూపొందించాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ జలవనరులశాఖ అధికారులను కోరారు. నియోజకవర్గంలో జలవనరులశాఖ పరిధిలో ఉన్న రామతీర్థం రిజర్వాయర్, ఎన్ఎస్‌పీ ఆయకట్టు కాలువలు, గుండ్లకమ్మలో చెక్‌డ్యాంల నిర్మాణాల ప్రతిపాదనలపై స్థానిక మంగమూరురోడ్డులోని తన కార్యాలయంలో మంగళవారం ఆ శాఖ అధికారులతో ఆయన సమావేశమై చర్చించారు. జలవనరుల శాఖ ఎస్ఈ వరలక్ష్మి, డిప్యూటీ ఎస్ఈ రామకృష్ణ ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. రామతీర్థం ప్రాజెక్టుకు దిగువన ఉన్న 70వేల ఎకరాల ఎన్ఎస్‌పీ ఆయకట్టు స్థిరీకరణ, ఒంగోలు ఎస్ఎస్ ట్యాంకుతోపాటు ఇతర గ్రామాల్లోని తాగునీటి చెరువులను పరిగణనలోని తీసుకొని 1.50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించినట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్ తెలిపారు. అనంతర కాలంలో కందుకూరుతోపాటు కనిగిరి, తాళ్లూరు, కొండపి, ప్రాంతాలు.. కేవీపాలెం తాగునీటి పథకాలకు రామతీర్థం నుంచి నీటిని ఇచ్చేలా ఏర్పాటు చేశారని చెప్పారు. దీనికితోడు రిజర్వాయర్‌లో పూడిక కూడా రావడంతో నిల్వ కొంత తగ్గిందన్నారు. దీంతో రామతీర్థం అసలు ఉద్దేశమైన సాగర్ ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యం నెరవేరడం లేదన్న అభిప్రాయాన్ని అధికారుల ఎదుట బీఎన్ వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో రిజర్వాయర్ సామర్థ్యం పెంపునకు ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదించాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రామతీర్థం

మిగతా 6వ పేజీలో

బెల్ కంపెనీకి 61 ఈవీఎంలు తరలింపు

సార్వత్రిక ఎన్నికల్లో పనిచేయకపోవడమే కారణం

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గత సార్వత్రిక ఎన్నికల్లో పనిచేయని 61 ఈవీఎంలను అధికారులు మంగళవారం బెంగళూరులోని బెల్ కంపెనీకి తరలించారు. స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం గోడౌన్‌ను రాజకీయపార్టీల నేతలతో కలిసి జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు పరిశీలించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో 35వీవీప్యాట్స్, 16 బ్యాలెట్స్ యూనిట్లు, 10 కంట్రోలు యూనిట్స్ కలిపి మొత్తం 61 ఈవీఎంలను పంపించారు. కార్యక్రమంలో ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి, రాజకీయపార్టీల నాయకులు కోనేటి వెంకటరావు, డీఎస్.క్రాంతికుమార్, గుర్రం సత్యనారాయణ, దండే శ్రీను, రసూల్, టి.వెంకటస్వామి, ఎన్నికల అధికారులు రాజశేఖర్‌రెడ్డి, ఉపేంద్ర, రంగారావు పాల్గొన్నారు.



ఈవీఎంలను పరిశీలిస్తున్న డీఆర్వో ఓబులేసు, వివిధ పార్టీల నాయకులు

రామతీర్థం సామర్థ్యం పెంపునకు ప్రణాళికలు

(5వ పేజీ తరువాయి)

సామర్థ్యాన్ని ప్రస్తుతం ఉన్న 1.50 టీఎంసీలకు అదనంగా మరొక టీఎంసీ పెంచి 2.50 టీఎంసీల నిల్వ చేసేలా ప్రతిపాదనలు రూపొందించారన్న ఎమ్మెల్యే బీఎన్ తాజా అంచనాల ప్రకారం ఆ నివేదికను సిద్ధం చేయాలని సూచించారు.

సాగర్ కాలువల పరిస్థితిపై చర్చ

ఎన్ఎస్‌పీ దీమకుర్తి డివిజన్ పరిధిలో కాలువల పటుదీచ్చ అధ్వాన్నంగా ఉండి నీరు పారుదల సక్రమంగా లేకపోవడంపై ఎమ్మెల్యే విజయకుమార్ అధికారులతో చర్చించారు. ఈ డివిజన్‌లో వచ్చే ఏడాది నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా అత్యవసరం కింద రూ.7.50 కోట్లతో పనులను ప్రతిపాదించి ప్రభుత్వ ఆమోదం కోసం పంపినట్లు అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. అలాగే గుండ్లకమ్మలో ప్రాజెక్టు దిగువ భాగంలో కోరిపాడు, బీర్నాసపల్లి పాడుల వద్ద ప్రతిపాదించిన చెక్‌డ్యాం నిర్మాణ ప్రతిపాదనలపై కూడా ఈ భేటీలో చర్చించారు. మద్దిరాలపాడు పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వచ్చినప్పుడు హామీ ఇచ్చిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. వాటి విషయంలో గతంలోనే ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించినా పలు వివరణలు కోరారని, వాటిపై కూడా సమగ్రరిపోర్టు పంపినట్లు ఎస్ఈ వరలక్ష్మి తెలిపారు.

జిల్లా నెట్‌బాల్ జూనియర్ జట్ల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

దొనకొండ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లాస్థాయి నెట్ బాల్ బాలురు, బాలికల జూనియర్ జట్ల ఎంపికను దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. జిల్లాలోని పలు మండలాల నుంచి వచ్చిన క్రీడాకారులకు నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శులు కృష్ణారెడ్డి, ఏపీ రాజులు పోటీలు నిర్వహించి జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఈనెల 16 నుంచి తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరిగే రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో ప్రకాశం జిల్లా తరుపున పాల్గొంటారని వారు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కె.రాఘవరావు, ఇన్‌ఛార్జ్ హెచ్ఎం జె.కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

కొనకనమిట్ల, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రగుంట సమీపంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న బొలెరో వాహనం పట్టుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకొంది. అందిన వివరాల ప్రకారం ఒంగోలు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆదేశాలతో జిల్లా అధికారులు, ఎస్ఐ రాజేంద్రప్రసాద్ వారి సిబ్బందితో కలిసి దాడులు చేసి పట్టుకున్నారు. మొత్తం బొలెరో వాహనంలో 19 అట్టపెట్టలలో పలు కంపెనీలకు చెందిన 838 అక్రమ మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని, 826 క్వార్టర్ సీసాలు, 12 బీర్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కొనకనమిట్ల గ్రామానికి చెందిన ఒకరిని అరెస్ట్ చేశారు. దాడులలో దొరికిన మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈదాడులలో పలువురు ఎక్సైజ్ సిబ్బంది కేవీ.రామిరెడ్డి, చలపతి, బాలసుబ్బయ్య తదితరులు ఉన్నారు.

శీనారెడ్డిపై కఠిన చర్యలు..!

(5వ పేజీ తరువాయి)

ఉన్నతాధికారులకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ లేఖలు రాశారు. ఈ నేపథ్యంలో శీనారెడ్డి వ్యవహారంపై విచారణ చేసి, నివేదించాలని ఉన్నతాధికారుల నుంచి కలెక్టర్‌కు నవంబరులో ఆదేశాలు అందాయి. తదనుగుణంగా అప్పటి ఎస్ఎస్‌ఓగా ఉన్న డిప్యూటీ కలెక్టర్ ఎంవీ లోకేశ్వరరావు నేతృత్వంలో ఆడిట్ అధికారి శివనారాయణరెడ్డి, సెర్ప్ సీఈఓ శ్రీమన్నారాయణలతో త్రిసభ్య కమిటీని నియమించారు. వారు రెండు నెలలపాటు డ్వామా కార్యాలయంలో అనేక ఫైళ్లను పరిశీలించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న శీనారెడ్డిని, ప్రధాన ఫిర్యాదుదారుడైన ఈదర మోహన్, మరో నలుగురు ఫిర్యాదుదారులు, మరో 44 మంది వివిధ స్థాయిలలోని డ్వామా సిబ్బందిని ప్రత్యక్షంగా విచారించారు. మొత్తం 71 అంశాలు ఫిర్యాదుల్లో ఉండగా, అన్నింటినీ విచారించే ప్రయత్నం వారు చేశారు. కొన్ని ఫైళ్లు డ్వామా కార్యాలయంలో అందుబాటులో లేకపోవడం, మరికొన్నింటిని ప్రస్తుత సిబ్బంది సక్రమంగా ఇవ్వకపోవడం వంటి ప్రతికూల పరిస్థితిని కూడా ఎదుర్కొన్నారు. చివరకు మొత్తం 70కిపైగా తమకు అందిన ఫిర్యాదులను పరిశీలించిన కమిటీ 26 ముఖ్యమైన అంశాలలో భారీగా అవినీతి, అక్రమాలు జరిగినట్లు గుర్తిస్తూ 110 పేజీల రిపోర్టును దానికి అనుబంధంగా 2,193 పేజీల డాక్యుమెంట్లను కలెక్టర్‌కు అందజేసింది. వాటిలో శీనారెడ్డి అవినీతికి పాల్పడి లబ్ధిపొందడంతోపాటు, పెద్ద ఎత్తున ప్రజాధనం దుర్వినియోగం అయ్యేందుకు కారణమయ్యారని నివేదికలో పేర్కొన్నారు.

అక్రమ డిప్యుటేషన్లు.. కోట్లలో స్వాహా

డ్వామా పీడీ కార్యాలయంలో అవసరానికి మించి భారీగా అక్రమ డిప్యుటేషన్లు వేయడంతోపాటు పలు మండలాల్లో సోషల్ ఆడిట్ బృందాలు కోట్ల రూపాయలలో అక్రమాలు జరిగినట్లు నివేదించిన వాటన్నింటిని రద్దుచేయడంతోపాటు లక్షలు స్వాహా చేసిన సిబ్బందికి రూ.500, రూ.3వేలలోపు నామమాత్రపు ఫైన్లు వేసి, తిరిగి వారిని విధుల్లో నియమించారు. కొనకనమిట్ల మండలం ఏపీవోను దాదాపు రూ.51లక్షలు స్వాహా చేశారని సస్పెండ్ చేసి, నామమాత్రం రికవరీ చేసి మళ్లీ అదే పోస్టులో నియమించారు. బ్యాంకు అకౌంట్లలో వివిధ పద్దుల కింద ఉన్న మొత్తాలకు సంబంధించిన వడ్డీ సొమ్మును ఉన్నతాధికారుల అనుమతి లేకుండా తెప్పించి, వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నట్లు గుర్తించారు. అలాగే ఒక బ్యాంకులో ఉన్న డిపాజిట్లను మరొక బ్యాంకుకు వ్యక్తిగత లబ్ధి కోసం ఉన్నతాధికారుల అనుమతి లేకుండా బదలాయింపు చేశారని, అనేక మండలాల్లో ఎంపీడీలు ఏ ఒక్కటి సక్రమంగా లేవని జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల పేరుతో చేసిన పనుల్లో భారీగా అవకతవకలు జరిగాయని, వాటన్నింటిలో నూ శీనారెడ్డి భాగస్వామ్యం ఉందని తేల్చారు.

కఠిన చర్యలకు సిఫార్సు

ఇలాంటి అంశాలన్నింటినీ సమగ్రంగా తెలియజేస్తూ వాటికి కమిటీ ఇచ్చిన ఆధారాలను కూడా ఉటంకిస్తూ శీనారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శికి కలెక్టర్ లేఖ రాశారు. అలాగే డ్వామాలో ఉద్యోగులుగా ఉండి, వివిధ అంశాలలో శీనారెడ్డితో భాగస్వామ్యం ఉన్నట్లుగా భావించడంతోపాటు ఆయన చేసిన, అవకతవకల ద్వారా లబ్ధిపొందిన 70 మందికి పైగా వివిధ స్థాయిలోని డ్వామా సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రస్తుత పీడీ జోసఫ్‌కు మార్చు ఆదేశాలు ఉత్తర్వులు ఇచ్చారు. అందులో ఒంగోలు ఇన్‌ఛార్జి ఏపీడీగా ఉన్న పీ వెంకటస్వామి, టంగుటూరు ఏపీవో సుభాషిణి, డ్వామా పీడీ కార్యాలయంలో పనిచేస్తున్న దాసరి సురేష్, సాధనాల సురేష్ వంటి వారితోపాటు 12మంది ఏపీవోలు, మరో 50మందికిపైగా ఈసీలు, టీఏలు, ఇతరత్రా సిబ్బంది ఉన్నారు.

అప్‌గ్రేడా.. డౌన్‌గ్రేడా...!

యూపీ పాఠశాలలపై తర్జనభర్జన

అద్దంకిలో వందేళ్ల నాటి సత్రం బడి పరిస్థితిపై సందిగ్ధం

హైస్కూల్‌గా మార్చాలని తల్లిదండ్రుల విజ్ఞప్తి

అద్దంకి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యను గాడిలో పెట్టేందుకు సన్నద్ధమైంది. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం 117 జీవో ద్వారా అస్తవ్యస్తం చేసిన పాఠశాల విద్యను సరిచేసేందుకు పాఠశాలల పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో కొత్తగా వచ్చే మోడల్ స్కూల్స్ ద్వారా కొంతమేర ఉపయోగం ఉంటుండగా, మరి కొన్ని చోట్ల నష్టం కూడా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా యూపీ పాఠశాలలను తగ్గించే క్రమంలో కొన్నింటిని హైస్కూల్స్‌గా అప్‌గ్రేడ్ చేస్తుండగా, మరి కొన్నింటిని మోడల్ స్కూల్స్‌గా డౌన్ గ్రేడ్ చేయనున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని యూపీ పాఠశాలల్లో 6, 7 తరగతులను తొలగించి మోడల్ ప్రైమరీ స్కూల్స్‌గా మార్చే అవకాశం ఉండడంతో ఆయా గ్రామాల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో కొత్తగా 10 హైస్కూల్స్ ఏర్పడే అవకాశం ఉంది.

అద్దంకిలో శతాబ్దకాలం నాటి పాఠశాల స్థాయి తగ్గింపేనా?

అద్దంకి పట్టణంలో సుమారు 97 ఏళ్ల కిందట 1928లో సత్రం బడిని ప్రారంభించారు. అనంతరం 1988లో యూపీ స్కూల్‌గా అప్‌గ్రేడ్ అయింది. ప్రస్తుతం విద్యార్థులు 92 మంది కాగా 6, 7 తరగతులలో 35 మంది విద్యార్థులున్నారు. వైసీపీ పాలనలో 117 జీవో ఇచ్చిన సమయంలో సమీపంలో ఉన్న ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 3 నుంచి 7తరగతులను విలీనం చేసే ప్రతిపాదన వచ్చినప్పటికీ.. సమీపంలోని బాలికల ఉన్నత పాఠశాలలో అప్పటికే వెయ్యి మంది విద్యార్థులు ఉండడం, సరైన వసతులు లేకపోవడంతో ఆ ప్రతిపాదన విరమించి యూపీ పాఠశాలగానే కొనసాగిస్తున్నారు. సత్రం బడిలో ఒకే ఒక్క స్కూల్ అసిస్టెంట్ పోస్టు ఉన్నప్పటికీ 6, 7 తరగతులలో 35 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలను డౌన్ గ్రేడ్ చేసి మోడల్ స్కూల్‌గా మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

బాలికల ఉన్నత పాఠశాలలో సరైన వసతులు లేనందున ప్రత్యామ్నాయంగా సమీపంలో ఉన్న సత్రం బడిని హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేస్తే అద్దంకి పట్టణంలోని పేద ప్రజలు నివశించే గుంజివారిపాలెం, గానుగపాలెం, ఇందిరానగర్, కొత్తపేట తదితర ప్రాంతాల విద్యార్థులకు మరింత ప్రయోజనం ఉంటుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే స్థానిక ప్రజాప్రతినిధులు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకుపోయారు. అధికారులు సత్రం బడిని హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



అద్దంకి పట్టణంలోని నెంబర్1 యూపీ స్కూల్(సత్రం బడి)

మండలాల వారీగా...

- అద్దంకి మండలంలో మొత్తం 6 యూపీ పాఠశాలలు ఉండగా వాటిలో వెంపరాల, ఉప్పలపాడు, నాగులపాడు యూపీ పాఠశాలలు యథావిధిగా కొనసాగున్నాయి. మిగిలిన కొత్తకోటకలపూడి, మోదేపల్లి, అద్దంకి పట్టణంలోని సత్రం బడులను డౌన్‌గ్రేడ్ చేసి మోడల్ స్కూల్స్‌గా మార్చే ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం.
- సంతమాగులూరు మండలంలోని కొప్పరం ఎంపీ యూపీ(జనరల్)లో కొప్పరం ఎంపీయూపీ(ముస్లిం) పాఠశాలను విలీనం చేసి హైస్కూల్‌గా మార్చనున్నారు. కొమ్మాలపాడు, ఏల్చూరులో ఉన్న ఎంపీయూపీ(ముస్లిం) స్కూళ్లను ఉర్దూ హైస్కూల్స్‌గా మార్చనున్నారు. పుట్టావారిపాలెం, కామేపల్లి యూపీ స్కూళ్లను అలాగే కొనసాగించనున్నారు.
- బల్లికురవ మండలంలోని వల్లాపల్లి, కొప్పెరపాలెం, ముక్తేశ్వరం యూపీ స్కూళ్లు హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ కానున్నాయి. చెన్నుపల్లి, పాలమల్లాయపాలెం, సోమవరప్పాడు యూపీ స్కూల్స్ యథావిధిగా యూపీ స్కూల్స్‌గా కొనసాగనున్నాయి.
- పంగులూరు మండలంలోని రేణింగవరం, కొండమూరు, కోటపాడు యూపీ స్కూళ్లను హైస్కూల్స్‌గా అప్‌గ్రేడ్ చేయనున్నారు. నూజెళ్లపల్లి యూపీ పాఠశాలను అదేవిధంగా కొనసాగిస్తారా లేక డౌన్‌గ్రేడ్ చేస్తారా అనే విషయంలో తర్జనభర్జన పడుతున్నట్లు సమాచారం.
- కొరిశపాడు మండలంలోని తమ్మవరం యూపీ స్కూల్‌ను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయనున్నారు. మిగిలిన రెండు యూపీ పాఠశాలలను యథావిధిగా యూపీ పాఠశాలగా కొనసాగించనున్నారు.

ప్రభుత్వ భూమిలో గ్రానైట్ వ్యర్థాలు

దశాబ్దాల దారిని మూసివేశా రని రైతుల ఆందోళన


ఆర్థా క్వారీ అక్రమాలపై ఫిర్యాదులు

పరిశీలించిన మైనింగ్, రెవెన్యూ అధికారులు

బల్లికురవ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నో దశాబ్దాల నుంచి రైతులు పొలాలకు వెళ్లే దారిని బాధిత కృష్ణచైతన్యకు సంబంధించిన ఆర్థా గ్రానైట్ క్వారీ ఆక్రమించింది. లీజులు పొందడమేగాక ఇష్టానుసారంగా ప్రభుత్వ భూముల్లో గ్రానైట్ వ్యర్థాలను డంప్ చేసిందని మల్లాయపాలేనికి చెందిన రైతులు రాష్ట్ర స్థాయి అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. గతంలో పనిచేసిన అధికారులు కొందరు ఇష్టానుసారంగా వ్యవహరించడం వలనే ఆ భూములను గ్రానైట్ క్వారీ నిర్వాహకులు ఆక్రమించుకున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

బల్లికురవ మండలంలోని కొణిదెన రెవెన్యూ పరిధిలోని మల్లాయపాలెం సర్వే నెంబరు 934/14లో 3.95 ఎకరాల ప్రభుత్వ డొంక పోరంబోకు భూమి ఉంది. అలాగే సర్వే నెంబరు 934/17/11లో 2.55 సెంట్లలో నీరు పారే వాగు భూమి ఉంది. ఆ భూముల్లో నుంచి ఆ గ్రామ రైతులు ఎన్నో దశాబ్దాల నుంచి పంట పొలాలకు వెళుతున్నారు. ఆ భూముల పక్కనే ఆర్థా క్వారీ యజమానులు కొంతకాలం నుంచి రైతులకు ఇబ్బందులు కలిగించేలా గ్రానైట్ వ్యర్థాలను పోస్తున్నారు. ప్రస్తుతం ఆ వ్యర్థాలు కొండలను తలపించేలా ఉండడంతో రైతులు పొలాలకు వెళ్లే దారిమూసుకుపోయింది. పురాతనకాలం నుంచి ఉన్న ప్రధాన దారికి సైతం తాము లీజు పొందామంటూ క్వారీ యజమానులు రైతులకు కలిగిస్తున్నారు. అధికారులు సైతం అడ్డగోలుగా రోడ్డుకు లీజ్ ఎలా ఇస్తారని, అసలు దారి ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో ఉందని రైతులు అంటున్నారు. గ్రానైట్ క్వారీ నిర్వాహకులు తమ ఇష్టానుసారంగా విలువైన ప్రభుత్వ భూమిపై కన్నేసి డంప్ వేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థా గ్రానైట్ క్వారీ ఆక్రమించిన ప్రభుత్వ భూమితో తమకు తీవ్ర ఇబ్బందులు ఉన్నాయని, వెంటనే డంప్‌ను తొలగించాలని మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు రైతులు ఫిర్యాదులు చేశారు. పది రోజుల కిందట చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, మైనింగ్ అధికారులు.. రైతులు ఫిర్యాదులు చేసిన డంపింగ్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మైనింగ్, రెవెన్యూ సర్వేయర్ ద్వారా కొలతలు వేయిస్తామని చెప్పి వెళ్లారు. దీనిపై రైతులు మళ్లీ ఫిర్యాదు చేయడం మొదలుపెట్టారు. వెంటనే ప్రభుత్వ భూమిలో దారికి అడ్డుగా ఉన్న వ్యర్థాలను తీసి వేయించాలని వారు కోరుతున్నారు.





కొండను తలపించేలా పడవేసిన గ్రానైట్ వ్యర్థాలు

పొలాలకు వెళ్లకుండా వాగు భూమిలో అడ్డుగా వేసిన డంప్

ప్రభుత్వ భూముల్లో వ్యర్థాలపై ఫిర్యాదు

మల్లాయపాలెం పరిధిలో ఉన్న డొంక పోరంబోకు, వాగు పోరంబోకు ప్రభుత్వ భూమిలో నిబంధనలు అతిక్రమించి ఆర్థా గ్రానైట్ క్వారీ వారు పెద్ద ఎత్తున వ్యర్థాలను తెచ్చి డంప్ చేస్తున్నారు. ప్రస్తుతం అది కొండలా మారింది. అటుగా వెళ్లే రైతులకు దారి మూసుకుపోయింది. దీంతో గ్రామానికి చెందిన లేబాకి శ్రీనివాసరావు, మరి కొందరు రైతులు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, మైనింగ్ డీఎంజీ, కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌కు పది రోజులుగా ఫిర్యాదు చేస్తున్నారు. రైతుల ఫిర్యాదు మేరకు అధికారులు రంగంలోకి దిగారు. గతంలో దారి ఎలా ఉంది. ఇప్పుడు పరిస్థితి ఏంటని ఆరా తీసి అన్ని రికార్డులను పరిశీలించారు. గతంలో యానాది సంఘం అక్కడ ఉందని, వారు కూడా ఆ దారిని ఉపయోగించుకునేవారని రైతులు అధికారులకు తెలిపారు.

విద్యుత్ శాఖ అధికారుల దాడులు

రూ.7.10 లక్షల అపరాధ రుసుం విధింపు

చీరాలటౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ, విజిలెన్స్ అధికారులు మంగళవారం చీరాల పరిధిలో మెరుపు దాడులు నిర్వహించారు. 24 బృందాలుగా ఏర్పడి 2,685 సర్వీసులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా 151 మందికి రూ.7.10 లక్షల అపరాధ రుసుం విధించారు. అధికారులు మాట్లాడుతూ విద్యుత్ చోరీ, దుర్వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో డీఈఈ జాన్ థామస్, విజిలెన్స్ విభాగం డిప్యూటీ అధికారి మల్లికార్జున రావు, ఆపరేషన్ డిప్యూటీ అధికారి హరిప్రసాదరావు తదితర అధికారులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా

● ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

● 77 మందికి రూ.77.46 లక్షల విలువైన చెక్కుల పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్ : పేదల ఆరోగ్యానికి టీడీపీ ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎన్‌ఎస్ ప్లాజా వద్ద నియోజకవర్గానికి చెందిన 77 మంది వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండగా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.77,46,864లను మంజూరు చేయించి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు ఏ ఆరోగ్య సమస్య వచ్చినా ఎన్‌డీయే ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు ఏ ఆరోగ్య సమస్య వచ్చినా తనకు తెలియచేస్తే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వారికి మెరుగైన వైద్యం అందించేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం చేసిన మంచిని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు సయ్యద్ షానేషావలి, మార్తాల సుబ్బారెడ్డి, బండ్లమూడి ఆంజనేయులు, తోట శ్రీనివాసులు, సోరెడ్డి మోహన్‌రెడ్డి, కటికె యోగానంద్, బోనేని వెంకటేశ్వర్లు ఉన్నారు.

జీజీహెచ్‌కు జబ్బు

(5వ పేజీ తరువాయి)

ఎంఎన్‌వోలు, ఎఫ్ఎన్‌వోలు, నర్సులు డ్యూటీలో ఉండాలి. అంతకు మించి పలు వార్డుల స్పెషలిస్ట్‌లు ఒక్కో రోజు ఒకరు సాయంత్రం 4 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు క్యాజువాలిటీ విధులు నిర్వర్తించాలి. అత్యవసర కేసులు అయిన గుండెపోటు, రోడ్డుప్రమాదం, అగ్నిప్రమాదం, ఇతర ప్రమాదాలు, ఊపిరితిత్తులు, మెదడు సమస్యలు, పక్షవాతం, ఇలా పలు అత్యవసర వైద్య సేవలకు సంబంధించి బాధితులు ఆసుపత్రికి రాగానే పరిశీలించి సంబంధిత డాక్టర్‌కు సమాచారం ఇవ్వాలి. వారు వచ్చి తగిన పరీక్షలు చేసి వైద్యం అందించి రోగి ప్రాణాలు కాపాడాల్సి ఉంది కానీ ఇక్కడ ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఒక రోగిని అర్ధగంటలో పరీక్షించి అవసరమైన వైద్య సహాయం చేయాల్సి ఉండగా.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వచ్చే వారిని బెడ్‌పై ఉంచి నాలుగు గంటలైనా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పైగా నేను కాదంటే నేను కాదు అంటూ తప్పించుకుంటున్నారు. అందరూ కలిసి సమన్వయంతో అందించాల్సిన అత్యవసర వైద్యసేవలను గాలికొదిలేస్తున్నారు. దీంతో ప్రతి అరగంటకు ఒక రోగి అత్యవసర విభాగానికి వస్తుండగా, అక్కడ బెడ్లు ఖాళీ ఉండడం లేదు. దీంతో మిగతా వారు ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు పెట్టాల్సి వస్తుంది.

సమీక్షలకే పరిమితమవుతున్న అధికారులు

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన వైద్యాధికారులు తమ విధులను పక్కనపెట్టి ఆస్పత్రిలోనే ప్రైవేట్ ప్రాక్టీస్ బాధ్యతలతో పరిమితమవుతున్నట్లు సమాచారం. ప్రత్యేకించి సూపరింటెండెంట్, ఇతర వైద్యాధికారులు నిరంతరం వార్డుల్లో పర్యటించి రోగులతో మాట్లాడి అవసరమైన సేవలపై దృష్టి సారించాల్సి ఉంది. అంతేకాకుండా డాక్టర్లకు తగు ఆదేశాలు జారీ చేసి, ప్రతి రోగికి మెరుగైన వైద్యసేవలు లభించేలా చర్యలు తీసుకోవాలి. ఆసుపత్రిలో అవసరమైన మౌలిక వసతుల కల్పన, తాగునీరు, పారిశుధ్యం, ఇతర సౌకర్యాలకు ఇబ్బందికలగకుండా చూడాలి. అయితే ఒంగోలులోని జీజీహెచ్‌లో వైద్యాధికారులు మాత్రం తమ చాంబర్ వదిలి బయటకు రాని పరిస్థితి. ప్రతిరోజూ సమీక్షలు, టెలీకాన్ఫరెన్స్‌లు, నివేదికల తప్ప పేద రోగుల పెద్దగా దృష్టి సారించడం లేదని కొందరు విమర్శిస్తున్నారు. దీంతో డాక్టర్లు, నర్సులు, క్షేత్రస్థాయి సిబ్బంది సైతం వచ్చామా.. పోయామా అన్నట్లు వ్యవహరిస్తున్నారు. మొత్తంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పేదల ఆరోగ్యానికి భరోసా లభించడం లేదు. ఇప్పటికైనా జీజీహెచ్‌లో పేదలకు మెరుగైన వైద్య సేవలు లభించేలా జిల్లా ఉన్నతాధికారులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

మా దృష్టికి వచ్చింది.. పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం..

డాక్టర్ టి.జమున, జీజీహెచ్ సూపరింటెండెంట్

క్యాజువాలిటీలో వైద్యసేవలు సక్రమంగా లేవనే విషయం మా దృష్టికి వచ్చింది. దీనిపై రెండుమూడురోజుల్లో చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉంది. దీంతోపాటు ఎంఎన్‌వో సిబ్బంది కూడా తగినంత మంది లేరు. దీనిపై పూర్తిస్థాయిలో చర్యలు చేపడతాం. వైద్యుల కొరతపై డీఎంఈకు నివేదించాం. రోగులకు సేవలందించడంలో వైద్యసిబ్బంది నిర్లక్ష్యం చూపుతున్నారని పేషెంట్ తాలూకా బంధువులు కొంతమంది నా దృష్టికి తీసుకొచ్చారు. అలా చేసే వారిపై చర్యలు తీసుకుంటామని వైద్యాధికారులు, సిబ్బందిని హెచ్చరించాం. సమన్వయ లోపం లేకుండా మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించాం.

సమస్య పరిష్కారమైందా.. సంతృప్తి చెందారా

(5వ పేజీ తరువాయి)

ఆదేశించారు. దీంతో కీలక శాఖల జిల్లా అధికారులంతా మంగళవారం పలువురు ఫిర్యాదుదారులకు ఫోన్లు చేసి మాట్లాడారు.

పీజీఆర్ఎస్‌పై సమీక్షలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గతేడాది జూన్ 12న ఏర్పాటైన విషయం విదితమే. ఆ వెంటనే ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. గతంలో గ్రీవెన్స్ డేగా పిలిచే ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)గా మార్పు చేసింది. జిల్లాల వారీగా ఎన్ని వినతులు వస్తున్నాయి. పరిష్కారం చేస్తున్నారా లేదా? అనే విషయంపై వారం వారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్థాయిలో సమీక్ష చేస్తున్నారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లోనూ ఈ అంశం ప్రధాన అజెండాగా పెట్టారు. అయితే పలుప్రాంతాల్లో సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరించకుండానే చేసినట్లు నివేదికల్లో కింది స్థాయి అధికారులు చూపుతున్నారని ప్రభుత్వం గుర్తించింది. అలాంటి వాటి విషయంలో మళ్లీమళ్లీ ఫిర్యాదుదారులు అర్జీలు పట్టుకొని తిరగడాన్ని ప్రామాణికంగా తీసుకొని ఆ తరహా చర్యలకు చెక్ పెట్టేలా ఫిర్యాదుదారుల నుంచి అధికారులు మాట్లాడి పరిష్కారంపై వారి ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని కలెక్టర్లకు ఆదేశించారు. తదనుగుణంగా మంగళవారం జిల్లాలో ప్రధాన శాఖల అధికారులు ఈ తరహా ఫోన్లు చేసినట్లు సమాచారం.

భారీగా అర్జీలు పెండింగ్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది జూన్ 16 నుంచి ఇప్పటివరకు ప్రతి సోమవారం వివిధ స్థాయిల్లో నిర్వహించే గ్రీవెన్స్‌లో, అలాగే గత డిసెంబరులో గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో మొత్తం 36,705 వినతులు ప్రజల నుంచి అధికారులకు అందాయి. వాటిలో 19,682 పరిష్కారమయ్యాయి. 17,027 పెండింగ్‌లో ఉన్నట్లు అధికారిక సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. రెవెన్యూ సదస్సుల్లో దాదాపు 12వేలకుపైగా అర్జీలు రాగా మూడు వేల మాత్రం అక్కడికక్కడే పరిష్కరించగా దాదాపు 9వేల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. అవన్నీ జఠిలమైనవి కావడం వల్ల పరిష్కరించలేకపోయినట్లు తెలుస్తోంది. మరికొన్ని ప్రభుత్వ నిర్దేశిత గడువులోపునే పరిష్కరిస్తామని చెప్పారు. ఆ విషయం అలా ఉంచితే పరిష్కరించినట్లు చూపుతున్న వినతులలో తాజా వివరాలను తీసుకొని మంగళవారం వివిధ శాఖల జిల్లా అధికారులు ఫిర్యాదుదారులకు ఫోన్లు చేసి వాకబు చేశారు. డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ అలా 24 మందికి ఫోన్లు చేసినట్లు సమాచారం. కొందరు పోలీసు అధికారులుకూడా ఆరాతీసారు. గత ఫిర్యాదుదారులతో మాట్లాడిన వారిలో ఎక్కువమంది పరిష్కారమైనట్లు, సంతృప్తిగా ఉన్నట్లు చెప్పారని సమాచారం. ఇలాగే రెవెన్యూ, పంచాయతీరాజ్, సంక్షేమ, వ్యవసాయ, పౌర సరఫరాలు, విద్య, వైద్య తదితర శాఖల అధికారులు ఫోన్లు చేసి మాట్లాడినట్లు తెలిసింది. కాగా ఈ అంశంపై బుధవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆయా శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. అధికారులు ఇచ్చే ఫీడ్ బ్యాక్ ఆధారంగా భవిష్యత్‌లో అర్జీల పరిష్కారంపై మరింత దృష్టిసారించనున్నారు.

చెరువు నీటిలో 'ఛాయ'చిత్రం!

మన ప్రతిబింబాలను మనం చూసుకోవాలంటే అద్దాన్ని ఆశ్రయిస్తాం. మరి చెట్ల ప్రతిబింబాలను చూడాలంటే మనం ఫొటోలు తీసుకొని వాటిని చూస్తూ మురిసిపోతాం. అలా కాకుండా ఏకంగా ఒకేసారి చెట్లతోపాటు వాటి ప్రతిబింబాలను స్వయంగా చూసే అరుదైన దృశ్యం మార్టూరు మంచి నీటి చెరువు కట్టపై కనిపించింది. ప్రపంచానికి వెలుగునిచ్చే సూర్యుడు మంగళవారం సాయంత్రం తన డ్యూటీని ముగించుకొని మరో గంటలో వెళ్లిపోయే సమయంలో ఈ అందమైన దృశ్యం ఆవిష్కృతమైంది. ఈ దృశ్యాలను చెరువు కట్టపై రోజూ వాకింగ్ కోసం వచ్చే పాదచారులు, నడక ప్రియులు చూసి సెల్‌ఫోన్‌లో బంధించుకున్నారు. చెరువు నీటిలోని తమ ప్రతిబింబాలను తాము కూడా చూశామన్న విజయగర్వంతో కట్టపై ఉన్న చెట్లు ఆకులు గాలికి రెపరెపలాడడం కనిపించింది. - మార్టూరు, ఆంధ్రజ్యోతి



పసిడి పుష్పమై..

నరికివేసిన మాను మొదలుపై మొలిచిన పచ్చని మొక్కకు పసిడి కాంతులు జిమ్మే పువ్వు పూసినట్టూ.. అది మణిమాణిక్యంలా మెరిసిపోతున్నట్టూ భానుడు భలేగున్నాడు కదూ! పగలంతా భగభగలాడి అలసిపోయిన సూరీడు మబ్బుల మాటుకెళ్లే మాపటేల ఒంగోలు సమీపంలోని కొప్పులు-గుత్తికొండవారిపాలెం రహదారిలోని పొలాల్లో కనిపించిన ఈ దృశ్యం కనువిందు చేసింది.
- ఒంగోలు, ఆంధ్రజ్యోతి



క్యాన్సర్ లక్షణాల అనుమానితులను గుర్తించాలి

● రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ఎన్‌సీడీ శ్యామల

మద్దిపాడు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వైద్య బృందాలు నిర్వహించే క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షల ద్వారా లక్షణాలు ఉన్న వ్యక్తులను గుర్తించి జీజీహెచ్‌కు సమాచారం అందించాలని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ఎన్‌సీడీ, సీనియర్ నోడల్ అధికారి డాక్టర్ శ్యామల ఆదేశించారు. మంగళవారం మద్దిపాడు పీహెచ్‌సీ పరిధిలోని ఏడుగుండ్లపాడు, బసవన్నపాలెంలో వైద్యబృందాలు నిర్వహిస్తున్న క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రోజుకు 25 నుంచి 30 కుటుంబాలు లేదా 60 మందికి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ పరీక్షల ద్వారా నోరు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌లను గుర్తించవచ్చని, అదేవిధంగా బీపీ, షుగర్ పరీక్షలు కూడా నిర్వహించాలని ఆదేశించారు. డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్యాన్సర్ పరీక్షలతో పాటు సమగ్ర ఆరోగ్య సర్వే నిర్వహించి హిమోగ్లోబిన్ పరీక్షలను వారి ఇళ్ల వద్దే చేయాలన్నారు. కార్యక్రమంలో డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ సురేష్, ఎన్‌సీడీ కన్సల్టెంట్ రాజ్‌కిరణ్, డాక్టర్ భగీరధి, డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ ఆనంద్‌మోహన్ పాల్గొన్నారు.

పట్టుబడినా అదే తీరు..!

● నంబర్ల ఆట ఏజెంట్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో సింగిల్ నంబర్ల ఆటతో సామాన్య కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. నిత్యం లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయి. వందల మంది ఈ ఆటకు బానిసలై అప్పుల పాలు అవుతున్నారు. అయితే పోలీసులు ఈ విషయంపై అంటీముట్టనట్లు వ్యవహరిచడం విమర్శలకు తావిస్తోంది. రోజువారీగా సుమారు 10 నుంచి 15 ప్రాంతాలలో ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు లాటరీ టిక్కెట్లు విక్రయించి ఫలితాలు వచ్చిన వారికి నగదు చెల్లిస్తున్నారు. ఈక్రమంలో ఎట్టకేలకు మంగళవారం కేశవస్వామిపేట వద్ద ఓ ఏజెంటును అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద కొన్ని చీటీలు, రూ.2వేల నగదు వన్‌టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే పోలీసులు ఏజెంటును అదుపులోకి తీసుకున్నా మరో వ్యక్తి ఆ ప్రాంతంలో లాటరీ టిక్కెట్లు రాసిన వారికి ఫలితాలు చెప్పడం, అవసరం అయిన వారికి తిరిగి టిక్కెట్లు రాసి ఇవ్వడం చేస్తున్నారు. పోలీసుల చర్యలు ఈ దందాను ఏమాత్రం అదుపు చేయకపోవడంపై పలువురు చర్చించుకుంటున్నారు.

10 మంది జూదరుల అరెస్టు

టంగుటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొణిజేడు సమీపంలో నడుస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు సోమవారం అర్ధరాత్రి దాడి చేశారు. 10 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.93,700 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాగమల్లీశ్వరరావు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తప్పవని ఈసందర్భంగా ఆయన హెచ్చరించారు.

మరో ఐదుగురు..

కొండపి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరిదేపి-ముప్పరాజుపాలెం గ్రామాల మధ్య పొలాల్లో నడుస్తున్న పేకాట స్థావరంపై మంగళవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.93,900 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు.

వరికోత యంత్రం కింద పడి రైతు మృతి



పరిశీలిస్తున్న కానిస్టేబుల్

టంగుటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : వరికోత యంత్రం కింద పడి రైతు మృతి చెందిన ఘటన మండలంలోని సూరారెడ్డిపాలెంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పీలా పాండు (78) మూడు ఎకరాల్లో వరి సాగు చేశారు. సోమవారం యంత్రంతో వరి కోయిస్తున్నారు. ఈ సమయంలో యంత్రాన్ని డ్రైవర్ రివర్స్ చేస్తుండగా వెనుక ఉన్న పాండు దాని కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై నాగమల్లీశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పాండు కుమారుడు రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ప్రపంచ ఖోఖో క్రీడాకారుడు
శివారెడ్డికి సత్కారం



శివారెడ్డిని సత్కరిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు పోతిరెడ్డి శివారెడ్డిని స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం సాయంత్రం కలెక్టర్ తమీమ్ అన్సారియా సత్కరించారు. ఇటీవల ఖోఖో ప్రపంచ కప్‌ను భారత్ సొంతం చేసుకోగా జట్టులో ముఖ్యపాత్రను శివారెడ్డి పోషించారు. ముండ్లమూరు మండలం ఈదర గ్రామానికి చెందిన శివారెడ్డి రానున్న రోజుల్లో ఖోఖోలో జిల్లా కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడింప జేయాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో శివారెడ్డి గురువు మేకల సీతారామరెడ్డి, రెడ్ క్రాస్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కపురం శ్రీనివాసరెడ్డి, డీఎస్‌డీవో రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే లక్ష్యం

● జీపీఐ చైర్‌పర్సన్ డాక్టర్ బీనా మోడీ

ముండ్లమూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని జీపీఐ ఎంటర్‌ప్రైజెస్ చైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బీనా మోడీ అన్నారు. మంగళవారం మండలంలోని పెదఉల్లగల్లులోని ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులు పండించిన పొగాకుకు మంచి ధర కల్పించి వారిని ఆదుకోవటమే తమ కంపెనీ లక్ష్యమన్నారు. పొగాకు రైతులకు యంత్ర పరికరాలు అందజేయటమే కాక తమ సంస్థ అనేక సేవా కార్యక్రమాల్లో దేశ వ్యాప్తంగా ముందుందన్నారు. వైట్‌బర్లీ పొగాకు సాగుచేసే రైతులకు జీపీఐ కంపెనీ రాయితీలపై ఎరువులు, పురుగు మందులతో పాటు అనేకరకాల వస్తువులను అందజేస్తుందన్నారు. కేవలం రైతులకే కాకుండా సేవా కార్యక్రమాల్లో భాగంగా పలుగ్రామాల్లో ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. అనంతరం ఆమె రైతులు సాగు చేసిన పొగాకు తోటలను పరిశీలించారు. అనంతరం ఆమెను రైతులు సన్మానించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులకు యంత్ర పరికరాలను ఆమె చేతులమీదుగా అందజేశారు.



రైతులు సాగు చేసిన పొగ తోటలను పరిశీలిస్తున్న జీపీఐ కంపెనీ చైర్‌పర్సన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బీనామోడీ

డబ్బులు ఇవ్వలేదని..

గొడ్డలితో తండ్రిపై కుమారుడి దాడి

● అన్ననూ నరికేస్తానంటూ ఊగిపోయిన నిందితుడు ● బండ్లమూడిలో ఘటన



దాడిలో గాయపడిన లక్ష్మీరెడ్డి

చీమకుర్తి, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి) : డబ్బులు అడిగితే ఇవ్వలేదని ఏకంగా 75ఏళ్ల వయసున్న ముసలి తండ్రిపై గొడ్డలితో కర్కశంగా కుమారుడు దాడి చేసిన సంఘటన చీమకుర్తి మండలం బండ్లమూడి గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన వనిపెంట లక్ష్మీరెడ్డి(75)కి ఇద్దరు కుమారులు. భార్య చనిపోవటంతో కుమారులతో కలిసి ఉంటున్నారు. పెద్దకుమారుడు చెన్నారెడ్డికి వివాహం కాలేదు. చిన్నకుమారుడు రాజశేఖరరెడ్డికి వివాహం అయింది. భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. వ్యవసాయం చేసుకుకంటూ జీవనం సాగిస్తుంటారు. కాగా ఇటీవల కాలంలో తనకు డబ్బులు ఇవ్వాలని, ఆస్తి తనకే ఇవ్వాలని తండ్రిని చిన్నరాజశేఖరరెడ్డి అడుగుతున్నాడు. ఇదే క్రమంలో అడగ్గా ఈరోజు మంగళవారం కదా... రేపు ఇస్తాను అని తండ్రి లక్ష్మీరెడ్డి చెప్పటం.. వెంటనే ఇంట్లోనే ఉన్న గొడ్డలితో తండ్రిపై ఇంట్లోనే తల, మెడపై మూడుసార్లు దాడిచేసినట్లు తెలుస్తున్నది. ఆ సమయంలో అన్న చెన్నారెడ్డి ఇంట్లో లేడు. అతన్ని కూడా నరుకుతానని గొడ్డలి తీసుకునే అటుఇటూ తిరుగుతుండటం, రక్తం మడుగులో లక్ష్మీరెడ్డి పడి ఉండటం చూసిన ఇరుగుపొరుగువారు 108కి ఫోన్‌చేసి సమాచారం అందించారు. ఈలోపు అక్కడకు చేరిన స్థానికులపై కూడా రాజశేఖరరెడ్డి దాడికి దిగడం గమనార్హం. గాయాలపాలైన లక్ష్మీరెడ్డిని ఒంగోలులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు. నిందితుడు రాజశేఖరరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ సంఘటనపై రిపోర్ట్ రాగానే కేసు నమోదుచేసి విచారణ జరుపుతామని సీఐ సుబ్బారావు తెలిపారు.

తిరుమల ముంతాజ్ హోటల్ నిర్మాణం ఆపాలి

● స్వామి శ్రీనివాసానంద సరస్వతి డిమాండ్

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమల పరిధిలోని ముంతాజ్ హోటల్ నిర్మాణాన్ని తక్షణమే ఆపాలని ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షులు స్వామి శ్రీనివాసానంద సరస్వతి డిమాండ్ చేశారు. మంగళవారం ఒంగోలులోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో ఆయన సాధుసంతులచే సమావేశం జిల్లా అధ్యక్షుడు తూనుగుంట మల్లికార్జునరావు అధ్యక్షతన జరిగింది. స్వామి శ్రీనివాసానంద సరస్వతి మాట్లాడుతూ తిరుమల శ్రీవారి దేవస్థానం చెంత అన్యమతస్తులకు చెందిన ముంతాజ్ హోటల్ పేరిట బార్ అండ్ రెస్టారెంట్‌కు అనుమతి ఇవ్వటం దారుణమని, హిందువులందరూ ప్రతిఘటించాల్సిన విషయమని చెప్పారు. క్షేత్ర పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ఇటు ప్రభుత్వం, అటు టీటీడీ పాలకమండలిపైన ఉందన్నారు. ఈ హోటల్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలనే డిమాండ్‌తో బుధ, గురువారాలలో సాధు పరిషత్ ఆధ్వర్యంలో వందలాది సాధువులతో తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీహెచ్‌పీ ధర్మాచార్య త్రిపుర భైరవేశ్వరానందస్వామి మాట్లాడారు. సమావేశంలో వీహెచ్‌పీ ప్రాంత సత్సంగ్ సోమ సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షులు జిల్లెళ్లమూడి వెంకటేశ్వర్లు, కార్యదర్శులు గడ్డం శ్రీనివాసులు, ఐ.సీతారామయ్య, ఇ.బలరాం, ప్రచార ప్రముఖ్ రాధా రమణ గుప్తా జంధ్యం, స్వామి మురళీకృష్ణ, మహావిద్యానంద మాతాజీ, కరుణానందస్వామి, శుభోదయానందస్వామి, స్మరణానందస్వామి, అన్నపూర్ణ మాతాజీ, దయానంద స్వామి పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు

డెంగ్యూ, మలేరియా కేసులను నియంత్రించాలి

● రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ డీడీ రామనాథరావు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డెంగ్యూ, మలేరియాను నియంత్రించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ (మలేరియా) రామనాథరావు ఆదేశించారు. మంగళవారం ఒంగోలులోని మలేరియా నివారణ కార్యాలయాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం టంగుటూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించి వైద్యాధికారులతో మాట్లాడారు. అనంతరం కలెక్టరేట్‌లోని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి చాంబర్‌లో వైద్యాధికారులతో చర్చించారు. సచివాలయ పరిధిలో ఏఎన్‌ఎంలు, వెక్టార్ కంట్రోల్ యాప్‌లో దోమల పెరుగుదల ప్రదేశాలను గుర్తించి అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మలేరియాను నిరోధించే మార్గాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని చెప్పారు. పూలకుండీలు, పెంకులు, కొబ్బరిబొండాలు, రుబ్బురోళ్లు, పనికిరాని వస్తువులు, పాత టైర్లు, తాగి పడేసిన టీ కప్పులు, సీసాలు, నీటి ట్యాంకులు, సంప్‌లు, నీటి గుంతలు, ఇంటిలో నీరు నిల్వ ఉన్న పాత్రలకు మూతులు వేయడం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, జిల్లా మలేరియా నివారణ అధికారి మధుసూదనరావు, డాక్టర్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

చేకూరపాడు అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

● సిబ్బందిపై చర్యలకు బాలల సంక్షేమ రాష్ట్ర కమిషన్ సభ్యురాలు ఆదేశం

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చేకూరపాడులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం బాలల సంక్షేమ రాష్ట్ర కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి తనిఖీ చేశారు. స్థానిక వేణుగోపాలస్వామి దేవాలయం వద్ద నున్న అంగన్‌వాడీ కేంద్రంలో ఒక్క విద్యార్థి మాత్రమే ఉండటంతో పాటు అక్కడి సిబ్బందిపై ఆరోపణలు రావడంతో విచారణ చేపట్టారు. సుమారు రెండేళ్ల నుంచి అంగన్‌వాడీ కేంద్రంలో వంట చేయడం నిలిపివేసి ప్రతి నెలా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం పక్కదోవ పట్టినట్లు గుర్తించారు. వంటపాత్రలను సైతం పరిశీలించారు. దీంతో అంగన్‌వాడీ టీచర్ మన్నం రాధ, ఆయా చావా మాధవిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రికార్డులను గత రెండేళ్ల నుంచి తనిఖీ చేయలేదని గుర్తించి అవాక్కయ్యారు. దీంతో సూపర్‌వైజర్‌తో పాటు టీచర్, ఆయాకు చార్జి మెమో జారీ చేయాలని ఆ శాఖ పీడీని ఆదేశించారు. అనంతరం మద్దిరాలపాడులోని శ్రీసూర్య విద్యానికేతన్‌ను తనిఖీ చేశారు. ఏడాది కావస్తున్నా ప్రభుత్వ గుర్తింపు తీసుకోలేదంటూ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఈవో కిరణ్‌కుమార్, ఎంఈవో రవితో ఫోన్‌లో మాట్లాడి అనుమతులు లేకుండా పాఠశాల నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. మద్దిరాలపాడు అంగన్‌వాడీ కేంద్రాన్ని సైతం ఆమె పరిశీలించారు.

'ఉపాధి' లక్ష్యాలకు అనుగుణంగా పనులు చేపట్టాలి

● మినీ గోకులాల బిల్లులు చెల్లింపునకు చర్యలు
● డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న పీడీ జోసఫ్‌కుమార్

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం లక్ష్యాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ ఆదేశించారు. స్థానిక డ్వామా కార్యాలయంలో మంగళవారం ఏపీడీలు, ఏపీవోలు, ఈసీలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటికుంటలు, ఫిష్‌పాండ్స్‌తో పాటు మినీ గోకులాల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. రైతుల వ్యవసాయభూముల్లో నీటి కుంటల ఏర్పాటు ద్వారా రైతులు మేలు జరగడంతో పాటు కూలీలకు ఉపాధి కల్పించేందుకు దోహదపడుతుందన్నారు. అందువల్ల అవసరమైన ప్రతిపాదనలు రూపొందించి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. మరో వైపు జిల్లాలో నిర్మాణంలో ఉన్న మినీ గోకులాల షెడ్లను సకాలంలో పూర్తి చేయాలని, ఇప్పటికే సుమారు 700లకు పైగా నిర్మాణాలు పూర్తి కాగా కొన్ని నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఆయా పనులను సకాలంలో పూర్తి చేసి బిల్లులు చెల్లింపులు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీవో సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గుండె ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం భరోసా !

● రూ.40వేలు చేసే ఇంజక్షన్ ఉచితం
● చీమకుర్తి సీహెచ్‌సీలో ప్రత్యేక ఏర్పాట్లు

చీమకుర్తి, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన సమయంలో పేదప్రజల ప్రాణాలకు భరోసానిచ్చే చర్యలను కూటమి ప్రభుత్వం చేపట్టింది. పెద్ద ఆసుపత్రుల్లో వేలరూపాయలు ఖర్చు చేస్తే అందించే ఇంజక్షన్‌ను ఉచితంగా అందజేయనున్నారు. అంతేగాక ఈ ఇంజక్షన్‌ను అన్ని సీహెచ్‌సీ, ఏరియా ప్రభుత్వ ఆసుపత్రులలో 24గంటలూ అందుబాటులో ఉంచారు. గుండెపోటుకు గురైన వ్యక్తికి తొలిగంట ఎంతో విలువైనది. ఆ సమయంలో రూ.40వేలు విలువ చేసే థ్రాంబోలైసిస్ అనే ఇంజక్షన్‌ను గుండెపోటుకు గురైన వ్యక్తికి అందిస్తే ప్రాణప్రమాదం తప్పిపోయే అవకాశం మెండుగా ఉంటుంది. అందుకే ఈ ఇంజక్షన్‌ను ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో ఉంచారు. గుండెపోటుకు గురైనపుడు 108కు ఫోన్‌చేసి వివరాలు తెలియచేస్తే సమీప సీహెచ్‌సికి రోగిని తరలించి ఈసీజీ తీసి ఆ


చీమకుర్తి సీహెచ్‌సీలో వైద్య కోసం సిద్ధం చేసిన ప్రత్యేక గది

వివరాలను నిపుణులైన కార్డియాలజిస్టులకు పంపి వారి సూచనల మేరకు ఇంజక్షన్‌ను ఉచితంగా ఇవ్వటంతోపాటు తక్షణవైద్యసేవలు అందించే నిమిత్తం అన్ని వసతులున్న ఆసుపత్రికి తరలించి అవసరమైతే సర్జరీకూడా చేయించి ప్రాణాలను కాపాడే ప్రయత్నం చేస్తారు. దీనికోసం చీమకుర్తి ప్రభుత్వ సామాజిక ఆరోగ్యకేంద్రంలో తగిని ఏర్పాట్లు చేసినట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వేణుగోపాలరెడ్డి తెలిపారు. ప్రత్యేక గదిని ఏర్పాటు చేసి బెడ్లను, టెస్టింగ్ పరికరాలను సిద్ధం చేసినట్లు చెప్పారు. సమీప ప్రాంత ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని ఆపద సమయంలో ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

గుండెపోటుకు గురైన వారికి ఉచితంగా ఇంజక్షన్

● సూపరింటెండెంట్ వరలక్ష్మి

కొండపి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటు వచ్చిన వారికి గంటలోపు నొప్పి నివారణకు ఇంజక్షన్ అందుబాటులోకి వచ్చిందని కొండపి సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ వరలక్ష్మి తెలిపారు. ఈ సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. గుండెకు భరోసా కార్యక్రమంపై స్థానిక వైద్యశాలలో రోగులకు ఆమె మంగళవారం అవగాహన కల్పించారు. గుండెనొప్పి వచ్చిన వారికి తొలి గంట గోల్డెన్ అవర్ అన్నారు. ఆలోపు ఇంజక్షన్ వేస్తే బాధితుడు ప్రాణాపాయం నుంచి బయటపడతారని చెప్పారు. రూ.40 వేల విలువ చేసే ఈ ఇంజక్షన్‌ను ప్రభుత్వం పేదల కోసం ఉచితంగా అందుబాటులోకి తెచ్చిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు వరుణ్‌తేజ, పి.గీత, పి.పరిమళ, సిబ్బంది పాల్గొన్నారు.


కొండపిలోని ఆసుపత్రిలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన


సూచనలు ఇస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : నగర సుందరీకరణలో భాగంగా చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు వేగవంతం అయ్యాయి. ఈ మేరకు మంగళవారం కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లోని పోలీసుశాఖ పెట్రోలు బంక్ వద్ద రోడ్డు విస్తరణపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలన చేశారు ఈమేరకు కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వరరావు ఆయా పనుల గురించి మ్యాప్ ద్వారా వివరించగా, దానిపై స్పందించిన ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ ప్రజా ప్రయోజనార్థం చేపట్టే పనులకు తాము సహకరిస్తామని తెలిపారు. అలాగే ఆవైపు రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలకు ట్రాఫిక్ సమస్య లేకుండా పనులు చేపట్టాలని, తమ శాఖ తరుపున సహకరిస్తామని ఆయన చెప్పారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి):శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. స్థానిక గోపాల్‌నగర్ ఒకటవ లైన్‌లోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ దేవస్థానంలో నిర్వహించిన ఈ కళ్యాణోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నల్లూరి తేజ ఫణీంద్ర ఆచార్య యాజ్ఞీకంలో కల్యాణ క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పుష్పయాగాన్ని నిర్వహించి, సుమారు వెయ్యి మంది భక్తులకు అన్నదానం చేశారు. బుధవారం ఉదయం తిరుపతమ్మ తల్లి కళ్యాణోత్సవం జరుగుతుందని దేవస్థాన కమిటీ ప్రతినిధులు తెలిపారు. భక్తులు పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

6ఏ కేసు నమోదు

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అమ్మనబ్రోలు గ్రామంలోని 10వ నంబరు రేషన్‌దుకాణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్యలక్ష్మీ, ఫిరోజ్‌భాషా, ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ గుణవంశీ మంగళవారం సాధారణ తనిఖీలు చేపట్టారు. సదరు రేషన్‌దుకాణంతో పాటు డీలర్ ఇంట్లో అదనంగా 120 బస్తాలు గోతాలు మార్చని రేషన్‌బియ్యం ఉండటంతో వాటిని స్వాధీనం చేసుకొన్నారు. డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు డీటీ రాజ్యలక్ష్మి తెలిపారు. వీఆర్వో భాగ్యారావు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను పరిష్కరించాలి : డీఎస్పీ


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

సింగరాయకొండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఆదేశించారు. మంగళవారం సింగరాయకొండ పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రతిరోజూ విజిబుల్ పోలీసింగ్ చేయాలని సూచించారు. సీసీ కెమెరాలు నేర నియంత్రణకు దోహదం చేస్తాయని తెలిపారు. ప్రజలను చైతన్యపరిచి వారి గృహాలు, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ చావా హజరత్తయ్య, ఎస్సై బి.మహేంద్ర పాల్గొన్నారు.

శనగలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న డీడీ రామ్మోహనరావు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): శనగపంటలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహనరావు కోరారు. ఒంగోలు మండలంలోని కొప్పోలు, చెరువుకొమ్ముపాలెం గ్రామాల్లో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాలకు ఆయన హాజరై మాట్లాడారు. శనగ పంటలపై వేపనూనెను పిచికారి చేయటంతో చీడలను నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట్రావు, ఏవో కిషోర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా

కొండపి, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి) : కొండపి సర్కిల్ పరిధిలో హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 100 మందికి పోలీసులు జరిమానా విధించారు. వారితోపాటు వాహనాలను మంగళవారం స్థానిక స్టేషన్‌కు తరలించారు. అక్కడ సీఐ జి.సోమశేఖర్ కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు.

నేడు శ్రీభద్రకాళి వీరభద్రస్వామి వారి కల్యాణం

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): కొత్తపట్నం మండలం అల్లూరులోని శ్రీభద్రకాళి శ్రీవీరభద్రస్వామి వారి ఆలయంలో ఈనెల 12వతేదీ ఉదయం 10గంటలకు శ్రీభద్రకాళి శ్రీవీరభద్రస్వామివారి కల్యాణం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది చోళరాజులు కాలం నాటి దేవాలయంలో జరిగే కళ్యాణోత్సంలో భక్తులు పాల్గొనాలని, అనంతరం అన్నదానం జరుగుతుందని ధర్మకర్త ముదిగొండి కోటిచంద్రశేఖరరావు తెలిపారు.

ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు నంబరు

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం త్వరలో ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు నంబరును అందజేయనున్నట్లు ఏవో పి.వెంకట్రావు సూచించారు. మండలంలోని ఈదుమూడి, ఎం.ముప్పాళ్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రబీలో పంటలు సాగుచేసిన రైతులు ఈనెల 15లోగా ఈ-పంటలో నమోదు చేసుకోవాలని చెప్పారు.

జూలై నాటికి రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి పూర్తి

● ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి పనులు జూలై చివరినాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. మంగళవారం అగ్రహారం వెళ్ళే మార్గంలోని బ్రిడ్జి పనులను దామచర్ల, రైల్వే అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ దశాబ్దాల కాలం నాటి నుంచి ఎదురు చూస్తున్న రైల్వే అండర్ పాస్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. అలాగే బ్రిడ్జి నిర్మాణం కారణంగా 5 నివాసాలు కోల్పోతున్నవారికి వేరే ప్రాంతంలో 2 సెంట్లు చొప్పున స్థలాలు చూపి వారికి అండగా ఉంటామని ఆయన చెప్పారు. ప్రజల సౌకర్యార్థం చేపడుతున్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌లకు, రైల్వే అధికారులకు సూచించారు. ఇక్కడి ప్రజలు గత కొన్నేళ్ళుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. 2016లో అన్నవరప్పాడు, సూరారెడ్డిపాలెం, కరవది వంటి ప్రాంతాల్లో రైల్వే అండర్ పాస్ వేయాలని ఎస్టిమేషన్‌లు వేయించినట్లు తెలిపారు. అప్పట్లో రైల్వే అధికారులు కూడా తగిన విధంగా చర్యలు చేపట్టినా, ప్రభుత్వం మారడంతో పనుల్లో జాప్యం జరిగిందని చెప్పారు. అయితే తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్నవరప్పాడు వద్ద పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఆ దిశగా రైల్వే ఇంజనీర్లు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు చింతపల్లి గోపి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.


బ్రిడ్జి నిర్మాణం జరిగే ప్రాంతం వద్ద మ్యాపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలి

● ఎస్పీ దామోదర్

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నేరాల నియంత్రణకు అవసరమైన చోట సీసీకెమెరాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ దామోదర్ సూచించారు. మంగళవారం నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్‌ను ఆయన మంగళవారం తనిఖీ రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. దాతలు, వ్యాపారవేత్తల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సిబ్బంది వృత్తి నైపుణ్యాన్ని, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. అనంతరం పోలీస్‌శాఖకు కేటాయించిన 2.14 ఎకరాల స్థలాన్ని ఎస్పీ పరిశీలించి అందులోని ఆక్రమణలు, చిల్లచెట్లు తొలగించి రెవెన్యూ అధికారుతో హద్దులు ఏర్పాటు చేసి చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం బి.నిడమానూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో ఎస్పీ దామోదర్ కొదిసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఏఆర్ ఆర్ఐ సీతారామిరెడ్డి, ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, ఎస్ఐ బి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు పోలీస్‌స్టేషన్ తనిఖీ

మద్దిపాడు: జిల్లాలో నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ దామోదర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. జిల్లాలో అన్ని స్టేషన్లలో సిబ్బంది కొరత ఉందని, ఉన్న వారితోనే డ్యూటీలు చేయిస్తున్నామని తెలిపారు. పెండింగ్ కేసులపై దృష్టి పెట్టాలని చెప్పారు. అనంతరం స్టేషన్ పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ శ్రీనివాసరావు, ఏఎస్ఐ రమేష్‌కృష్ణ, సిబ్బంది ఉన్నారు.


మద్దిపాడులో పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఘంటసాల గానం అజరామరం : సీఐ

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రముఖ గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు గానం ఎన్ని తరాలు గడిచిన అజరామరంగా ప్రజల హృదయాలలో నిలిచి ఉంటుందని చీమకుర్తి సీఐ సుబ్బారావు పేర్కొన్నారు. ఘంటసాల వర్ధంతి సందర్భంగా మంగళవారం చీమకుర్తి పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలోని ఘంటసాల విగ్రహం వద్ద శ్రీఅభయ కళారాధన సాంస్కృతిక సేవాసమితి వ్యవస్థాపకుడు డాక్టర్ మద్దాలి మాధవరావు ఆధ్వర్యంలో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ఘంటసాల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పాటల పోటీల విజేతలకు సీఐ సుబ్బారావు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ త్వరలో చీమకుర్తి పట్టణంలో ఎస్పీ.బాలసుబ్రహ్మణ్యం నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వేదపండితులు గూడా కామేశ్వరరావు, విద్యానికేతన్ పీఈటీ జి.కోటేశ్వరరావు, కె.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: ఘంటసాల వర్ధంతిని మద్దిపాడు నటరాజ కళాకేంద్రంలో మంగళవారం విశ్రాంత ఉద్యోగులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత విద్యాశాఖ అధికారి పీవీ.రాఘవరావు, నేలటూరు సత్యనారాయణ, శుద్ధపల్లి వెంకటేశ్వర్లు, కాకుమాను సుబ్బారావు, మాజీ సర్పంచ్ అన్నమనేని సుబ్బారావు, గంగిశెట్టి నరసింహారావు, ఎలమంద వెంకటసుబ్బయ్య, ఈమని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఐద్వా నాయకురాలు ఉబ్బా ఆదిలక్ష్మిని సన్మానించారు.


ఘంటసాల విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఐ సుబ్బారావు


మద్దిపాడులో ఆదిలక్ష్మిని సత్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

పెన్షన్‌దారుల సమస్యలను పరిష్కరించాలి

● సంఘ నాయకుల డిమాండ్

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసి రిటైర్డ్ అయిన పెన్షన్‌దారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పలువురు డిమాండ్ చేశారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు జి.శేషయ్య అధ్యక్షత వహించారు. గౌరవాధ్యక్షుడు ఏవీ.పుల్లారావు ధర్నాను ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధానకార్యదర్శి సీహెచ్.రాంబాబు మాట్లాడుతూ ఈపీఎఫ్ పెన్షన్‌దారులకు కనీస పెన్షన్ రూ.9వేలతో పాటు డీఏ కలిపి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీనియర్ సిటిజన్స్‌కు రైల్వేలో తగ్గింపు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్‌దారులకు పీఆర్‌సీని ప్రకటించి ఐఆర్‌ను ఇవ్వాలని కోరారు. 2024 జనవరి, జూలై నెలల డీఏలను మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో టీవీఆర్.సుబ్బారావు, బడితల మోహనరావు, రాబిన్ రవికుమార్, పి.పేరయ్య, సింగరాజు శ్రీనివాసరావు, పి.నరసింహరావు, పి.మీనాకుమారి, బ్రహ్మయ్య, సీఐటీయూ నాయకుడు కాలం సుబ్బారావు, ఇ.అయ్యపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ధర్నా నిర్వహిస్తున్న పెన్షనర్లు

ఎస్సీ, ఎస్టీల విద్య, స్వయంఉపాధికి నిధులు పెంచాలి

దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ దేవకుమార్

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల విద్య, స్వయం ఉపాధికి 2025-26 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ పెంచాలని దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ అల్లడి దేవకుమార్ కోరారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో మంగళవారం దళిత గిరిజన బడ్జెట్ వాచ్ సమావేశానికి జిల్లా కన్వీనర్ దార్ల కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దేవకుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల డిమాండ్ మేరకు ప్రభుత్వం ప్రతి ఏటా 20 కొత్త గురుకుల పాఠశాలలు నిర్మించేందుకు నిధులు కేటాయించాలన్నారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ గతంలో ఎస్సీ, ఎస్టీలకు భూమి కొనుగోలు పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించే వారని, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురాం మాట్లాడుతూ అట్రాసిటి చట్టం అమలు తీరుదారుణంగా ఉందని, ఏడాదికి రెండు సార్లు ముఖ్యమంత్రి అధ్యక్షతన సమావేశం నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు దాసరి సుందరం, పేరం సత్యం, పి.పేరయ్య, గురజాల రాజేశ్వరరావు, ఎస్.మోహనరావు, టి.హరిబాబు, జి.నరసింహారావు, గుంటూరు నాగమణి, గుత్తి కోటేశ్వరరావు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న దేవకుమార్

స్కూళ్ల కుదింపును ఉపసంహరించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మోడల్ ప్రైమరీ పాఠశాలల పేరుతో విద్యార్థుల తరలింపును, పాఠశాలలను కుదింపును నిలిపివేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేవీజీ.కీర్తి, జిల్లా అధ్యక్షుడు, బి.వెంకట్రావు, జిల్లా ప్రధానకార్యదర్శి బి.అశోక్‌కుమార్, ఐఫియా కౌన్సిలర్ పీవీ.సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేయడం వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులు డ్రాపౌట్స్‌గా మిగిలిపోతారని, అందువల్ల విద్యార్థుల సంఖ్యకు సంబంధం లేకుండా మోడల్ ప్రైమరీ స్కూళ్ళు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, సరెండర్ లీవ్‌ల బకాయిలను వెంటనే చెల్లించడంతో పాటు పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని కోరారు.

అప్పులు చెల్లించినా దౌర్జన్యం చేస్తున్నారని ఫిర్యాదు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : తాము ఇవ్వాల్సిన అప్పు తీర్చినా తన ఇంటి తాళాలు పగలగొట్టి దౌర్జన్యం చేస్తున్నారని కొత్తపట్నం మండలం ఈతముక్కలలోని ప్రకాశం కాలనీకి చెందిన మల్లవరపు నరసింహారావు కుటుంబ సభ్యులు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. భారతీయ జనతా మజ్దూర్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖలీఫాతుల్లా బాషా ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో బాధిత కుటుంబ సభ్యులు తమ ఆవేదనను విన్నవించారు. తమను బారి నుంచి రక్షించాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి షేక్ సిద్దాంబి పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నూతనంగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానంపై జిల్లా అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సురక్షితమైన ఇంటర్నెట్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్(ఎన్ఐసీ) ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆ సంస్థ అధికారి వెంకటసుబ్బయ్య నకిలీ మొబైల్ యాప్‌లు, డిజిటల్ అరెస్టు, సైబర్ నేరాల తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ కార్యాలయ సైబర్ సెక్యూరిటీ బృంద సభ్యులు జిల్లాలో జరిగిన సైబర్ సంఘటనలు వివరించారు. కార్యక్రమంలో ఎన్ఐసీ ఏడీఐవో రవికిరణ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

14న పీడీఎస్‌యూ విలీనసభ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో ఈనెల 14వతేదీన జరిగే పీడీఎస్‌యూ విలీన సభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ పిలుపునిచ్చారు. స్థానిక ఆంధ్రకేసరి యూనివర్శిటీ వద్ద మంగళవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. 2013లో పీడీఎస్‌యూ రెండుగా చీలిపోయి కొంత నష్టాన్ని చవిచూశామన్నారు. గత రెండేళ్ళుగా రెండు సంస్థలు చర్చించుకొని విలీనం చేసేందుకు నిర్ణయం తీసుకొని సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శ్యాం, నాయకులు సతీష్, విద్యార్థులు లక్కీ, మధు, గణేష్, నాగార్జున, వెంకటేష్ పాల్గొన్నారు.

దీన్ దయాళ్ ఉపాధ్యాయకు నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆర్థికవేత్త, భారతీయ జనసంఘ్ పూర్వ అధ్యక్షుడు పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని మంగళవారం స్థానిక రామనగర్‌లో బీజేపీ పట్టణ అధ్యక్షురాలు దేవరపల్లి లక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళా మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి విజయరావు ముఖ్యఅతిథిగా హాజరై దీన్ దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి సత్యవతి, అసెంబ్లీ కో కన్వీనర్ రాంబాబు పాల్గొన్నారు.

మాదిగ మాన్యం ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో మాదిగ మాన్యం ఆక్రమించిన వైసీపీ ముఠాపై చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సంతనూతలపాడులోని 306 సర్వేనెంబరులోని 19.15 ఎకరాల మాదిగమాన్యం కాలక్రమంలో ఒకటిన్నర ఎకరాలుగా మిగిలిందన్నారు. ఆ భూమిని కూడా వైసీపీ నాయకులు కుట్ర చేసి కాజేశారని ఆరోపించారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాదిగ మాన్యం వారసులు బొమ్మల దేవసహాయం, యాకోబు, ఏలియా, చెంచయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): మోపెడ్‌పై ప్రయాణిస్తున్న వృద్ధుడిని మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఆయన తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సంఘటన మంగళవారం త్రోవగుంట లారీ యూనియన్ ఆఫీస్ వద్ద జరిగింది. కారంచేడు మండలం జరుగులవారిపాలెం గ్రామానికి చెందిన శ్యామ్‌ప్రసాద్ (62) తన మోపెడ్‌పై ఒంగోలు వెళుతున్నారు. అదే సమయంలో ఎదురుగా ఇరువురు యువకులు ద్విచక్రవాహనంపై వేగంగా వస్తూ ఆయనను ఢీకొట్టారు. దీంతో శ్యాంప్రసాద్‌కు తీవ్ర గాయాలు కావడంతో రిమ్స్‌కు తరలించారు. ఇరువురు యువకులు స్వల్పంగా గాయపడ్డారు. వృద్ధుడు అపస్మారక స్థితిలో ఉండగా వైద్యులు చికిత్స చేస్తున్నారు. ఒంగోలు తాలుకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మిస్సింగ్ సిటిజన్స్‌పై సర్వే

సింగరాయకొండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మిస్సింగ్ సిటిజన్స్‌పై సచివాలయ సిబ్బంది మండలంలో హౌస్ హోల్డ్ సర్వే నిర్వహించారు. కుటుంబ సభ్యుల్లో నమోదుకాని వారు 5,911 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరిలో ఇప్పటికే 3,243 మంది వివరాలను సేకరించి హౌస్ హోల్డ్‌లో మ్యాపింగ్ చేసినట్లు ఎంపీడీవో జయమణి తెలిపారు. ఇంకా 2,668 మంది వివరాలు సేకరించాల్సి ఉందని చెప్పారు. వీరిలో కొంతమంది అందుబాటులో లేకపోవడం వలన హౌస్ హోల్డింగ్‌లో మ్యాపింగ్ చేయడం ఆలస్యమవుతున్నదని తెలిపారు.

మెడికల్ విద్యాసంస్థల సందర్శన

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలుగునాడు మెడికల్ స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని పలు మెడికల్, నర్సింగ్, ఫార్మసీ కాలేజీలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ ఎం.రామారావు, వెంకటసాయి, జాషువా, ఇబ్రహీం, ఆనంద్, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

నాటు సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసిన ఘటన మంగళవారం చోటుచేసుకొంది. ఎక్సైజ్ సీఐ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు మార్కాపురం, ఎర్రగొండపాలెం ఎక్సైజ్ శాఖ అధ్వర్యంలో మండలంలోని వెంకటాద్రిపాలెం సమీపంలోని అటవీ ప్రాంత్రంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఒకరిని అరెస్టు చేసి 10లీటర్ల నాటు సారా, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌కు సీసీ కెమెరాల అందజేత



సీసీ కెమెరాలు అందజేస్తున్న మధుసూదనరావు, నాగేశ్వరరావు

పొదిలి, ఫిబ్రవరి 11 : పట్టణంతోపాటు అన్ని గ్రామాల్లో సుమారుగా 200ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు పోలీసులు ముమ్మర ప్రయత్నం చేస్తున్నారు. పట్టణంలో తరచూ జరుగుతున్న దొంగతనాలను కట్టడి చేయాలని ఎస్పీ దామోదర్ నిర్ణయం తీసుకున్నారు. అన్ని చోట్ల నిఘానేత్రాలు ఏర్పాటు చేసి నేరాలను అరికట్టాలన్నారు. అందులో భాగంగా పలువురు దాతలు స్తోమతకొద్ది సీసీ కెమెరాలను అందజేస్తు న్నారు. మంగళవారం టీడీపీ నాయకుడు గునుపూడి మధుసుధనరావులు 6 సీసీ కెమేరాలు, నిర్మామహేశ్వరస్వామి దేవాలయ మాజీ ఛైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు 4, సీహెచ్ ప్రకాష్‌రావులు 4 సీసీ కెమేరా లను ఎస్ఐ వేమనకు అందజేశారు. ప్రజాశ్రేయస్సు కోరి సీసీ కెమేరాలను అందజేసిన దాతలను ఎస్ఐ వేమన అభినంధించారు.

కణితి మాంసం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణి అయిన కణితి మాంసాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని అటవీశాఖ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. గిద్దలూరులో వెంకటేశ్వర్లు అనే వ్యక్తి కణితి మాంసం అక్రమంగా విక్రయిస్తున్న విషయం తెలుసుకొని అర్బన్ సీఐ కె.సురేష్ ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అటవీశాఖ అధికారులకు అప్పగించాడు. అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. వన్యప్రాణులను వేటాడవద్దని, వాటిని వేటాడితే చట్టరిత్యా చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

టిప్పర్ ఢీకొని విరిగిన విద్యుత్‌స్తంభం

● నాలుగు గంటలపాటు నిలిచిన విద్యుత్ సరఫరా



విరిగిన విద్యుత్‌స్తంభం

మార్కాపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని అదుపుతప్పి ఓ టిప్పర్ ఢీకొట్టింది. దీంతో విద్యుత్‌స్తంభం విరిగిపోయింది. విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో సమీపంలోని దరిమడుగు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సరఫరాను వెంటనే నిలిపివేశారు. పట్టణంలోకి వస్తున్న టిప్పర్ అదుపు తప్పడంతో ఈ ప్రమాదం జరిగింది. స్థంభం విరిగినా విద్యుత్ తీగలు తెగిపడలేదు. దీంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ సరఫరాను సుమారు నాలుగు గంటలపాటు నిలిపివేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్, కళాశాల రోడ్డు, జవహర్‌నగర్ కాలనీ, తూర్పువీధి, జగదీశ్వరి థియోటర్ రోడ్డుల్లో సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ఎంఎస్‌ఎంఈ సర్వేలో వ్యాపారాలు వివరాలు నమోదు చేసుకోవాలి

మార్కాపురం, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యాపారులు వివరాలను సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ (ఎమ్ఎస్ఎమ్ఈ) సర్వేలో నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఎంఎస్ఎంఈ సర్వే చేపట్టి వ్యాపారుల వివరాలను నమోదు చేసే ప్రక్రియ పట్టణంలో చేపడుతున్నారు. స్థానిక నెహ్రూబజార్, సత్యనారాయణస్వామి గుడి ప్రాంతాల్లో జరుగుతున్న సర్వేను కమిషనర్ నారాయణరావు మంగళవారం పరిశీలించారు. సర్వే నిర్వహణపై వార్డు సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఘనంగా దీన్ దయాళ్ వర్ధంతి

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జనసంఘ్ వ్యవస్థాపకులు పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో నాయకులు దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీ కృష్ణారావు మాట్లాడుతూ.. ఆయన ఆలోచనలు దేశానికి మార్గదర్శకమన్నారు. మిరియాల వాసవి ప్రియ, పాదర్తి ఆంజనేయులు, బొంతల కృష్ణ, డి.కాశీం, దేవిశెట్టి చంద్రశేఖర్, చెన్నయ్య, మురళీ, నాగరాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వసతులు మెరుగు పడాల్సిందే

● రూ.6 కోట్ల వసతిగృహ భవనాల అభివృద్ధి ● ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి హామీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లోని విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన మెరుగైన విద్యను అందించడంతో పాటు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం రాత్రి పట్టణంలోని వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. వసతిగృహంలోని విద్యార్థులతో ఆయన మాట్లాడారు. భోజన సదుపాయాలు, విద్యను బోధించే విధానం, మెనూ ప్రకారం ఏ విధంగా భోజనం అందిస్తున్నారని ఆరా తీశారు. కొద్దిసేపు ఉపాధ్యాయుడిగా మారిన ఎమ్మెల్యే విద్యార్థుల పుస్తకాలు తీసుకుని వారు ఏ విధంగా చదువుతున్నారో ప్రశ్నలు వేసి జవాబు రాబట్టారు. భవిష్యత్తులో వారి లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. వంటశాలను పరిశీలించారు. పలు తరగతులలో ఆరుబయట విద్యుత్ సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో తక్షణమే మరమ్మతులు చేయాలన్నారు. మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. భవనంలో పెచ్చులూడుతున్న గోడలను చూసి మరమత్తులు చేయించాలని ఆదేశించారు. తనిఖీలో ఏఎస్‌డబ్ల్యూ సుబ్బారావు, వార్డెన్ రోజా, కౌన్సిలర్లు లొక్కు రమేష్, టీడీపీ నాయకులు పాలుగుళ్ల చిన్నశ్రీనివాసరెడ్డి, బిల్లా రమేష్, వాడకట్టు రామాంజ నేయులు, ఉన్నారు.

● రూ.6 కోట్లతో వసతి గృహాల ఏర్పాటు

నియోజకవర్గంలో రూ.6 కోట్లతో వసతి గృహాలను నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గంలో పలు సంక్షేమ హాస్టళ్ల అవసరం దృష్ట్యా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళగా రూ.6 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. మంజూ రైన నిధులను స్థలపరిశీలన పూర్తయిన తరువాత నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అలాగే రూ.1.95 కోట్లతో ప్రస్తుతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలో పనులు చేపట్టను న్నట్లు తెలిపారు. త్వరలో అన్ని వసతి గృహాలను అభివృద్ధి చేస్తామన్నారు.

సరైన పక్వానికి వచ్చినప్పుడే ఆకు రేల్చాలి

పొగాకు బోర్డు కార్యదర్శి వేణుగోపాల్ సూచన



పొగాకు మండెలను పరిశీలిస్తున్న బోర్డు కార్యదర్శి వేణుగోపాల్

పొదిలి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పొగాకు సరైన పక్వానికి వచ్చినప్పుడు మాత్రమే ఆకును కొట్టాలని పొగాకు బోర్డు కార్యదర్శి డి.వేణుగోపాల్ అన్నారు. మంగళవారం మండలంలోని కంభాలపాడు, పోతవరం గ్రామాల్లో పొగాకు తోటలను, బ్యారన్లను, పొగాకు అల్లుతున్న కూలీలకు పలు సూచనలు చేశారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ పొగాకు క్యూరింగ్ చేసే సమయంలో, అల్లకం సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కాల్పు సమయంలో పరిమితికి మించి బ్యారన్‌లో కర్ర లోడ్ చేయకూడదన్నారు. క్యూరింగ్ సమయంలో అగ్నిప్రమాదాలు జరగకుండా మొద్దుగొట్టం మీద జాలీని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. క్యారోమీటర్లను వినియోగించాలన్నారు. త్వరలో పొగాకువేలం ప్రారంభం అవుతుందని గ్రేడ్ చేసి మండెలు ఏర్పాటు చేసే సమయంలో నాణ్యమైన పొగాకులో అన్యపదార్థాలు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దానివలన నాణ్యత పెరిగి మంచి ధరలు వస్తాయన్నారు. అనంతరం పొగాకు బోర్డులో జరుగుతున్న ఆధునికీకరణ పనులను పరిశీలించారు. బోర్డు ఆవరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. సీసీ, బీటీ రోడ్లపనులు బోర్డు ఆవరణలో జరుగుతున్నాయన్నారు. త్వరలో వేలం ప్రారంభం అవుతుందని అప్పటికి పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో దక్షిణప్రాంత తేలికనేలల ప్రాంతీయ అధికారి ఎం లక్ష్మణరావు, పొదిలి వేలం నిర్వహణాధికారి గిరిరాజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకరించండి : ఎంపీపీ

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ రిబ్కా



ప్రగతి నివేదికలు చదువుతున్న అధికారులు

త్రిపురాంతకం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు అధికారులు సహకరించాలని ఎంపీపీ జి.రిబ్కా కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆమె అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన అధికారులు వారి శాఖల ప్రగతి నివేదికలను చదివి, ప్రజలకు అందజేసే పథకాలను వివరించారు. విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పీఎం సూర్యఘర్ పథకంపై పశు సంవర్ధకశాఖలో అందించే గోకుళం షెడ్లు, వైద్యశాఖ ఆధ్వర్యంలో అందించే చికిత్సలు, పంచాయితీరాజ్‌శాఖలో చేపడుతున్న కార్యక్రమాలను అధికారులు వివరించారు. డీటీ పుల్లారెడ్డి ప్రజాపంపిణీపై మాట్లాడుతుండగా జి.ఉమ్మడివరం ఎంపీటీసీ ఆంజనేయరెడ్డి కలుగజేసుకుని ఏ ఒక్క గ్రామంలోనూ రేషన్ బియ్యాన్ని సక్రమంగా జరగడం లేదన్నారు. విచ్చలవిడిగా డీలర్లు అమ్మేసుకుంటున్నారని, అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కరువైందని అన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఏమయ్యారని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంఈవోలు మల్లి ఖార్జుననాయక్, రాజశేఖరరెడ్డి, ఈవోపీఆర్‌డీ రామసుబ్బయ్య, ఏపీవో సుజాత, ఏపీఎం ఎడ్వర్డ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గుండెజబ్బుల నివారణపై ప్రజలకు అవగాహన



కంభంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు, వైద్యసిబ్బంది

కంభం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గుండె జబ్బుల నివారణపై కంభం ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు ప్రభుత్వ వైద్యులు అవగాహన కల్పించారు. మంగళవారం వైద్యశాల ఆవరణలో సూపరింటెండెంట్ డాక్టర్ శిరీష ప్రియదర్శిని, డాక్టర్ నాయక్ తదితరులు మాట్లాడుతూ గుండెపోటుకు గుర్తింపు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఛాతిలో నొప్పి ఉన్నా, ఎడమ భుజం లాగినట్లు ఉన్నా, గుండె దడగా ఉన్న తక్షణమే కంభం ప్రభుత్వ వైద్యశాలకు వస్తే పరీక్షలు చేసి రూ.40వేలు విలువైన టెనిక్టిప్లస్ ఇంజక్షన్ ఉచితంగా వేస్తామన్నారు. కరపత్రాలను, విడుదల చేశారు. కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : ఛాతి నొప్పి శరీరం అంతా చెమటలు పడుతుంటే అది గుండెనొప్పిగా భావించాలని ఎర్రగొండపాలెం ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ యాదిద్య దేవర అన్నారు. మంగళవారం స్థానిక ఏరియా వైద్యశాలలో గుండెనొప్పి (హార్ట్ ఏటాక్) వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేమి ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా హార్ట్ ఏటాక్ వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఏరియా వైద్యశాల పరిధిలో ఎవరికైన పైన చెప్పిన లక్షణాలు వస్తే వెంటనే 108 అంబెలెన్స్ ద్వారా వైద్యశాలకు రావాలన్నారు. 24 గంటలు డాక్టర్లు అందుబాటులో ఉంటారని అన్నారు. హార్ట్ ఏటాక్‌కు సంబందించిన ఈసీజీ ఇంజక్షన్ అందుబాటులో ఉన్నాయన్నారు. కావున ఈ ప్రాంత ప్రజలు వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాల న్నారు. కార్యక్రమంలో డాక్టర్లు, ఎంఈవో, వైద్య సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న వైద్యురాలు మెర్సీప్రియాంక

పెద్ద దోర్నాల : గుండెపోటు రోగులకు ప్రభుత్వం ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందజేయనున్నట్లు వైద్యురాలు మెర్సీప్రియాంక అన్నారు. స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో గుండెపోటు నివారణ అవగాహన కల్పించి ఆమె మాట్లాడారు. గుండెనొప్పితో ప్రాణాలు కోల్పోరాదని ప్రభుత్వం స్టేమి చికిత్సతో గుండెకు భరోసా ఇస్తోందన్నారు. ఛాతిలో నొప్పి రావడం, ఎడమ చేయిభుజం లాగడం, ఉన్నట్టుండి ఆయాసం పెరిగి స్పృహ తప్పి పడిపోవడం వంటివి గుండెపోటుకు సంకేతాలన్నారు. గుర్తించిన వెంటనే రక్తనాళాలు మూసుకు పోకుండా వెంటనే చికిత్స పొందిన రోగులు బతికే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. రోగిని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువస్తే తగిన పరీక్షలు నిర్వహించి నిపుణుల సహాయంతో రూ.40వేల విలువైన టెనిక్టిప్లస్ ఇంజక్షన్ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఖరీదైన మందులు వైద్యశాలల్లో అందుబాటులో ఉంచిందని, సద్వినియోగ పరుచుకోవాలన్నారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు నాగమహేశ్వరి, ఆంజనేయులు, లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గణితంలో విద్యాన్ విద్యార్థి ప్రతిభ

గిద్దలూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాచర్లలోని విద్యాన్ స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని కె.ప్రవల్లిక వేదిక్ గణిత పరీక్షలో తన ప్రతిభను చాటింది. విజయవాడలో రాష్ట్రస్థాయిలో జరిగిన వేదిక్ గణిత పరీక్ష పోటీలో ప్రవల్లిక పాల్గొని రైజింగ్ అవార్డు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ జి.పాండురంగారెడ్డి పేర్కొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

గిద్దలూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఈసీహెచ్‌ఎస్ క్లీనిక్‌లో ఈ నెల 12న బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు కెప్టెన్ జేసీ.అంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలుకు చెందిన రమేష్ ఆసుపత్రికి చెందిన వివిధ విభాగాల వైద్య నిపుణులు వైద్యశిబిరానికి హాజరవుతారన్నారు. మాజీ సైనికులు, ఈసీహెచ్‌ఎస్ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాదర్బార్

కంభం : కంభం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటలకు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తు న్నట్లు ఎంపీడీవో వీరభద్రాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులందరూ పాల్గొని ప్రజాసమస్యల పరిష్కారం చేస్తారన్నారు.

తెలుగు ఉపాధ్యాయురాలికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న సరోజ

కంభం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషాభివృద్ధికి, తెలుగు సాహిత్య సేవకు ఎనలేని కృషి చేసిన కంభం మండలం హజరత్ గూడెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆకవీటి సరోజ గౌరవ డాక్టరేట్ పురస్కారం అందుకున్నారు. మంగళవారం ఒంగోలు ఎన్‌టీఆర్ కళాపరిషత్‌లో హోప్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు రవి ద్వారా డాక్టరేట్ తెలుగుభాష విశారదభూషణ్ పురస్కారాలను అందుకున్నారు. ఈ అవార్డులు అందుకున్న సరోజను పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఎంఈవోలు, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు డయల్ యువర్ డీఎం

గిద్దలూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు వీలుగా ఈనెల 12వ తేది బుధవారం మధ్యాహ్నం 11 గంటల నుండి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 9959225702 నంబరుకు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు, సూచనలు తెలియ చేస్తే వాటిని పరిష్కరించి మరింత మెరుగైన సేవలు చేస్తామని డిపో మేనేజర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

డెమో రైళ్లను పొడిగించాలి

గిద్దలూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం డెమో రైలును గిద్దలూరు వరకు పొడిగించాలని బీజేపీ నాయకులు స్థానిక స్టేషన్ మాస్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రేణిగుంట నుంచి నంద్యాల వరకు, అలాగే కర్నూలు నుంచి నంద్యాల వరకు నడుస్తున్న డెమో రైళ్లను గిద్దలూరు వరకు పొడిగించాలని కోరారు. తెనాలి నుంచి మార్కాపురం వరకు వస్తున్న డెమో రైలును సైతం గిద్దలూరు వరకు పొడిగించాలన్నారు. రైలు వచ్చిన సందర్భంలో ఏ బోగీ ఎక్కడ ఆగుతుందో తెలిపే డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందచేసిన వారిలో బీజేపీ పట్టణశాఖ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, చంద్ర, సూర్యరామచంద్రుడు, ఎం.సత్యనారాయణ, జి.పుల్లయ్య పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ



పరీక్ష అట్టలు అందజేసిన కండెక్టర్

బేస్తవారపేట, ఫిబ్రవరి11, (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న ఓబినేనిపల్లె, పెద్దఓబినేనిపల్లె, రెట్టపల్లె గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 23 మంది విద్యార్థులకు రాచర్ల మండలం రాచర్ల గ్రామానికి చెందిన సామాజిక సేవాకార్యకర్త కండెక్టర్ శివశంకర్‌నాయుడు పరీక్షలకు సంబంధించిన అట్టలు, పెన్నూ, స్కేల్ ఉచితంగా అందజేశారు. త్వరలో జరిగే పరీక్షలలో ఉత్తమ ప్రతిభను కనబరచాలని కోరారు. మూడేళ్లగా పలువురు విద్యార్థులకు పరీక్షల సమయంలో ఉపకరణాలను అందిస్తున్నారు. కార్యక్రమంలో డ్రైవర్ ఆనందరావు పాల్గొన్నారు.

ఎంపీ శ్రీనివాసులరెడ్డి ఆరోగ్యం కోసం పూజలు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి ఇటీవల గుండె సంబంధిత ఆపరేషన్ జరగడంతో ఆయన ఆరోగ్యం బాగుపడాలని టీడీపీ నాయకులు మంగళవారం పూజలు నిర్వహించారు. స్థానిక గుండ్లకమ్మ సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డీఆర్‌యూసీసీ సభ్యులు గాయం వెంకటనారాయణరెడ్డి, టీడీపీ నాయకులు చందలూరి చెన్నారెడ్డి, గొలమారి చినబాలవెంకటరెడ్డి, గాజుల యోగిరెడ్డి, కందుల బలరామిరెడ్డి, గొలమారి వెంకటరెడ్డి, గోగూలమూడి శ్రీనివాసులరెడ్డి, దుగ్గెంపూడి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విజేతలకు అభినందన



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రంగయ్య

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 11 ఆంధ్రజ్యోతి: స్థానిక వాసవీ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు కరాటేలో ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా పాఠశాలలో మంగళవారం డైరెక్టర్, ప్రిన్సిపాల్ రంగయ్య ఆధ్వర్యంలో విద్యార్థులను అభినందించారు. విజయవాడలో ఆంధ్రప్రదేశ్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలలో రెండో తరగతి విద్యార్థి సాహిత్య వెండి, కాంస్య పతకాలు, 8వ తరగతి విద్యార్థిని నిఖిలా హారి కాంస్య పతకం సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించి మాట్లాడుతూ.. చదువుతో పాటు వివిధ సాంస్కృతిక క్రీడా కార్యక్రమాలలో నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. ఏవో రంజిత్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి రైతు విశిష్ట గుర్తింపుకార్డు తీసుకోవాలి

రైతులకు వ్యవసాయాధికారుల సూచన

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు ప్రభుత్వం అమలుచేసిన ఫార్మర్ రిజిస్టర్‌లో పేరు నమోదు చేసుకొని గుర్తింపు కార్డు తీసుకోవాలని, ఏవో జవహర్‌లాల్‌నాయక్ అన్నారు. మండలంలోని జమ్మి దోర్నాల, చిన్నదోర్నాల గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఏవో గ్రామాల్లో సాగు చేసిన పంటలను పరిశీలించారు. అనంతరం రైతులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిచారు. కార్యక్రమంలో ఏఈవో చైతన్యకుమార్, వీఏఏ రాజేంద్రప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

పుల్లలచెరువు : సాగులో వున్న మిరపలో ప్రస్తుతం కొమ్మ ఎండు తెగులు సోకుతోందని దాని నివారణకు రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో పి. నిర్మలాదేవి అన్నారు. మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిరపలో ఎండు తెగులు నివారణకు పకృతి వ్యవసాయం ద్వారా తగ్గించవచ్చన్నారు. దీని కోసం రెండు కిలోల సీతాఫలం ఆకులు, ఒక కిలో కలంబదను తీసుకొని మెత్తగా నూరి ఆవు పంచకంలో రెండురోజులు నానబెట్టాలన్నారు. ఆ తరువాత ఒక ఎకరా పోలములో పిచికారి చేయాలని అన్నారు. కార్యక్రమంలో వీఏఏలు కొండా నాయక్,క్రిష్ణ నాయక్,రైతులు పాలొన్నారు.

మార్కాపురం రూరల్ : భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా 11 అంకెల విశిష్ట గుర్తింపు నెంబర్ తీసుకోవాలని ఏవో దేవిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని ఇడుపూరు, కొత్తపల్లి గ్రామాలలో మంగళవారం రైతులతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సాగుచేస్తున్న మిరప పంటలను పరిశీలించి పలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది సంధ్య, సాయిరాం, రైతులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : రైతులు తమ పేరును ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని ఎర్రగొండపాలెం ఏవో కెవి శేషారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొలుకుల, గోళ్లవీడపి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, రాయితీ పథకాలు అందాలంటే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సుచించారు.

మార్కాపురం రూరల్ : భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా 11 అంకెల విశిష్ట గుర్తింపు నెంబర్ తీసుకోవాలని ఏవో దేవిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని ఇడుపూరు, కొత్తపల్లి గ్రామాలలో మంగళవారం రైతులతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ రంగాన్ని ఆధునికీకరణ చేయడానికి ప్రభుత్వం నూతనంగా గుర్తింపు సంఖ్యను జారీ చేస్తుందని తెలిపారు. రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్ళి ఆధార్ కార్డు, పొలం పాస్ పుస్తకం నకలు, ఆధార్‌కు లింకైన మొబైల్ నెంబర్ తీసుకెళ్ళి 11 అంకెల ప్రత్యేక నెంబర్‌ను తీసుకోవాలని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాల లబ్ధిపొందాలంటే రైతు ఫార్మర్ రిజిస్ట్రీ యాప్‌లో న మోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది సంధ్య, సాయిరాం, రైతులు పాల్గొన్నారు.

ఆవులను రోడ్లపై వదిలితే చర్యలు

● మున్సిపల్ కమిషనర్ నారాయణరావు



వాటర్ ట్యాంకు వెనుక ఉన్న తాత్కాలిక గోశాలలోని ఆవులను పరిశీలిస్తున్న కమిషనర్ నారాయణరావు

మార్కాపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆవులను రోడ్డుపైకి వదిలితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు స్పష్టం చేశారు. మార్కాపురం పురపాలక సంఘంలో రోడ్లపై సంచరిస్తున్న ఆవులను మున్సిపల్ కార్యాలయం వెనుకవైపు ఉన్న వాటర్‌ట్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక గోశాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. పశుసంవర్ధకశాఖ సిబ్బంది సహాయం తో గోవుల ఆరోగ్య సంరక్షణపట్ల శ్రద్ధపెట్టినట్లు పేర్కొన్నారు. ఆవుల పెంపకందారులు వారి ఆవరణలోనే వాటిని ఉంచుకోవాలన్నారు. రోడ్ల పైకి వదిలితే చట్టపరంగా చర్యలు తీసు కుంటామన్నారు. మరో 10 రోజుల్లో రోడ్లపై సంచరించే ఆవులను సమీపాల్లోని గోశాలలకు తరలిస్తామన్నారు. పట్టణ సుందరీకరణ, ప్రజారోగ్యం, ట్రాఫిక్ ఇబ్బందులను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సచివాలయ సిబ్బంది ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

ముండ్లమూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ సిబ్బంది కార్యాలయానికి వివిధ సమస్యలపై వచ్చే ప్రజలపట్ల జవాబుదారీగా ఉండాలని ఎంపీడీవో ఆర్.జనార్దన్ అన్నారు. మంగళవారం మండలంలోని శంకరాపురంలో సచివాలయాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. సిబ్బంది తమ శాఖల పరిధిలో ఎవరు ఏ సమస్యపై వచ్చినా వారి సమస్య తెలుసుకొని పరిష్కరించే విధంగా చూడాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

తాళ్లూరు, ఫిబ్రవరి 11(ఆంధ్ర జ్యోతి):ఒంగోలు మాడరన్ ఐహాస్పిటల్, రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక వీకే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. 350 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా, 60 మందికి కంటి సమస్య ఉన్నట్లుగా గుర్తించారు. కార్యక్రమంలో వైద్యులు మారం వెంకటరమణారెడ్డి, డి.అర్పణ షాఫర్, డీవోపే వై.ప్రసాద్, పీఆర్వో సురేంద్ర పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

పీసీపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రైతులందరూ విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని ఏవో కె.ప్రకాశరావు అన్నారు. పిల్లివారిపల్లి, శంఖరాపురంలో మంగళవారం రైతులతో జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ చేసేందుకు కేంద్రప్రభుత్వం ఆధార్‌కార్డ్ తరహాలో 14అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్యను రైతులకు అందించనుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలు, వివిధ పథకాలు పొందాలంటే రైతులందరూ తప్పనిసరిగా విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దీన్‌దయాళ్‌కు నివాళి

పొమూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): హైందవ సిద్ధాంత కర్త పండిట్ దీన్‌దయాళ్ పండిట్ అని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో దీన్‌దయాళ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఉమ్మడిశెట్టి శ్రీను, ఎస్.శివకృష్ణ, పి.విజయ కుమారాచారి, కేవీ సుబ్బారావు, జె.చిన సుబ్బయ్య, కేవీ హరగోపాల్, డి.పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇరిగినేని వర్ధంతి

పొమూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కనిగిరి మాజీ ఎమ్మెల్యే ఇరిగినేని తిరుపతినాయుడు 8వ వర్ధంతి కార్యక్రమాలు బుధవారం మండలంలోని మోపాడు గ్రామంలో నిర్వహిస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పాల్గొంటారని తెలిపారు. బొట్లగూడూరులోని ఇరిగినేని విగ్రహానికి, మోపాడులోని ఇరిగినేని ఘాట్‌లో నివాళులర్పిస్తారని తెలిపారు.

ప్రభుత్వ నిబంధనలను తప్పక పాటించాలి

- గ్రానైట్ యజమానులకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సూచన

కనిగిరి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ యజమానులు ప్రభుత్వ నిబంధనలను పాటించాల్సిందేనని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్‌లో మంగళవారం ఆర్‌అండ్‌బీ, మైనింగ్, గ్రానైట్ యజమానులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రానైట్ వ్యర్థాలను గ్రానైట్ యజమానులు, నిర్వాహకులు ఎక్కడ పడితే అక్కడ వేస్తున్నారని అన్నారు. దీంతో పర్యావరణ దెబ్బతినటంతోపాటు ప్రజలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. ప్రజల నుంచి పదే పదే తమకు ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. గ్రానైట్ యజమానులు వ్యర్థాలను గ్రేడింగ్ చేసి నిర్దేశిత ప్రాంతాల్లో వేయాలన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఏఈఈ ఫిరోజ్, మార్కాపురం మైనింగ్ ఏడీ విష్ణువర్ధన్‌రావు, గ్రానైట్ క్వారీ అసోసియేసన్ నాయకులు, క్వారీ యజమానులు, క్రషర్, కటింగ్ మిషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో గ్రంథాలయ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగకరంగా ఉండేలా రీడింగ్ రూంతో పాటు బాలికలకు వసతులు కల్పించేవిధంగా చూడాలని కాంట్రాక్టర్‌కు డాక్టర్ ఉగ్ర సూచించారు.

కార్యక్రమంలో హెచ్‌ఎంల సంఘం నాయకులు దేవిరెడ్డి రామిరెడ్డి, ఎమ్మెస్సార్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌చౌర్యంపై విజిలెన్స్ దాడులు

- 70 కేసులు నమోదు



విద్యుత్ అక్రమ కనెక్షన్‌ను తొలగిస్తున్న సిబ్బంది

పీసీపల్లి ,ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అక్రమ వినియోగంపై విజిలెన్స్ అధికారులు పీసీపల్లి మండలంలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. విద్యుత్‌చౌర్యానికి పాల్పడుతున్న వినియోగదారులపై 70కేసులు నమోదుచేసి రూ.2.56 లక్షల అపరాధ రుసుం విధించారు. ఏఈ లక్ష్మీరాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.హైమావతి, కనిగిరి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.వీరయ్య ఆధ్వర్యంలో 27బృందాలుగా ఏర్పడిన సిబ్బంది మండలంలోని తలకొండపాడు, పిల్లివారిపల్లి, పీసీపల్లి, పెదయిర్లపాడు, గుంటుపల్లి, పెదఅలవలపాడు, వెంగళాపురం, వెంగళాయపల్లి, కోదండరామపురం, మారెళ్ల తదితర గ్రామాల్లో విస్తృత తనిఖీలు చేశారు.ఈ తనిఖీలలో తక్కువలోడు సర్వీసు తీసుకుని అక్రమంగా అదనపులోడు వాడుతున్న 55సర్వీసులను గుర్తించారు.

ఈ సర్వీసులు కలిగిన వ్యక్తులపై కేసులు నమోదు చేసిన రూ.2,11,500 అపరాధ రుసుం విధించారు. ఒక కేటగిరి తీసుకుని మరో కేటగిరికి వాడుకుంటున్న ఐదు సర్వీసులను గుర్తించి రూ.32 వేలు అపరాధ రుసుం వేశారు. మీటర్లు లేకుండా అక్రమంగా విద్యుత్ చౌర్యం చేస్తున్న పది మందిని గుర్తించి రూ 7,500 విధించారు. మొత్తం 2.56లక్షల అపరాధ రుసుం విధించినట్లు ఏఈ తెలిపారు.

అనంతరం పీసీపల్లి సబ్‌స్టేషన్‌లో మండల విద్యుత్ అధికారులు, సిబ్బందితో సమావేశమైన విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హైమావతి మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమన్నారు. ఈ దాడుల్లో కనిగిరి ఏడీఈ ఉమాకాంత్, పామూరు ఏడీఈ క్రిష్ణారెడ్డి, ఆరు మండలాల ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

మినీస్టేడియం నిర్మాణ పనులను పునఃప్రారంభిస్తాం

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): దర్శిలో మధ్యలో నిలిచిపోయిన మినీస్టేడియం నిర్మాణ పనులను త్వరలో పునఃప్రారంభిస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. దర్శి పట్టణంలోని ఎన్‌ఎస్‌పీ కాలనీలో నిలిచిపోయిన మినీస్టేడియం పనులను మంగళవారం జిల్లా క్రీడాశాఖ అధికారి రాజేశ్వరితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభించిన మినీస్టేడియం నిర్మాణ పనులు వైసీపీ పాలకుల అసమర్థత పాలనతో ముందుకు సాగలేదన్నారు. ఐదేళ్ల పాటు పునాదుల్లోనే పనులు ఆగిపోయాయని విమర్శించారు. నిర్మాణం పనులు పునఃప్రాంభించేందుకు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి ఎం.రామ్‌ప్రసాద్‌రెడ్డిని కోరినట్టు చెప్పారు. నిధులు విడుదల చేస్తానని మంత్రి హమీ ఇచ్చినట్లు తెలిపారు. తాజా అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి పంపితే వెంటనే నిధులు విడుదల చేస్తామని మంత్రి భరోసా ఇచ్చినట్లు తెలిపారు. మినీస్టేడియం నిర్మాణం పూర్తయితే క్రీడలు నిర్వహించేందుకు ఎంతో అనువుగా ఉంటుందన్నారు.



నిలిచిపోయిన మినీ స్టేడియాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, శాప్ డీఈ శ్రీహరి, మేనేజర్ అనిల్, డిప్యూటీ తహసీల్దార్ వి.వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ వై.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను తక్షణమే పరిష్కరించాలి

ముండ్లమూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించి రైతుల్లో నమ్మకం కలిగించాలని డిప్యూటీ కలెక్టర్, జిల్లా ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారి ఎస్.జాన్సన్ ఆదేశించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన 384 అర్జీల్లో ఎన్ని పరిష్కరించారు?, ఇంకా ఎన్ని పరిష్కరించాలి, వాటి పరిస్థితిపై సమీక్ష చేశారు. వీలైనంత త్వరలో వీటిని పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే మాత్రం సహించేది లేదని తెలిపారు. సదస్సుల్లో అర్జీలు ఇచ్చిన రైతులు తమ సమస్య పరిష్కారం కాలేదని పదే పదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దన్నారు. ఏదైనా సాధ్యం కాని సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకు వచ్చినట్లయితే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళుతామన్నారు. ఇటీవల రీసర్వే చేసిన సమయంలో రైతుల పొలాలకు సంబంధించి సరిహద్దు వివాదాలు, రికార్డుల్లో తప్పులు ఉంటే అలాంటివి వెంటనే పరిష్కరిస్తున్నట్లు చెప్పారు.

సమావేశంలో తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్, మండల సర్వేయర్ కోటం రాజు, సీనియర్ అసిస్టెంట్ పి.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ జాన్సన్

రెవెన్యూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

తాళ్లూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ప్రత్యేకాధికారి సీహెచ్ విజయజ్యోతి కుమారి తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రెవెన్యూ సమస్యలపై అర్జీదారులు తరచూ కార్యాలయం చుట్టూ తిరగకుండా సత్వర పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు చెప్పారు. అర్జీలను రెవెన్యూ యంత్రాంగం నిబంధనల మేరకు పరిష్కరించాలన్నారు. సాధ్యం కానివి , ఏకారణం చేత తిరస్కరించబడ్డాయో రైతులకు వివరణ కూడా ఇస్తారన్నారు. దీర్ఘకాల సమస్యల కోసం కలెక్టర్ కార్యాలయానికి రాకుండా పరిష్కరించనున్నట్టు చెప్పారు. ఈసందర్భంగా రెవెన్యూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించారా లేదా అన్న విషయాలను రికార్డులను పరిశీలించారు.



రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతి కుమారి

తహసీల్దార్ జె.ఇమ్మానియేల్‌రాజు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన 263 దరఖాస్తుల్లో 188 పరిష్కరించినట్టు చెప్పారు. 75 సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అందులో 56 రెవెన్యూ సమస్యలు, 19 సర్వే సమస్యలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ ప్రశాంత్, ఆర్ఐ అనూష, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

- రహదారుల పక్కనే నేల బావులు
- పొంచిఉన్న ప్రమాదాలు

ముండ్లమూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ముండ్లమూరుతోపాటు పలు ప్రధాన గ్రామాలకు వెళ్ళే రహదారులకు పక్కనే నేలబావులు ఉండటంతో ప్రమాదాలు పొంచిఉన్నాయి. ఎప్పుడు ఏం జరుగుతందోనని వాహన చోదకులు, ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ముండ్లమూరులో అద్దంకి - దర్శి వెళ్ళే ప్రధాన రహదారిపై ఆర్‌అండ్‌బీ రహదారి పక్కనే నేలబావి ఉంది. రహదారికి ఆనుకొని ఉండటంతో వాహనచోదకులు బావి దగ్గరకు వచ్చేసరికి ఆదమరిస్తే బావిలో పడాల్సిందే. అలాగే, ముండ్లమూరు నుంచి తాళ్ళూరు వెళ్ళే ఆర్‌అండ్‌బీ రహదారి పక్కనే నేలబావి ఉంది. ఈ రెండు బావులు మూడు దశాబ్దాల నుంచి రహదారికి సమీపంలోనే ఉన్నాయి. గతంలో రహదారులకు దూరంగా ఉన్నాయి. రహదారుల విస్తరణ జరగటంతో వీటికి ఆనుకొని నేల బావులు ఉన్నాయి.



ముండ్లమూరు - తాళ్లూరు ఆర్‌అండ్‌బీ రహదారి పక్కనే ఉన్న నేల బావి



ముండ్లమూరులో ఆర్‌అండ్‌బీ రహదారి పక్కనే ఉన్న నేల బావి

మండలంలోని పసుపుగల్లులో కూడా ఆర్‌అండ్‌బీ రహదారి పక్కనే నేలబావి ఉంది. పులిపాడు నుంచి తండా వెళ్ళే రహదారి, ఈదర నుంచి పూరిమెట్ల వచ్చే రహదారుల పక్కన నేల బావులు ఉన్నాయి. రాత్రుల సమయాల్లో నేల బావులు ఉన్నాయని గ్రహించక వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నేల బావులను పూడ్చించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

కనిగిరి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి మానవతాసంస్థ సహకారం అభినందనీయమని డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ మోడల్‌స్కూల్‌కు డీఎస్పీ చేతుల మీదుగా ప్రింటర్‌ను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోన్‌ను పక్కకునెట్టేసి చదువుపై దృష్టి పెడితే అనుకున్న లక్ష్యానికి చేరుకుంటారన్నారు. స్కూల్ కమిటీ చైర్మన్ పందిటి మోహన్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈసందర్భంగా రాత్రి సమయాల్లో విద్యార్థులు నివాసాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందన్నారు. పోలీసులను రక్షణగా ఏర్పాటు చేయాలని కోరారు. డీఎస్పీ సానుకూలంగా స్పందించి ప్రతిరోజూ పోలీసులను గస్తీగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ జాతీయ కన్వీనర్ గుత్తి శ్రీధర్, మానవతా సంస్థ చైర్మన్ సోమిశెట్టి శ్రీనివాసులు, అధ్యక్షుడు తానిగుండాల శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ కోమటి గుంట్ల బాబూరావు, తెలుగు మహిళ తులసి, ప్రిన్సిపాల్ రమణయ్య, కానిస్టేబుల్ నాయక్, హాస్టల్ వార్డెన్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

కురిచేడు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో మహిళ మృతిచెందిన ఘటన కురిచేడులో చోటుచేసుకుంది. ఎస్ఐ శివ తెలిపిన వివరాల ప్రకారం.. కురిచేడు పాత పోలీస్ స్టేషన్‌కు సమీపంలో పెద్దిసెట్టి సాంబశివరావు కుటుంబం నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో ఆయన భార్య శ్రీదేవి ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నట్లు సాంబశివరావు తెలిపారు. సాంబశివరావే భార్య శ్రీదేవిని చంపి ఉరి వేశాడని ఆమె తల్లి పత్తి వెంకటరత్నమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమర్టం కోసం దర్శి సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించారు. తల్లి మృతితో ఇద్దరు చిన్న పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం

దర్శి ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వైద్య రంగానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం 29 మంది బాధితులకు రూ. 21,72,554 సీఎం సహయనిధి చెక్కులను పంపిణీ చేశారు ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలు పలురకాల జబ్బులతో ఇబ్బంది పడుతూ ఆపరేషన్లు చేయించుకోలేక ఎదురుచూస్తున్న బాధితులకు సీఎం చంద్రబాబు దయార్ధహృదయంతో నిధులు విడుదల చేస్తున్నారన్నారు. దర్శి నియోజకవర్గంలో అధిక సంఖ్యలో లబ్ధిదారులకు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, టీడీపీ దర్శి పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, తాళ్ళూరు, ముండ్లమూరు మండలాల పార్టీ అధ్యక్షులు ఒబుల్‌రెడ్డి, కూరపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

దర్శి ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన బాధితులను మంగళవారం టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తదితరులు పరామర్శించారు. దర్శి పట్టణంలోని సందువారిపాలెంకు చెందిన సందు శ్రీనివాసరావు, సందు మధుల గృహాలకు వెళ్లి పరామర్శించారు. త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ కర్హ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు ఫార్మర్ ఐడీ

దొనకొండ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునికీకరణ చేసేందుకు కేంద్రప్రభుత్వం రైతులకు ఆధార్‌కార్డు తరహాలో 11 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో ఫార్మర్ ఐడీ అందించనుందని మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఆరవళ్లిపాడు గ్రామంలో జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పొలం ఉన్న ప్రతి రైతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, రాయితీలు పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. 11 అంకెల విశిష్ట సంఖ్య నమోదు(ఫార్మర్ రిజిస్ట్రీ) పూర్తి చేసుకున్న రైతులకు పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీలపై వ్యవసాయ యంత్ర పరికరాలు, రాయితీపై సూక్ష్మపోషకాలు, సూక్ష్మసేద్యంపై రాయితీ, పంట రుణాలు, పెట్టుబడి సాయం తదితర పథకాలు నేరుగా లబ్ధిపొందే అవకాశం ఉందన్నారు. రైతులు ఆధార్‌నెంబర్, ఆధార్ అనుసంధారిత ఫోన్, పట్టాదారు పాసుపుస్తకంతో సచివాలయాల్లోని వ్యవసాయ సహయకులను సంప్రదించాలని ఆయన కోరారు.

పామూరులో..

సీఎస్‌పురం(పామూరు) ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయభూమి కలిగిన ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏవో బి.సంపత్‌కుమార్ తెలిపారు. సీఎస్‌పురం మండలంలోని నల్లమడుగుల, శీలంవారిపల్లి గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా సాగులో ఉన్న కంది, జొన్న పంటలను పరిశీలించారు. కందిలో యజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి పావళి శ్రీనివాసులు, సహాయకులు కె.విజయ్‌భాస్కర్, వి.హరీష్ పాల్గొన్నారు. అలాగే, పామూరు మండలంలోని కంభాలదిన్నె, బొట్లగూడూరు గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో కె.రాధ పాల్గొన్నారు. రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఏఏలు ఎస్.నరేష్, ఏ.హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగులతో రక్తహీనత

దొనకొండ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అందించే అల్బెండజోల్ మాత్రలు రక్త హీనత నివారణకు ఎంతో ప్రయోజనకరమని ఏఎన్‌ఎం నాగలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక గౌతమీ డిగ్రీ కాలేజీలో వైద్యాధికారిణి డాక్టర్ సునీత ఆదేశాల మేరకు మంగళవారం విద్యార్థులకు ఆరోగ్య సిబ్బంది అల్బెండజోల్ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో గౌతమీ కాలేజీ అడ్మిన్ ఎప్రాయి మ్(నాని), ప్రిన్సిపాల్ రామయోగి, అధ్యాపకులు దేవదానం, విక్టోరియా, వెంకటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంతో ప్రయోజనాలు

తాళ్లూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేద్యంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం తూర్పుగంగవరం, నాగంబొట్లపాలెం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవి భూములు కల్గిన రైతులకు వ్యవసాయ అనుబంధ శాఖల లబ్ధి చేకూరేలా తోడ్పాటునందిస్తామని చెప్పారు. అటవీ భూములు కలిగిన రైతులతో మాట్లాడుతూ భూములు సారవంతంగా ఉన్నా నీటి సదుపాయం లేనందున పొలాలు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. బోర్ల కింద స్ప్రింకర్ల ద్వారా బిందు సేద్యం చేయటం వల్ల నీరు ఆదా అవుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు, ప్రకృతి సాగు ఇన్‌చార్జ్ నరసింహులు, వీఏఏ సుమ, ఐసీఆర్‌లు రమేష్, నాగకోటి రత్నం, అనంతలక్ష్మి, కాటంరాజు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీతిరుపతమ్మ తిరునాళ్ల

కురిచేడు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కురిచేడులోని మంచినీటి ఫిల్టర్‌బెడ్ల వద్ద కొండమీద వేంచేసి ఉన్న గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ తిరునాళ్ల మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్ల కల్యాణం కన్నులపండువగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులను అన్నదానం ఏర్పాటుచేశారు.

చేతిపంపులకు మరమ్మతులు

తాళ్లూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా ప్రభుత్వం క్యాస్ కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని బోర్లకు మరమ్మతులు చేస్తున్నట్లు ఎంపీడీవో దారా హనుమంతరావు తెలిపారు. మంగళవారం రామభద్రాపురం గ్రామంలో చేతి పంపుల మరమ్మతు పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టినట్టు చెప్పారు.

సీహెచ్‌సీలో అత్యవసర వైద్య సేవలు

పామూరు, ఫిబ్రవరి, 11 (ఆంధ్రజ్యోతి): గుండెపోటు గుర్తింపు, పరీక్షలు, అత్యవసర చికిత్స ఇంజెక్షన్‌లు స్థానిక సీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.ప్రవీణ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీహెచ్‌సీ వైద్యశాలలో గుండె జబ్బుల మరణాలను నివారించేందుకు సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. మొదటి గంటలోనే రూ.40 వేల విలువైన టెనిక్టిప్లెస్ ఇంజెక్షన్ ఉచితంగా అందించి ప్రాణాలు కాపాడవచ్చునని చెప్పారు. ప్రజలు గుండెజబ్బుల పట్ల నిర్లక్ష్యంగా ఉండకుండా స్థానిక సీహెచ్‌సీలో చికిత్స పొందాలని డాక్టర్ ప్రవీణ తెలిపారు.

కొండారెడ్డిని పరామర్శించిన టీడీపీ నేతలు

తాళ్లూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఒంగోలు పార్లమెంట్ కార్యనిర్వహక కార్యదర్శి శాగం కొండారెడ్డిని ఆపార్టీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య మంగళవారం వెలుగువారిపాలెంలోని ఆయన స్వగృహంలో పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. మెడికల్ రిపోర్టులను డాక్టర్ లలిత్ సాగర్ పరిశీలించి కొన్ని రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.



గృహ ప్రవేశాల పండగ..!

- సామూహిక ప్రారంభానికి అధికారుల చర్యలు
- 11,814 గృహ ప్రవేశాలే లక్ష్యం



- నరసరావుపేటలో పూర్తయిన గృహాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పేదలందరికీ ఇళ్ల కట్టిస్తాం.. ఇళ్లు కాదు ఊళ్లే నిర్మిస్తాం.. అంటూ గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం ముందుకు సాగలేదు. కాలనీలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలోనూ విఫలమయింది. చాలా చోట్ల ఇళ్ల నిర్మాణం పునాదుల స్థాయి దాటలేదు. వేల సంఖ్యలో ఇళ్ల నిర్మాణం నిలిచిపోయింది. ఇళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను కూడా దారి మళ్లించి లబ్ధిదారులకు మొండిచేయి చూపింది. పేదల సొంతింటి కల నెరవేర్చడంతో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇళ్ల నిర్మాణాలను పట్టాలెక్కించింది. పనులను వేగవంతం చేసింది. వేల సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసింది. పేదల ఇళ్లలో సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతోంది.

వైసీపీ ప్రభుత్వంలో నత్తనడకన సాగిన ఇళ్ల నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం వేగవంతం చేసింది. గృహాల నిర్మాణం పూర్తికి జిల్లాల వారీగా అధికారులకు నెల వారీగా లక్ష్యాలను నిర్దేశించింది. పల్నాడు జిల్లాలో 4,870 గృహాలు, బాపట్ల జిల్లాలో 2,402, గుంటూరు జిల్లాలో 4,542 ఇళ్లలో గృహప్రవేశాలు లబ్ధిదారుల చేత చేయించాలని ప్రభుత్వం గృహ నిర్మాణ శాఖకు లక్ష్యాలను నిర్దేశించింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఈ నెలలో జరగాల్సిన గృహ ప్రవేశాలను వాయిదా వేసింది. మార్చిలో సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేర కు జిల్లాల వారీగా ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. లక్ష్యాల మేర ఇళ్ల నిర్మాణాలను గృహనిర్మాణ శాఖ పూర్తి చేసింది. పల్నాడు.. గుంటూరు.. బాపట్ల జిల్లాల్లో 11,814 గృహాలను పూర్తి చేసినట్లు ఆ శాఖ గణాంకాలు తెలియ జేస్తున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ 8 వరకు ఉండ టంతో ఆ తదుపరి గృహప్రవేశాలకు మంచి ముహూర్తాన్ని ఖరారు చేయనున్నారు.

మార్చి నెలాఖరుకు 12,392 గృహాల నిర్మాణం

ఒక వైపు సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించడంతో పాటు మూడు జిల్లాల్లో మార్చి నెలాఖరు కల్లా 12,392 గృహాల నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులకు టార్గెట్‌లు ఇచ్చింది. ఈ మేరకు ఇళ్ల నిర్మాణం పూర్తికి అధికారులు చర్యలు చేపట్టారు. గృహ నిర్మాణాలను వేగవంతం చేశారు. మార్చి నెలాఖరుకు పల్నాడు జిల్లాలో 3,143 ఇళ్ల పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. బాపట్ల జిల్లాలో 4,898, గుంటూరు జిల్లాలో 4,359 ఇళ్ల పూర్తి చేసేందకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. లబ్ధిదారులతో చర్చలు జరిపి ఇంటి నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేస్తున్నారు. గృహ నిర్మాణ శాఖ ఉన్న తాధికారులు క్షేత్ర స్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

మిర్చికి.. కూలి ఘాటు

- క్వింటాల్ రూ.10 వేలు.. కూలి రూ.6 వేలు
- పంట అమ్మగా వచ్చినదాంట్లో సగం కూలి ఖర్చు
- కర్నూలు కూలీలు రాకపోవడంతో పెరిగిన రేట్లు
- ఎకరాకు సాగు ఖర్చు రూ.1.50 లక్షల నుంచి రూ.2.20 లక్షలు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మిర్చి రైతులపై ఏదో ఒకవిధంగా దెబ్బ పడుతూనే ఉంది. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల రైతులపై పెరిగిన కూలి రేట్ల కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. ప్రస్తుతం గుంటూరు మిర్చి యార్డులో డీలక్స్ రకాలు క్వింటాల్‌కు రూ.9 వేల నుంచి రూ.10 వేలు మాత్రమే పలుకుతున్నాయి. తేజ రకం మాత్రం రూ.11 వేల నుంచి రూ.13 వరకు పలుకుతోంది. అయితే ఒక కేజీ మిరప కాయలు కోసినందుకు రూ.16 వరకు కూలి తీసుకుంటున్నారు. మూడు కేజీలు పండు మిరపకాయలు కోస్తే అవి ఎండేటప్పటికి ఒక కేజీ అవుతున్నాయి. ఈ లెక్కన ఒక కేజీ ఎండు మిరప కాయల కోత కూలీ రూ.48 వరకు అవుతుంది. కొన్ని చోట్ల రోజు కూలి చొప్పున కోతలు కోస్తున్నారు. రోజుకు కూలి రూ.470 వరకు చెల్లిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కోత కోస్తే ఈ కూలి ఇస్తారు. తాలుకాయలు (తెల్లకాయలు) ఏరినందుకు రోజుకు రూ.600 వరకు చెల్లిస్తున్నారు. రైతులు చెబుతున్న లెక్క ప్రకారం ఒక క్వింటాల్ మిర్చి కోతకు 12 మంది కూలీలు అవసరం. ఈ లెక్కన క్వింటాల్‌కు కూలి రూ.6 వేలకు తక్కువ కావడం లేదని తెలుస్తోంది.

వలస కూలీలు రాకే..

వాస్తవానికి కర్నూలు నుంచి మిర్చి కోతల కోసం ప్రతి ఏటా పెద్దసంఖ్యలో కూలీలు వలస వచ్చే వారు. అయితే ఈ ఏడాది వలస వచ్చేందుకు అక్కడి కూలీలు ఇష్ట పడటంలేదు. అక్కడే మిర్చి కోతలు ఎక్కువగా ఉండటం, కూలి కూడా రోజుకు రూ.250 వరకు పడుతుండటంతో చాలామంది ఇటువైపునకు రాలేదు. దానివల్ల మిర్చి సీజన్‌లో కూలీల కొరత ఏర్పడింది. స్థానికంగా ఉన్న కూలీలకు బాగా డిమాండ్ వచ్చింది. స్థానికులు రూ.470కి తక్కువ ఇస్తే కోతకు రామని ముందే చెబుతున్నారు ప్రస్తుతం ఉన్న మిర్చి ధరల ప్రకారం పండిన పంటలో సగ భాగం కూలి ఖర్చులకు పోతుండగా, సగం మాత్రమే రైతులకు పెట్టుబడి, లాభాల కింద మిగులుతుంది.

మిర్చి సాగు.. మంట పుట్టిస్తోంది. ఒకవైపు ధర లేక రైతులు అల్లాడుతుంటే.. మరోవైపు అమాంతం పెరిగిన కూలి రేట్లు కోలుకోలేని విధంగా నష్ట పరుస్తున్నాయి. తెగుళ్లతో దిగుబడులు తగ్గిపోగా వాటిని అమ్ముకు నేందుకు సతమతం అవుతున్నారు. అరకొరగా వచ్చిన పంటను కోసేందుకు సిద్ధమవగా కూలీలు దొరక్క. ఉన్న కూలీలు అమాం తం కూలి రేట్లు పెంచేయడంతో ఏమి చేయాలో పాలు పోని పరిస్థితుల్లో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిర్చి క్వింటాల్ రూ.6 వేలు ఉండగా.. ఎకరా కోత కూలి ఖర్చు రూ.10 వేలు వరకు వెచ్చిం చాల్సి వస్తోం ది. ఒకవైపు సాగు ఖర్చు లు పెరిగిపోగా కోతలో సగ భాగం కూలి ఖర్చులకే పోతోందని కన్నీటి పర్యంతమవుతున్నారు. ఈ ఏడు హఠాత్తుగా పెరిగిన కూలి రేట్లు మిర్చి రైతులను పాతాళంలో పడేస్తున్నాయి.

ఎకరాకు రూ.లక్ష నష్టం..

ఈ ఏడాది ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలోని రైతులు పెట్టుబడి కింద పెద్దమొత్తంలో వ్యయం చేశారు. ప్రకాశం జిల్లాలో పెట్టుబడి కింద ఎకరాకు రూ.1.50 లక్షలు వరకు వెచ్చించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎకరాకు పెట్టుబడి రూ.1.80 లక్షల నుంచి రూ.2.20 లక్షల వరకు ఖర్చు అయినట్లు రైతులు తెలిపారు. కౌలు రేట్లు ఎక్కువ కావడం, నల్లి తెగులు బెడదతో పెట్టుబడులు పెరిగిపో యాయి. ఈ లెక్కన మిర్చి పంట అమ్మగా వచ్చినదాంట్లో సగం కూలి ఖర్చు అవుతుంటే రైతుకు ఎకరాకు రూ.లక్ష నుంచి రూ. లక్షన్నర వరకు తక్కువలో తక్కువ నష్టం వస్తుందని తెలుస్తోంది.

కూలీలు తక్కువగా వచ్చారు



ప్రతి ఏటా కర్నూలు నుంచి కూలీలు ఎక్కువ సంఖ్యలో వస్తే ఇంత ఇబ్బంది ఉండే ది కాదు.కూలి రేటు బాగా పెరిగింది. రోజుకు రూ.400 కూలి, ఆటో ఖర్చు రూ.50 వరకు ఖర్చైంది. క్వింటాల్ మిర్చి అమ్మితే వచ్చిన దాంట్లో సగం కూలికే ఖర్చయితే రైతుకు మిగిలేది ఏమిటి.

హనుమంతరావు, తాళ్లచెరువు, పల్నాడు జిల్లా

నిండా మునిగినట్లే..



మిర్చి ఎందుకు వేశామో అర్థం కావడం లేదు. రైతుకు మిగిలేది ఏమి లేదు. ఇక్కడ రేటు చూస్తే చాలా తక్కువ ఉంది. అక్కడ కూలీల రేటు ఆకా శాన్ని అంటింది. వచ్చిన దాంట్లో సగం కూలీలకు పోతుంటే ఇక మాకు మిగిలేదేమిటి. ఈ ఏడాది నిండా మునిగినట్లే.

- దళారి వెంకట నర్సయ్య, వాదం పల్లె, యర్రగొండ పాలెం

ఉన్నది అమ్మి అప్పు కట్టాలి



ఈ ఏడు మా పని అయిపోంది. ఏదో రేటు వస్తుందని మిర్చి వేస్తే వేసిన రోజు నుంచి నిద్ర పోయింది లేదు. ఎప్పుడూ ఏదో ఒక సమస్య. పంటను గుంటూరు యార్డుకు తీసుకురావడానికి మేము పడిన కష్టం పగవాడికి కూడా రాకూడదు. కూలి రేటు చూస్తే గుం డెల్లో రైళ్ల పరుగెత్తుతున్నాయి. సగం కూలికే పోతే ఇక మందులు కొట్టేందుకి ఏమి ఇవ్వాలి. ఉన్నది అమ్మి కట్టాల్సిందే.

- బాదరయ్య, గంగాపాలెం, యర్రగొండపాలెం



విచ్చలవిడి వినియోగం

- ఎరువుల వాడకంపై ఆలకించని రైతులు
- రబీ మొత్తానికి వాడాల్సినవి జనవరికే పూర్తి
- ఎకరాకు 8 కట్టలకుపైగా యూరియా.. మోతాదుకు మించి డీఏపీ
- పంజాబ్ తర్వాత ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే ఎక్కువ వాడకం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువులు.. మేలు చేయవు. కాలుష్యాలను వెదజల్లుతున్నాయి.. పంటకు నష్టం.. భూమి నిస్సారం.. అని వ్యవసాయశాస్త్రవేత్తలు, ప్రభుత్వం హెచ్చరిస్తోంది. అయినా రైతులు ఆ మాటలను ఆలకించడంలేదు. దిగుబడి పెరుగుతుందనే అపోహతో విచ్చలవిడిగా ఎరువులను వినియోగిస్తున్నారు. గుంటూరు జిల్లాలో రబీ సీజన్ మొత్తానికి 70,826 మెట్రిక్ టన్నుల యూరియా, 19,225 మెట్రిక్ టన్నుల డీఏపీ, 3322 మెట్రిక్ టన్నుల పొటాష్ వాడాలి. కానీ రైతులు నిర్దేశించిన ఎరువుల నిల్వలన్నీ జనవరిలోనే ఖాళీ చేసేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పంజాబ్ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే యూరియా, ఇతర ఎరువుల వాడకం ఎక్కువగా ఉందని కేంద్రం హెచ్చరింది. అయినా పరిస్థితిలో ఏమాత్రం మార్పు రావడంలేదు. ఈ విధానంపై సర్వత్రా ఆందోళన నెలకొంది. చాలా చోట్ల ఎకరాకు 8 కట్టలకు పైగా యూరియా వాడినట్లు తేలింది. డీఏపీ, పొటాష్ వాడకం కూడా అంతే ఉంది. ఎక్కువ తింటే ఏమౌతుంది? భుక్తాయాసం వస్తుంది. భూమి పరిస్థితి కూడా అంతేనని హెచ్చరిస్తున్నా రైతులు మేలుకోవడంలేదు. ఎరువులు ఎక్కువ వాడకం వల్ల భూమి సహజతత్వం కోల్పోతోందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా అన్నదాతలు ఆలకించడంలేదు. ఎరువుల వాడకంపై వ్యవసాయ శాఖ ప్రతి సీజన్‌లో ప్రత్యేకంగా కరపత్రాలు ముద్రించి రైతులకు తగిన సూచనలు చేస్తున్నా ఫలితం ఉండటం లేదు.

అపోహలతో.. నష్టం

ఎరువులు ఎక్కువ వాడితే భూమికి బలం పెరిగి దిగుబడి పెరుగుతుందని రైతుల భావన. నత్రజని పోషకంతో ఉండే యూరియా రసాయన ఎరువు వేస్తే పైరు ఏపుగా పెరిగి అధిక దిగుబడి వస్తుందనే అపోహ రైతుల్లో ఉంది. దానివల్ల సీజన్‌తో సంబంధం లేకుండా ఎరువులను ఎక్కువగా చల్లేస్తున్నారు. ఎరువులు ఎక్కువగా వాడటం వల్ల భూమి నిస్సారం అవుతుందని, దీర్ఘకాలం తర్వాత ఈ నష్టం కని పిస్తుందని శాస్త్ర వేత్తలు చెబుతున్నారు. ఉదాహరణకు.. భాస్వరం పోష కాన్ని పంటలకు ఇచ్చేందుకు డై అమ్మోనియం పాస్పేట్(డీఏపీ) పేరుతో మార్కెట్లో రసాయన ఎరువులను విక్రయిస్తున్నారు. ఎరువులను నిరంతరం ఉపయోగించడం వల్ల నేల పీహెచ్ విలువ మారు తుందని, పైరు తెగుళ్ల బారిన పడే అవకాశం పెరుగు తుందని వ్యవసాయశాఖ చెబుతోంది. రసాయన ఎరువుల అధిక వినియోగం నేల ఆమ్లీకరణను వేగవంతం చేస్తుందని, నేలపై పొరలోనూ మార్పులు వస్తాయని చెబుతున్నారు. రైతులు తమ పొలాలకు వినియోగించే రెండు ప్రధాన ఎరువులు నత్రజని, భాస్వరం. పరిశోధన ప్రకారం పంటలపై ఉపయోగించే నత్రజనిలో దాదాపు మూడింట రెండు వంతులు కాలుష్య కారకంగా మారుతున్నట్లు తెలుస్తోంది. దానివల్ల వాతావరణ కాలుష్యం పెరిగిపోతోందని చెబుతున్నారు.

అవసరానికి మించి భాస్వరం

భాస్వరం రసాయన ఎరువు వినియోగం ఏకంగా 36 శాతం పెరిగినట్లు అధ్యయనంలో గుర్తించారు. కొన్ని ప్రాంతాల్లో భూసార పరీక్షలు చేస్తే నేలలో అవసరానికి మించి భాస్వరం ఉన్నట్లు తేలింది. ఇది ఎక్కువగా ఉంటే డీఏపీ ఎరువును పెద్దగా వాడాల్సిన అవసరం ఉండదు. అయినా ఉమ్మడి గుంటూరు జిల్లాలో డీఏపీ ఎక్కువగా చల్లుతున్నారు.

సిఫార్సులను బట్టే చల్లాలి..

ఎరువుల వాడకంలో రైతుల్లో కొన్ని అపోహలు ఉన్నట్లు వ్యవసాయశాఖ గుర్తిం చింది. రైతులందరూ మొదటి సారి డీఏపీ వేయాలనే అపోహతో ఉంటున్నట్లు తెలుస్తోంది. పోషకాలను ఇతర కాంప్లెక్స్ ఎరువుల రూపంలో కూడా మోతాదును లెక్క కట్టి వేసి నా పంట ఎదు గుదల, దిగుబడిలో

(మిగతా 8వ పేజీలో)

మండలి బరిలో.. 30 మంది

- ఎమ్మెల్సీ నామినేషన్ల పరిశీలన పూర్తి
- 10 మంది అభ్యర్థుల నామినేషన్ల తిరస్కరణ



కలెక్టరేట్‌లో అభ్యర్థుల సమక్షంలో నామినేషన్లను పరిశీలిస్తున్న ఆర్‌వో నాగలక్ష్మి, అబ్జర్వర్ కరుణ

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల నామినేషన్ల పరిశీలన పూర్తి అయింది. మొత్తం 40 మంది అభ్యర్థులకు చెందిన 69 నామినేషన్లను పరిశీలించారు. 10 మంది అభ్యర్థుల నామినేషన్లను వేర్వేరు కారణాలతో తిరస్కరించారు. అన్ని సవ్యంగా ఉన్న 30 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమో దిస్తున్నట్లు ఆర్‌వో నాగలక్ష్మి ప్రకటించారు. మంగళవారం గుంటూరు కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అభ్యర్థుల సమక్షంలో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ జరిగింది. ఈ కార్యక్రమానికి అబ్జర్వర్ వీ కరుణ హాజరయ్యారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ తరపున హాజరైన ఎన్నికల ఏజంట్ సతీష్ గవిని ఒక అభ్యంతరాన్ని లేవనెత్తారు. నాన్ జ్యూడీషియల్ స్టాంపు పేపర్‌పై అఫిడవిట్లు సమర్పించని అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించాలని కోరారు. ఆ అభ్యంతరాన్ని ఆర్‌వో తిరస్కరించారు. ఇదే రీతిన అంబాల రాజకుమార్ అనే అభ్యర్థి ఓటర్ల జాబితాలో 9 మంది ప్రతిపాదన చేసి వారి పేర్లు సరిపోయినా నామినేషన్ ఆమోదించాలన్నారు. దీనిని కూడా తిరస్కరిస్తున్నట్లు ఆర్‌వో ప్రకటించారు. ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ నాలుగు నామినేషన్లు దాఖలు చేయగా అన్నింటిని ఆమోదించారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మూడు నామినేషన్లు వేయగా ఆమోదించారు. టీడీపీ జారీ చేసి బీ ఫారంలో ప్రధాన అభ్యర్థిగా రాజేంద్రప్రసాద్ పేరు ఉండటంతో ఆయన సతీమణి మాధవి దాఖలు చేసిన రెండు నామినేషన్లను తిరస్కరించారు. వీరితో పాటు (మిగతా 8వ పేజీలో)

జేఈఈ టాపర్ సాయిమనోజ్ఞ



- సాయి మనోజ్ఞకు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు పద్మజ, కిశోర్ చౌదరి,భాష్యం ఐఐటీ కోఆర్డినేటర్ ఆనంద్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్‌టీఏ) మంగళవారం ప్రకటించిన జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్ ఫలితాల్లో జేకేసీ రోడ్డు ప్రాంతానికి చెందిన విద్యార్థిని గుత్తికొండ సాయి మనోజ్ఞ అగ్రస్థానంలో నిలిచింది. తల్లి పద్మజ గృహిణికాగా, తండ్రి కిశోర్‌చౌదరి ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్. కాగా పదో తరగతి వరకు గుంటూరులోని లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో సాయిమనోజ్ఞ చదివింది. ఇక ఇంటర్ విద్య భాష్యంలో సాగింది. కాగా ఇటీవల జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్ పరీక్షలు రాసిన మనోజ్ఞ జాతీయ స్థాయిలో నూరుశాతం పర్సంటైల్‌తో ఓపెన్ కేటగిరిలో టాపర్‌గా నిలిచింది. టాపర్‌గా తమ కుమార్తె నిలవడంతో తల్లిదండ్రులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. కాగా భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేతరామ్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఆనంద్ సాయిమనోజ్ఞను అభినందించారు.

ఐఐటీలో ఈసీఈ సీటు సాధిస్తా

ప్రణాళికబద్ధంగా చేసిన కృషి, సమయ పాలన, తల్లిదండ్రుల సహకారం, అధ్యాపకుల ప్రోత్సాహంతో జేఈఈలో అత్యుత్తమ ర్యాంకు సాధించినట్లు సాయిమనోజ్ఞ తెలిపారు. రోజుకు కనీసం 12 గంటలు చదివినట్లు చెప్పారు. కష్టంతో కాకుండా ఇష్టంతో చదవడం వల్లే అత్యుత్తమ ర్యాంకు సాధ్యమైందన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే భాష్యం సంస్థలు అమలు చేసే కరిక్యులం టాపర్‌గా నిలవడానికి దోహదపడిందన్నారు. ఒత్తిడిని అధిగమించడానికి స్ఫూర్తిప్రదాతలతో చైర్మన్ రామకృష్ణ, కోఆర్డినేటర్ ఆనంద్ కౌన్సిలింగ్ ఇప్పించారని తెలిపారు. అడ్వాన్స్ పరీక్షకు సన్నద్ధమౌతున్నానని, ప్రతిష్ఠాత్మక ఐఐటీలో ఈసీఈ బ్రాంచిలో సీటు సాధించడమే లక్ష్యమని విద్యార్థిని తెలిపారు.

నిధుల గోల్‌మాల్‌పై నివేదికలు సిద్ధం

- 1 ఇష్టారీతిన పంచాయతీల్లో సొమ్ములు స్వాహా
- 1 18 పంచాయతీలపై విచారణకు ప్రభుత్వం ఆదేశాలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

నిబంధనలు పట్టలేదు.. అధికారం తోడుగా ఉంది.. చెప్పినట్లే తలాడించే సిబ్బంది ఉన్నారు.. ఇంకేముంది గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు గ్రామ పంచాయతీల నిధులను బొక్కేశారు. పంచాయతీల్లో అవకతవకలు జరుగుతున్నాయని వైసీపీ ప్రభుత్వం చివరి మూడేళ్లలో దాదాపు 800 వరకు ఫిర్యాదులు ఉన్నతాధికారులకు అందినా బుట్టదాఖల య్యాయి. పంచాయతీల్లో జరిగిన నిధుల గోల్‌మాల్‌పై కూటమి ప్రభుత్వం కొలువు దీరిన తొలినాళ్లలోనే దృష్టి సారించింది. గతంలో విచారణకు ఆదేశించిన పంచాయతీలతో పాటు ఆరోపణలు వచ్చిన మరి కొన్నింటిపై కూడా ఇటీవలే కలెక్టర్ వెంకటమురళి విచారణాధికారులను నియమించారు. దీంతో అక్రమార్కుల గుండెల్లో వణుకు మొదలైంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 18 పంచాయతీల్లో నిధుల గోల్‌మాల్ భారీగా జరిగినట్లు కూటమి ప్రభుత్వం ఓ నిర్ధారణకు వచ్చింది. వీటిల్లో పదింటికి సంబంధించి విచారణ నివేదికలు ఇప్పటికే సిద్ధమయ్యాయి

నాలుగు గ్రామాల నిధులు ఒక పంచాయతీకే...

వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలు చెప్పిందే రూల్ పొజిషన్‌గా మారిందనడానికి బల్లికురవ మండల పరిధిలోని కొణిదెనలో జరిగిన నిబంధనల ఉల్లంఘన పరాకాష్టగా నిలిచింది. నాలుగు పంచాయతీలకు పంచాల్సిన నిధులను ఒకే పంచాయతీకి మళ్లించేశారు. దీనికి సంబంధించి గతేడాది జూలై చివరిలోనే ప్రభుత్వానికి నివేదికలను అప్పటి డీపీవో రవికుమార్ అందించారు. కారంచేడు మండలం కుంకలమర్రు పరిధి గ్రామ పంచాయతీలో జరిగిన అవకతవకలపై అధికారులు నివేదిక సిద్ధం చేశారు. పడమర బాపట్ల గ్రామ పంచాయతీలోని దాదాపు రూ.80 లక్షల గోల్‌మాల్ స్థానిక వైసీపీ నేతల కనుసన్నల్లోనే జరిగినట్లు అధికారులు నివేదికలో పొందు పర్చినట్లు తెలుస్తోంది. ఇంకొల్లు మేజర్ పంచాయతీలో దాదాపు రూ.2 కోట్లను దుర్వి నియోగం చేశారన్న ఆరోపణలపై ఎట్టకేలకు నివేదిక సిద్ధమైంది. పంచాయతీల్లో నిధులు అవకతవకలకు సంబంధించి జంపనిలో రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. రేపల్లె డివిజన్ పరిధిలోని పల్లెకోన, మోదుకూరు పంచాయతీల్లో జరిపిన విచారణ నివేదికలను అధికారులు ప్రభుత్వం ముందుంచారు. ఇవే కాకుండా జిల్లా వ్యాప్తంగా మరో పన్నెండు పంచాయతీల్లో వి చారణ జరిపి ఆ వివరాలను సమగ్రంగా ప్రభుత్వానికి నివేదికల రూపంలో అధికారులు అందించారు



ఇంకొల్లు గ్రామ పంచాయతీ కార్యాలయం

చర్యలే తరువాయి..

గత ప్రభుత్వంలో పంచాయతీల్లో జరిగిన గోల్‌మాల్ వ్యవహారాలపై నివేదికలు ఇప్పటికే ఉన్నతాధికారులకు అందడంతో రేపోమాపో చర్యలు తీసుకునే అవకాశాలు కనబడుతున్నాయి. నిధుల రికవరీపై కూడా దృష్టి సారించబోతున్నట్లు తెలుస్తోంది. దాదాపు 15 మంది పంచాయతీ సిబ్బందికి నోటీసులు జారీ చేయడానికి సిద్ధమైనట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సంతమాగులూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిలో ఏల్చూరు పుట్టవారిపాలెం మధ్య బైకును టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఏల్చూరు శివారు రామిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన డీ రామారావు (48) మృతి చెందారు. రామిరెడ్డి పాలెం నుంచి పుట్టావారిపాలెంకు వెళుతున్న రామారావు బైకును వెనుక నుంచి మట్టి లోడుతో వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. రామారావు అక్కడికక్కడే మృతిచెందారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై పట్టాభిరామయ్య తెలిపారు.

రీసర్వేలో లోపాలు లేకుండా చూడాలి

- నాలుగు టీంలకు షోకాజ్ నోటీసుల జారీకి కలెక్టర్ ఆదేశం



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేలో లోపాలు లేకుండా చూసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. సంతనూతలపాడు మండలం ఎం.వేములపాడులో మంగళవారం సాయంత్రం రీసర్వేను పరిశీలించారు. ఈ గ్రామంలో 400కు పైగా ఎకరాలను సర్వే చేశామని, విలేజ్ బౌండరీ కూడా సర్వే చేశామని, ప్రభుత్వ భూముల సర్వే 50శాతం పూర్తయిందని ఈ సందర్భంగా అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కాగా ఎంతమంది రైతుల భూములను మంగళవారం సర్వే చేశారు, ఎన్ని బృందాలు ఫీల్డ్ విజిట్‌లో ఉన్నాయి అని ఆమె అధికారులను ప్రశ్నించారు. ఏడుగురు రైతులకు సంబంధించిన 30 ఎకరాలను సర్వే చేశామని వారు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో ఆర్డీవో లక్ష్మీప్రసన్న ద్వారా ఇద్దరు రైతులకు కలెక్టర్ ఫోన్ చేయించారు. ఎన్ని రోజులు ముందుగా సర్వేకు సంబంధించి నోటీసులు ఇచ్చారు, మీ సమక్షంలోనే భూములను సర్వే చేశారా? అని ఆర్డీవో ద్వారా ఆరా తీశారు. ఐదు టీంలుకు గాను ఒక టీం మాత్రమే ఫీల్డ్‌లో ఉన్నట్లు తెలుసుకున్న కలెక్టర్ మిగిలిన నాలుగు టీంలకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని సర్వేశాఖ సహాయ సంచాలకులు గౌస్‌బాషాను ఆదేశించారు. అనంతరం వేములపాడు సచివాలయాన్ని తనిఖీ చేశారు. భూముల రికార్డులకు సంబంధించిన ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను పరిశీలించారు. మ్యుటేషన్ విషయంలో నిబంధనలు ఉల్లంఘించరాదని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సచివాలయానికి వచ్చిన రైతులతో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

వరికోత యంత్రం కింద పడి రైతు మృతి

టంగుటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : వరికోత యంత్రం కింద పడి రైతు మృతి చెందిన ఘటన మండలంలోని సూరారెడ్డిపాలెంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పీలా పాండు (78) మూడు ఎకరాల్లో వరి సాగు చేశారు. సోమవారం యంత్రంతో వరి కోయిస్తున్నారు. ఈ సమయంలో యంత్రాన్ని డ్రైవర్ రివర్స్ చేస్తుండగా వెనుక ఉన్న పాండు దాని కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై నాగమల్లీశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పాండు కుమారుడు రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

డీఎస్పీ శ్రీనివాసరావు

సింగరాయకొండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఆదేశించారు. మంగళవారం సింగరాయకొండ పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రతిరోజూ విజిబుల్ పోలీసింగ్ చేయాలని సూచించారు. సీసీ కెమెరాలు నేర నియంత్రణకు దోహదం చేస్తాయని తెలిపారు. ప్రజలను చైతన్యపరిచి వారి గృహాలు, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు.

ప్రభుత్వ భూమిలో గ్రానైట్ వ్యర్థాలు

దశాబ్దాల దారిని మూసివేశారని రైతుల ఆందోళన

ఆర్ణా క్వారీ అక్రమాలపై ఫిర్యాదులు

పరిశీలించిన మైనింగ్, రెవెన్యూ అధికారులు

బల్లికురవ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో దశాబ్దాల నుంచి రైతులు పొలాలకు వెళ్లే దారిని బాచిన కృష్ణచైతన్యకు సంబంధించిన ఆర్ణా గ్రానైట్ క్వారీ ఆక్రమించింది. లీజులు పొందడమేగాక ఇష్టానుసారంగా ప్రభుత్వ భూముల్లో గ్రానైట్ వ్యర్థాలను డంప్ చేసిందని మల్లాయపాలెనికి చెందిన రైతులు రాష్ట్ర స్థాయి అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. గతంలో పనిచేసిన అధికారులు కొందరు ఇష్టానుసారంగా వ్యవహరించడం వలనే ఆ భూములను గ్రానైట్ క్వారీ నిర్వాహకులు ఆక్రమించుకున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

బల్లికురవ మండలం కొణిదెన రెవెన్యూ పరిధిలోని మల్లాయపాలెం సర్వే నెంబరు 934/14లో 3.95 ఎకరాల ప్రభుత్వ డొంక పోరంబోకు భూమి ఉంది. అలానే సర్వే నెంబరు 934/17/11లో 2.55 సెంట్లలో నీరు పారే వాగు భూమి ఉంది. ఆ భూముల్లో నుంచి ఆ గ్రామ రైతులు ఎన్నో దశాబ్దాల నుంచి పంట పొలాలకు వెళుతున్నారు. ఆ భూముల పక్కనే ఆర్ణా క్వారీ యజమానులు కొంత కాలం నుంచి రైతులకు ఇబ్బందులు కలిగించేలా గ్రానైట్ వ్యర్థాలను పోస్తున్నారు. ప్రస్తుతం ఆ వ్యర్థాలు కొండలను తలపించేలా ఉండడంతో రైతులు పొలాలకు వెళ్లే దారిమూసుకుపోయింది. పురాతనకాలం నుంచి ఉన్న ప్రధాన దారికి సైతం తాము లీజు పొందామంటూ క్వారీ యజమానులు రైతులకు ఆటంకాలు కలిగిస్తున్నారు. అధికారులు సైతం అడ్డగోలుగా రోడ్లకు లీజ్ ఎలా ఇస్తారని, అసలు దారి ప్రభుత్వ భూమిగా రికార్డులో ఉందని రైతులు అంటున్నారు. గ్రానైట్ క్వారీ నిర్వాహకులు తమ ఇష్టానుసారంగా విలువైన ప్రభుత్వ భూమిపై కన్నేసి డంప్ వేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్ణా గ్రానైట్ క్వారీ ఆక్రమించిన ప్రభుత్వ భూమితో తమకు తీవ్ర ఇబ్బందులు ఉన్నాయని, వెంటనే డంప్‌ను తొలగించాలని మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు రైతులు ఫిర్యాదులు చేశారు. పది రోజుల కిందట చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, మైనింగ్ అధికారులు.. రైతులు ఫిర్యాదులు చేసిన డంపింగ్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మైనింగ్, రెవెన్యూ సర్వేయర్ల ద్వారా కొలతలు వేయిస్తామని చెప్పి వెళ్లారు. దీనిపై రైతులు మళ్లీ ఫిర్యాదు చేయడం మొదలుపెట్టారు. వెంటనే ప్రభుత్వ భూమిలో దారికి అడ్డుగా ఉన్న వ్యర్థాలను తీసి వేయించాలని వారు కోరుతున్నారు.



పొలాలకు వెళ్లకుండా వాగు భూమిలో అడ్డుగా వేసిన డంప్



కొండను తలపించేలా పడవేసిన గ్రానైట్ వ్యర్థాలు

ప్రభుత్వ భూముల్లో వ్యర్థాలపై ఫిర్యాదు

మల్లాయపాలెం పరిధిలో ఉన్న డొంక పోరంబోకు, వాగు పోరంబోకు ప్రభుత్వ భూమిలో నిబంధనలు అతిక్రమించి ఆర్ణా గ్రానైట్ క్వారీ వారు పెద్ద ఎత్తున వ్యర్థాలను తెచ్చి డంప్ చేస్తున్నారు. ప్రస్తుతం అది కొండలా మారింది. అటుగా వెళ్లే రైతులకు దారి మూసుకుపోయింది. దీంతో గ్రామానికి చెందిన లేమాటి శ్రీనివాసరావు, మరి కొందరు రైతులు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, మైనింగ్ డీఎంజీ, కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌కు పది రోజులుగా ఫిర్యాదు చేస్తున్నారు. రైతుల ఫిర్యాదు మేరకు అధికారులు రంగంలోకి దిగారు. గతంలో దారి ఎలా ఉంది. ఇప్పుడు పరిస్థితి ఏంటని ఆరా తీసి అన్ని రికార్డులను పరిశీలించారు. గతంలో యానాది సంఘం అక్కడ ఉందని, వారు కూడా ఆ దారిని ఉపయోగించుకునేవారని రైతులు అధికారులకు తెలిపారు.

రామతీర్థం సామర్థ్యం పెంపు ప్రణాళికలు

జలవనరుల శాఖ అధికారులతో బీఎన్ భేటీ

గుండ్లకమ్మలో చెక్‌డ్యామ్‌లు, ఇతర పనులపై సమీక్ష



ఎస్ఈ, డిప్యూటీ ఎస్ఈలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

ఒంగోలు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న నీటి అవసరాలకు అనుగుణంగా రామతీర్థం ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం పెంపు కోసం ప్రణాళికలు రూపొందించాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ జలవనరులశాఖ అధికారులను కోరారు. నియోజకవర్గంలో జలవనరులశాఖ పరిధిలో ఉన్న రామతీర్థం రిజర్వాయర్, ఎన్ఎస్‌పీ ఆయకట్టు కాలువలు, గుండ్లకమ్మలో చెక్‌డ్యామ్‌ల నిర్మాణాల ప్రతిపాదనలపై స్థానిక మంగమూరురోడ్డులోని తన కార్యాలయంలో మంగళవారం ఆ శాఖ అధికారులతో సమావేశమై చర్చించారు. జలవనరుల శాఖ ఎస్ఈ వరలక్ష్మి, డిప్యూటీ ఎస్ఈ రామకృష్ణ ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. రామతీర్థం నిర్మాణ సమయంలో ఆ ప్రాజెక్టుకు దిగువన ఉన్న 70వేల ఎకరాల ఎన్ఎస్‌పీ ఆయకట్టు స్థిరీకరణ, ఒంగోలు ఎస్ఎస్ ట్యాంకుతోపాటు ఇతర గ్రామాల్లోని తాగునీటి చెరువులను పరిగణనలోని తీసుకొని 1.50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించినట్లు అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతర కాలంలో కందుకూరుతోపాటు కనిగిరి, తాళ్లూరు, కొండపి, ప్రాంతాలు అలాగే కేవీపాలెం తాగునీటి పథకాలకు రామతీర్థం నుంచి నీటిని ఇచ్చేలా ఏర్పాటు చేయడంతో పాటు రామతీర్థం రిజర్వాయర్‌లో పూడిక కూడా రావడంతో నిల్వ కొంత తగ్గిందని దీంతో అసలు ఉద్దేశమైన సాగర్ ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యం నెరవేరడం లేదన్న అభిప్రాయం ఎమ్మెల్యే బీఎన్ అధికారుల ఎదుట వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో రిజర్వాయర్ సామర్థ్యం పెంపునకు ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదించాలని అధికారులను కోరారు.

మరో టీఎంసీ పెంపునకు అంచనాలు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రామతీర్థం సామర్థ్యాన్ని ప్రస్తుతం ఉన్న 1.50 టీఎంసీలకు అదనంగా మరో టీఎంసీ పెంచి 2.50 టీఎంసీల నిల్వ చేసేలా ప్రతిపాదనలు రూపొందించారన్న ఎమ్మెల్యే బీఎన్ తాజా అంచనాల ప్రకారం ఆ నివేదికను సిద్ధం చేయాలని సూచించారు. ఎన్ఎస్‌పీ చీమకుర్తి డివిజన్ పరిధిలో కాలువలు పలుచోట్ల అధ్వానంగా ఉండి నీరు పారుదల సరిలేని విషయంపై ఆయన అధికారులతో చర్చించారు. ఈ డివిజన్‌లో వచ్చే ఏడాది నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా అత్యవసర పనుల కింద రూ.7.50 కోట్లతో పనులు ప్రతిపాదించి ప్రభుత్వ ఆమోదం కోసం పంపినట్లు అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. అలాగే గుండ్లకమ్మలో ప్రాజెక్టు దిగువ భాగంలో కీర్తిపాడు, చీర్వానుప్పలపాడుల వద్ద ప్రతిపాదించిన చెక్‌డ్యామ్‌ల నిర్మాణ ప్రతిపాదనలపై కూడా ఈ భేటీలో చర్చించారు. మద్దిరాలపాడు పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాటిపై హామీ ఇచ్చిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తుచేశారు. వాటి విషయంలో గతంలోనే ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు నివేదించగా పలు వివరణలు కోరారని, వాటిపై కూడా సమగ్రరిపోర్టు పంపినట్లు ఎస్ఈ వరలక్ష్మి తెలిపారు.

అప్‌గ్రేడా.. డౌన్‌గ్రేడా...!

యూపీ పాఠశాలలపై తర్జనభర్జన

అద్దంకిలో వందేళ్ల నాటి సత్రం బడి పరిస్థితిపై సందిగ్ధం

హైస్కూల్‌గా మార్చాలని తల్లిదండ్రుల విజ్ఞప్తి



అద్దంకి పట్టణంలోని నెంబర్1 యూపీ స్కూల్(సత్రం బడి)

అద్దంకి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యను గాడిలో పెట్టేందుకు సంసిద్ధమైంది. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం 117 జీవో ద్వారా అస్తవ్యస్తం చేసిన పాఠశాల విద్యను సరిచేసేందుకు పాఠశాలల పునరుద్ధీకరణ చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో కొత్తగా వచ్చే మోడల్ స్కూల్స్ ద్వారా కొంతమేర ఉపయోగం ఉంటుండగా, మరి కొన్ని చోట్ల నష్టం కూడా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా యూపీ పాఠశాలలను తగ్గించే క్రమంలో కొన్నింటిని హైస్కూల్స్‌గా అప్‌గ్రేడ్ చేస్తుండగా, మరి కొన్నింటిని మోడల్ స్కూల్స్‌గా డౌన్ గ్రేడ్ చేయనున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని యూపీ పాఠశాలల్లో 6, 7 తరగతులను తొలగించి మోడల్ ప్రైమరీ స్కూల్స్‌గా మార్చే అవకాశం ఉండడంతో ఆయా గ్రామాల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో కొత్తగా 10 హైస్కూల్స్ వచ్చే అవకాశం ఉంది.

అద్దంకిలో శతాబ్దకాలం నాటి పాఠశాల స్థాయి తగ్గింపేనా?

అద్దంకి పట్టణంలో సుమారు 97 ఏళ్ల కిందట 1928లో సత్రం బడిని ప్రారంభించారు. అనంతరం 1988లో యూపీ స్కూల్‌గా అప్‌గ్రేడ్ అయింది. ప్రస్తుతం విద్యార్థులు 92 మంది కాగా 6, 7 తరగతులలో 35 మంది విద్యార్థులున్నారు. వైసీపీ పాలనలో 117 జీవో ఇచ్చిన సమయంలో సమీపంలో ఉన్న ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 3 నుంచి 7తరగతులను విలీనం చేసే ప్రతిపాదన వచ్చినప్పటికీ.. సమీపంలోని బాలికల ఉన్నత పాఠశాలలో అప్పటికే వెయ్యి మంది విద్యార్థినులు ఉండడం, సరైన వసతులు లేకపోవడంతో ఆ ప్రతిపాదన విరమించి యూపీ పాఠశాలగానే కొనసాగిస్తున్నారు. సత్రం బడిలో ఒకే ఒక్క స్కూల్ అసిస్టెంట్ పోస్టు ఉన్నప్పటికీ 6, 7 తరగతులలో 35 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలను డౌన్ గ్రేడ్ చేసి మోడల్ స్కూల్‌గా మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

బాలికల ఉన్నత పాఠశాలలో సరైన వసతులు లేనందున ప్రత్యామ్నాయంగా సమీపంలో ఉన్న సత్రం బడిని హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేస్తే అద్దంకి పట్టణంలోని పేద ప్రజలు నివశించే గుంజివారిపాలెం, గానుగపాలెం, ఇందిరానగర్, కొత్తపేట తదితర ప్రాంతాల విద్యార్థులకు మరింత ప్రయోజనం ఉంటుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే స్థానిక ప్రజాప్రతినిధులు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకుపోయారు. అధికారులు స్పందించి సత్రం బడిని హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మండలాల వారీగా ...

- అద్దంకి మండలంలో మొత్తం 6 యూపీ పాఠశాలలు ఉండగా వాటిలో వెంపరాల, ఉప్పలపాడు, నాగులపాడు యూపీ పాఠశాలలు యథావిధిగా కొనసాగిస్తూ, మిగిలిన కొత్తకొటికలపూడి, మోదేపల్లి, అద్దంకి పట్టణంలోని సత్రం బడులను డౌన్‌గ్రేడ్ చేసి మోడల్ స్కూల్స్‌గా మార్చే ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం.
- సంతమాగులూరు మండలంలో కొప్పరం ఎంపీయూపీ(జనరల్)లో కొప్పరం ఎంపీయూపీ(ముస్లిం) పాఠశాలను విలీనం చేసి హైస్కూల్‌గా మార్చనున్నారు. కొమ్మాలపాడు, ఏల్చూరులో ఉన్న ఎంపీయూపీ(ముస్లిం) స్కూల్స్‌ను ఉర్దూ హైస్కూల్స్‌గా మార్చనున్నారు. పుట్టావారిపాలెం, కామేపల్లి యూపీ స్కూల్స్‌ను అలాగే కొనసాగించనున్నారు.
- బల్లికురవ మండలంలోని వల్లాపల్లి, కొప్పెరపాలెం, ముక్తేశ్వరం యూపీ స్కూళ్లు.. హైస్కూల్స్‌గా అప్‌గ్రేడ్ కానున్నాయి. చెన్నుపల్లి, పాలమల్లాయపాలెం, సోమవరప్పాడు యూపీ స్కూల్స్‌ను యథావిధిగా యూపీ స్కూల్స్‌గా కొనసాగనున్నాయి.
- పంగులూరు మండలంలో రేణింగవరం, కొండమూరు, కోటపాడు యూపీ స్కూళ్లను హైస్కూల్స్‌గా అప్‌గ్రేడ్ చేయనున్నారు. నూజెళ్లపల్లి యూపీ పాఠశాలను అదేవిధంగా కొనసాగిస్తారా లేక డౌన్‌గ్రేడ్ చేస్తారా అనే విషయంలో తర్జనభర్జన పడుతున్నట్లు సమాచారం.
- కొరిశపాడు మండలంలోని తమ్మవరం యూపీ స్కూల్‌ను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయున్నారు. మిగిలిన రెండు యూపీ పాఠశాలలను యథావిధిగా యూపీ పాఠశాలుగా కొనసాగించనున్నారు.

నిర్దోషిని కేసులో ఇరికిస్తున్నారు

డీఎస్పీకి బులియన్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధుల వినతి

చీరాలటౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : నిర్దోషిని దొంగ బంగారం రికవరీ కేసులో పోలీసులు ఇరికిస్తున్నారని చీరాల బులియన్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు ఆరోపించారు. చీరాల పరిధిలోని పలు స్టేషన్‌లలో గతంలో నమోదైన కేసుల్లో స్థానిక గొల్లపాలెంకు చెందిన జంగిలి తులసిని ఎస్సై కమలాకర్ విచారిస్తున్నారు. ఒక పాతనేరస్థుడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈక్రమంలోనే ఆ కేసుల తాలూకా సుమారు 80 సవర్ల బంగారు ఆభరణాలను చీరాల సంత బజారులో బంగారం కరిగించే దుకాణం నడుపుతున్న దేవకర్ శ్రీరంగవేట్ కొనుగోలు చేశారన్న అనుమానంతో ఎస్సై కమలాకర్ మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆగ్రహించిన బులియన్ మర్చంట్ అసోసియేషన్ నాయకులు డీఎస్పీ ఎండీ మొయిన్‌కు సమస్యను వివరించారు. దీంతో స్పందించిన డీఎస్పీ న్యాయ విచారణ చేస్తామని, అధైర్య పడవద్దని హామీ ఇచ్చారు. అయితే బుధవారం అసోసియేషన్ ప్రతినిధులు బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంపై జిల్లా అధికారులను కలువనున్నట్లు సమాచారం. అయితే సుమారు 370 గ్రాములు అపహరణ జరగగా, ఇంకా కొందరు నేరస్థులను పోలీసులు అదుపులోకి తీసుకోనున్నట్లు సమాచారం.



డీఎస్పీను కలిసిన బులియన్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు

బియ్యం నిల్వల్లో తేడాలొస్తే చర్యలు

అవీఇవీ

తహసీల్దార్ పార్వతి



స్టాకు వివరాలు పరిశీలిస్తున్న తహసీల్దార్ పార్వతి

వేటపాలెం(చీరాల టౌన్), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు పంపిణీ చేసే పీడీఎస్ రైస్ నిల్వల్లో తేడా లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని వేటపాలెం తహసీల్దార్ పార్వతి చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సివిల్ సప్లయిస్ డీటీ గీతతో కలిసి మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామం షాపు నెంబర్ 16లో దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో 5 క్వింటాళ్ల రైస్, మూడు చక్కెర ప్యాకెట్లు తగ్గినట్లు గుర్తించారు. నిర్వాహకునిపై 6ఏ కేసు నమోదు చేశారు. కఠారివారిపాలెంలో షాపు నెంబర్ 29 షాపులో దాడులు నిర్వహించారు. సంతృప్తి చెందారు. అధికారులు వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ శాఖ అధికారుల దాడులు

రూ.7.10 లక్షల అపరాధ రుసుం విధింపు



వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ, విజిలెన్స్ అధికారులు మంగళవారం చీరాల పరిధిలో మెరుపు దాడులు నిర్వహించారు. 24 బృందాలుగా ఏర్పడి 2,685 సర్వీసులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా 151 మందికి రూ.7.10 లక్షల అపరాధ రుసుం విధించారు. అధికారులు మాట్లాడుతూ విద్యుత్ చోరీ, దుర్వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో డీఈఈ జాన్ థామస్, విజిలెన్స్ విభాగం డిప్యూటీ అధికారి మల్లికార్జునరావు, ఆపరేషన్ డిప్యూటీ అధికారి హరిప్రసాదరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సహకరించండి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వర్లు

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలు విచ్చలవిడిగా నమోదవుతున్నాయని ప్రతి ఒక్కరూ వీటిపై అప్రమత్తంగా ఉండాలని వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం స్టేషన్ పరిధిలోని బండ్ల బాపనయ్య పాఠశాల్లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈక్రమంలో స్మార్ట్ ఫోన్‌ల వినియోగంతో పాటు, డేటా చోరీ, ఓటీపీ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. చుట్టుపక్కల పరిసరాల్లో నేరాలు గుర్తిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు. అలాగే ప్రధాన రహదారిలో రోడ్డు ప్రమాదాల నియంత్రణపై వాహన దారులకు అవగాహన కల్పించారు. ఎస్సై వెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

ఒత్తిడికి గురికాకుండా చదువుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రతినిధులు

వాడరేవు(చీరాలటౌన్), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పరీక్షల్లో హాజరయ్యే విద్యార్థులు ఒత్తిడికి లోనవకుండా ఉండాలని, ఊర మస్తాన్‌రావు అన్నారు. మంగళవారం చీరాల మండల పరిధిలోని వాడరేవు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మస్తాన్‌రావు, శివరాజకుమారి ట్రస్టు ఆధ్వర్యంలో పరీక్ష పరికరాలను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మణికేశ్వరంలో ప్రత్యేక ఆధార్ శిబిరం



ఆధార్ శిబిరాన్ని ప్రారంభిస్తున్న కరిముల్లా

అద్దంకి, ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని మణికేశ్వరంలో మంగళవారం ప్రత్యేక ఆధార్ శిబిరాన్ని నిర్వహించారు. ప్రత్యేక ఆధార్ శిబిరాన్ని ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా ప్రారంభించారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులకు ఆధార్‌కార్డులు లేని విషయాన్ని మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకుపోవడంతో ప్రత్యేక ఆధార్ శిబిరాన్ని ఏర్పాటు చేయించారని కరిముల్లా తెలిపారు. కార్యక్రమంలో బడావలి, మీరావలి, బుల్లియ్య, రఫీ, మేకల ఆదినారాయణ, మౌలాలి, బలరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మీరావలి పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ సుబ్బరాజు

అద్దంకి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ సుబ్బరాజు అన్నారు. అద్దంకి పట్టణంలోని రాయల్ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బరాజు మాట్లాడుతూ విద్యార్థులు కచ్చితంగా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, చెడు వ్యసనాల వలన కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు.

10 మంది జూదరుల అరెస్టు

టంగుటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొణిజేడు సమీపంలో నడుస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు సోమవారం అర్ధరాత్రి దాడి చేశారు. 10 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.93,700 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాగమల్లీశ్వరావు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తప్పవని ఈసందర్భంగా ఆయన హెచ్చరించారు.

వైట్‌బర్లీ పొగాకు ధరలు పతనం

- దళారుల మాయాజాలంతో రైతుల్లో అయోమయం
- మొదటి రకం రూ.3వేల నుంచి రూ.4వేలలోపే
- గతేడాది రూ.9వేలకుపైనే

పర్చూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఒకపక్క అధిక పెట్టుబడులు, మరో పక్క అరకొర దిగుబడులు, నామమాత్రపు ధరలు వెరసి వైట్‌బర్లీ రైతులను కలవరానికి గురి చేస్తున్నాయి. రోజురోజుకూ దిగజారుతున్న ధరలు అన్నదాతలను మానసిక వ్యధకు గురిచేస్తోంది. వేలకువేలు పెట్టుబడులు పెట్టి సాగు చేసుకున్న రైతులకు ఈ ఏడాది నిరాశే మిగిలింది. గత ఏడాది దిగుబడులతో పాటు ధర కూడా ఆశాజనకంగా ఉండడం, వైరస్‌తో మిర్చి, సరైన దిగుబడి లేక శగన దెబ్బతినడంతో ప్రత్యామ్నాయంగా వేల ఎకరాల్లో వైట్‌బర్లీ పొగాకును రైతులు సాగు చేశారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో వైట్ బర్లీ సాగు చేసుకున్న రైతులు కన్నీటి పర్యంతరం అవుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ధర సగానికి పడిపోవడం ఇందుకు కారణం.


ధర లేక పోవడంతో ఇళ్లకు తరలిస్తున్న మొదటి రకం పొగాకు

మల్లె వంటి సమస్యతో చాలా చోట్ల దిగుబడి అంతంత మాత్రంగానే ఉంది. మొదటి వలుపు పొగాకు అమ్మితే సాగుకు అయిన ఖర్చులో కనీసం నాల్గోవంతు కూడా వచ్చే పరిస్థితి లేదు. దీంతో ఏమిచేయాలో పాలుపోని స్థితిలో వైట్‌బర్లీ రైతులు నిరాశలో మునిగిపోయారు. ప్రస్తుతం ఉన్న ధరతో పొగాకును చేలో వదిలి వేయలేక తీసుకు రావాల్సి వస్తుందని రైతులు దిగాలు చెందుతున్నారు. మరో పక్క మొదటి వలుపు పొగాకు క్వింటా ధర రూ.3వేలే అని ఒకరు కాదు రూ.4వేలని మరొకరు ఇలా దళారుల ధరల మాయాజాలంతో అసలు ధర ఎంత ఉందో అర్థం కాక రైతులు అయోమయానికి గురవుతున్నారు. వ్యాపారులు, దళారుల మాయాజాలం నుంచి ప్రభుత్వం తమను కాపాడేందుకు చర్యలు తీసుకుంటే అప్పులఊబిలో చిక్కుకొని కోలుకోని విధంగా దెబ్బతింటామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


వైట్ బర్లీ ఆకులను తాళ్లకు గుచ్చుతున్న కూలీలు

గతంతో ఎన్నడూ లేనివిధంగా వైట్‌బర్లీ సాగు విస్తీర్ణం ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో భారీగా పెరిగింది. ఎకరానికి రూ.40-50 వేలు చెల్లించి సాగు కోకం భూములు తీసుకున్నారు. సాగుదారుల్లో అత్యధికం కౌలుదారులే. దున్నకం, ఎరువులు, నారు కొనుగోలు, నాటడం, పురుగు మందులు, ఆరుతడి తదితర పనుల కోసం ఎకరానికి రూ.లక్ష వరకు పెట్టుబడులు పెట్టినట్లు రైతులు చెప్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పలుకుతున్న ధరకు పంట అమ్ముకుంటే పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


నిబంధనలపై డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంవీఐ రామకృష్ణారెడ్డి

రోడ్డు భద్రతా నియమాలను పాటించండి

చీరాల ఎంవీఐ రామకృష్ణారెడ్డి

ఇంకొల్లు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని చీరాల మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి సూచించారు. నివేదిత హైస్కూల్ ఆవరణలో రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా రోడ్డు భద్రత నియమాలపై డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా స్కూల్ బస్సు డ్రైవర్లు మద్యం సేవించి బస్సులు నడపరాదని, డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్లు మాట్లాడరాదని సూచించారు. అతి వేగంగా వాహనాలు నడపకూడదని, పిల్లలు బస్సు దిగి రోడ్డు దాటేప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డ్రైవర్లు అప్రమత్తతతో జాగ్రత్తగా వాహనాలు నడిపి పిల్లలను క్షేమంగా ఇంటికి చేర్చేలా ప్రతి ఒక్క డ్రైవర్ ఉండాలన్నారు. రోడ్డు నిబంధనలు పాటించినట్లయితే ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంవీఐ రవి, మోటర్ వెహికల్ యూనియన్ నాయకులు మీరావలి ప్రైవేటు స్కూళ్ల డ్రైవర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కే మోడల్ స్కూళ్లు

ఇంకొల్లు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసమే ప్రభుత్వం పంచాయతీ పరిధిలో మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తుందని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. మండల విద్యావనరుల కేంద్రంలో పావులూరు క్లస్టర్ సమావేశం ఎంఈవో-1 అజయ్‌బాబు అధ్యక్షతన జరిగింది. మోడల్ స్కూళ్లలో విద్యార్థులను చేర్పించేందుకు విద్యా కమిటీ చైర్మన్‌లు సహకరించాలని ఎంఈవో కోరారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్‌లు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై రాయితీలను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి జెన్నమ్మ

ఇంకొల్లు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఉద్యాన పంటలపై ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యాన అధికారి జెన్నమ్మ సూచించారు. మండలంలోని గంగవరంలో ఉద్యాన శాఖ బాపట్ల వారి ఆధ్వర్యంలో మిరపలో సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఏరువాక శాస్త్రవేత్త బాలమురళీధర్ మిరపలో ప్రస్తుతం ఉన్న చీడలను వివరించారు. జెన్నమ్మ మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, బిందుసేద్యం, తుంపర సేద్యం, తైవాన్ పిచికారీ పరికరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రవిప్రకాశ్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాల వర్ధంతి

ఇంకొల్లు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల స్మారక సమితి వ్యవస్థాపకుడు ఓరుగంటి సత్యనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో మహాగాయకుడు ఘంటసాల వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. భగవద్గీతను ఎంతో మధురంగా గానం చేసిన ఘనత ఘంటసాలదన్నారు. కార్యక్రమంలో కరి చంద్రమౌళి, ఓరుగంటి వెంకటేశ్వరశాస్త్రి, తమ్మన బ్రహ్మానందం, రామమూర్తి, కోటేశ్వరరావు, వెంకటరావు, రాంబాబు పాల్గొన్నారు.

అందుబాటులో గుండెపోటు నివారణ ఇంజక్షన్


స్టెమీ కార్యక్రమంలో మాట్లాడుతున్న హాస్పటల్ సూపరింటెండెంట్ సుభాషిణి

చీరాలటౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : గుండె పోటు సమస్యతో అత్యవసరంగా బాధపడుతున్న రోగులకు అందుబాటులో ప్రాముఖ్యత కలిగిన ఇంజక్షన్‌తో ప్రాణాపాయ స్థితి నుంచి సురక్షితంగా ఉంచవచ్చని చీరాల ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.సుభాషిణి అన్నారు. మంగళవారం హాస్పిటల్ ప్రాంగణంలో వైద్యం కోసం వచ్చిన వారికి, ప్రజలకు స్టెమీ (గుండెపోటు ఇంజక్షన్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గుండెపోటు సమస్యతో బాధపడుతున్న వారికి అత్యవసరంగా అందించే టెనెక్టెప్లస్ ఇంజక్షన్ ఖరీదు సుమారు రూ.40 వేలు వరకు ఉంటుందని చెప్పారు. ఈక్రమంలో నేరుగా ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించినట్లయితే ఉచితంగా ఇస్తున్నట్లు వివరించారు. సామాన్య ప్రజలు వైద్య సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హాస్పిటల్ వైద్యులు డా.పృధ్వీ, డా. శ్రీకాంత్, డా. హరిబాబు, ఆరోగ్య సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : గుండెపోటుకు గురైన వారికి ఉపశమనం కోసం ఇచ్చే ఇంజక్షన్ అద్దంకి సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో అందుబాటులో ఉందని సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ డి.శరత్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. గుండెపోటుకు గురైన వారు తక్షణమే ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించాలన్నారు. బయట ఈ ఇంజక్షన్ ధర రూ.40వేలు ఉంటుందని, ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా వేయడం జరుగుతుందని తెలిపారు.

నవోదయం 2.0తో సారాపై ఉక్కుపాదం

పాత నేరస్థులకు సత్ప్రవర్తన ఉంటే ఉపాధి అవకాశాలు


వివరాలను వెల్లడిస్తున్న అసిస్టెంట్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, సీఐ నాగేశ్వరరావు

చీరాలటౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నవోదయం 2.0తో సారా తయారీపై ఉక్కుపాదం మోపనున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ బొంతా వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం చీరాల మండల పరిధిలో సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా వీవర్స్ కాలనీలో సముద్రాల శాంతి వద్ద 16 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే తోటవారిపాలెంలో దాడులు నిర్వహించి గండి గోపీ వద్ద 2లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు. ఈసందర్భంగా చీరాల ఎక్సైజ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో నూతన స్కీం ద్వారా ఎక్సైజ్, పోలీస్, రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. సారా నియంత్రణకు అన్ని విధాలా కృషి చేయనున్నట్లు చెప్పారు. సత్ప్రవర్తన కలిగిన పాత నేరస్థులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


పర్చూరులో తిరుగుతున్న కొండముచ్చు

పరుగో పరుగు

భారీ కొండముచ్చుతో ప్రజలు బెంబేలు

పర్చూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : భారీ కొండ ముచ్చు మంగళవారం పర్చూరు గ్రామంలో సంచరించింది. దీనిని చూసిన ప్రజలు ఆందోళనతో పరుగు తీశారు. గ్రామంలోని ప్రధాన రహదారిపై ఆ కొండ ముచ్చు పరుగులు తీస్తూ రావడంతో ఎక్కడ తమపై దాడి చేస్తుందోనని ప్రజలు భయపడ్డారు. దాన్ని చూసిన వానరాలు సైతం పరుగులు తీసాయి. కొంతసేపటి తరువాత జనసంచారంలోకి వచ్చి ప్రజలపై ఎలాంటి దాడి చేయకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. కోతివలే కొండ ముచ్చు దాడికి పాల్పడదని కొందరు చెప్పినప్పటికీ అది భారీగా ఉండడంతో ప్రజలు బెంబేలెత్తారు.

సాగర హారతిని జయప్రదం చేయండి

వాడరేవు(చీరాలటౌన్), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో నేడు మండల పరిధిలోని వాడరేవు ఆంజనేయుని విగ్రహం సమీపంలో సముద్ర సాగర హారతి జరుగుతుందని తాడివలస దేవరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే బుధవారం నుంచి పౌర్ణమి కావడంతో నాలుగు రోజుల పాటు భజన కార్యక్రమం, పంచామృతాలతో స్ఫటిక శివలింగానికి అభిషేకం, అనంతరం మంత్ర పుష్పం, అనంతరం సాగర హారతి ఉంటుందని భక్తులు విశేషంగా హాజరై జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.

లక్ష్మీనరసింహస్వామి హుండీల కానుకలు లెక్కింపు

అద్దంకి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో హుండీలలోని కానుకల లెక్కింపు మంగళవారం జరిగింది. గత 5 నెలల 25 రోజులలో హుండీల ద్వారా వచ్చిన కానుకలను లెక్కించగా రూ.4,74,165 వచ్చాయి. గతంలో 5 నెలల కాలానికి రూ.4,15,230 వచ్చాయి. అద్దంకి డివిజన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ఈవో కోటిరెడ్డి ఆధ్వర్యంలో హుండీల కానుకల లెక్కింపు జరిగింది. రిటైర్డ్ హెచ్ఎం తాతా హరిబాబు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఇంటింటికీ భగవద్గీత

బల్లికురవ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నుపల్లి, కొండాయపాలెం, బల్లికురవ, నక్కబొక్కలపాడు గ్రామాలలో మంగళవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. భగవద్గీగత పఠనంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఘడియం పెద్దిరెడ్డి, ఎలిశెట్టి రమేష్, పగడాల రామయ్య, చల్లగుండ్ల భాస్కరరావు, చిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైతులు పంట నమోదు చేయించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో వెంకటకృష్ణ


ఇంకొల్లులో మాట్లాడుతున్న ఏవో వేణుగోపాల్

పంగులూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రబీలో సాగు చేసిన పంట వివరాలను రైతు సేవా కేంద్రాలలో విధిగా నమోదు చేయాలని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి కోరారు. మండలంలోని చందలూరు, నూజెళ్లపల్లి గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాగులో ఉన్న మిరప, పొగాకును రైతులతో కలిసి ఏవో పరిశీలించారు. రైతులకు ప్రత్యేక గుర్తింపు కోసం ప్రభుత్వం అగ్రి స్టాక్ యాప్‌ను అందుబాటులో ఉంచిందన్నారు. సొంత భూమిగల రైతులందరికీ ప్రత్యేక ఐడీ నెంబర్‌ను జనరేట్ చేస్తామని, దీనికోసం రైతులు ఆధార్‌కార్డు, ఫోన్ నెంబరు, పట్టాదారు పాస్ పుస్తకంతో సేవా కేంద్రాలకు వెళ్లి ఆ కార్డును పొందాలని కోరారు. పీఎం కిసాన్, రైతు భరోసా, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, యంత్ర పరికరాలు, పంట రుణాలు పొందాలంటే ఐడీ నెంబరు కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెంట్యాల కృష్ణారావు, రామలింగస్వామి, కందిమళ్ళ రామాంజనేయులు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పర్చూరు : నూతలపాడు, పోతుకట్ల గ్రామాల్లోని రైతులకు తెగుళ్ల, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఏవో రామోహన్‌రెడ్డి నేతృత్వంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ ప్రస్తుతం శగనకు ఎండు, వేరుకుళ్లు, తుప్పు తెగులు సోకుతుందన్నారు. వీటి నివారణకు మందులను పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ స్సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకొల్లు : రైతులు రైతు సేవా కేంద్రాలలో ఫార్మర్ రిజిస్ట్రీపోర్టల్‌లో నమోదు చేయించుకొని ప్రత్యేక ఐడీ నెంబర్ పొందినట్లయితే వారికి ప్రభుత్వ పథకాలు అందుతాయని వ్యవసాయాధికారి వేణుగోపాల్ అన్నారు. మండలంలోని ఇడుపులపాడులో పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యద్దనపూడి : వ్యవసాయశాఖకు చెందిన పలు సబ్సిడీ పథకాలను పొందాలంటే రైతులు ఏపీఎఫ్ఆర్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయ అధికారి మేరమ్మ అన్నారు.మంగళవారం మండలంలోని అనంతవరం, సూరవరపుపల్లి గ్రామాలలోని రైతులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు విత్తనాలు, ఎరువులు పురుగుమందులు కొనుగోలు చేసే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వీఏఏ మధుప్రియ, రైతులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : ప్రభుత్వ పథకాల అమలుకు ప్రతి రైతు తమ భూమి వివరాలతో తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. మంగళవారం మండలంలోని పేరయపాలెం, మోదేపల్లి గ్రామాలల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రత్యేక నెంబర్‌తో అన్ని వ్యవసాయ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి ఎస్.దీప్తి, ఏఈవో కోటేశ్వరరావు, దుర్గరావు, పాల్గొన్నారు.


సోమవరప్పాడులో తెగులు సోకిన మిర్చిని పరిశీలిస్తున్న ఉద్యాన అధికారులు

మిర్చిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

బల్లికురవ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మిర్చికి పలు రకాల తెగుళ్ల ఉధృతి ఉందని రైతులు అప్రమత్తతో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యాన అదికారి హనుమంతునాయక్ అన్నారు. మంగళవారం మండలంలో ఉప్పుమాగులూరు, సోమవరప్పాడు, గ్రామాలలో రైతులు సాగు చేసిన మిర్చి, బొప్పాయి పైర్లను ఉద్యాన శాఖ అధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ మిరప లో నల్ల తామరపురుగు, కాయమచ్చ తెగులు అధికంగా ఉందని రైతులు మెళకువలతో సాగు చేయాలన్నారు. బొప్పాయి, అరటి రైతులు వేసవి కాలం దృష్ట్యా నీటి యాజమాన్య, పోషకాల ఎంపిక పంటలో వచ్చే వైరస్ తెగుళ్లకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. ఈ పరిశీలనలో ఉద్యాన కన్‌సెల్టెంట్ విష్ణుమూర్తి పాల్గొన్నారు.

16న నాగేశ్వరరరావుకు పుట్టంరాజు కళా పురస్కారం


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : అభినవశ్రీహరిగా పేరు గాంచిన తన్నీరు(అద్దంకి) నాగేశ్వరరావుకు ఈ నెల 16వ తేదీన పట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ కళాపురస్కారం అందజేయనున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈనెల 16వ తేదీన పట్టుంరాజు కళాక్షేత్రంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాహితీ కౌముది అధ్యక్ష, కార్యదర్శులు రఘురామశర్మ, కేవీ పోలిరెడ్డి, కోశాధికారి మురళీసుధాకరరావు పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు రవితేజ, రమీజ్‌అహ్మద్

బల్లికురవ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి సురక్ష మాతృ అభియాన్ పథకంలో భాగంగా గర్భిణులకు ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యం అందుబాటులో ఉందని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు రమీజ్‌అహ్మద్, రవితేజ పేర్కొన్నారు. మంగళవారం వైద్యశాలలో మండలంలో అన్ని గ్రామాలలో ఉన్న గర్భిణులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి వారికి సులువైన పద్ధతిలో కాన్పులు అయ్యేందుకు ఉపయెగ పడే పలు రకాల యోగాసనాలను నేర్పించారు. బలవర్ధకమైన అహారం తీసుకోవడం ద్వారా పుట్టే బిడ్డలు కూడా ఆరోగ్యంగా జన్మిస్తారని వారు తెలిపారు.

బర్డ్‌ఫ్లూ కలవరం

చికెన్ దుకాణాలు వెలవెల

పర్చూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పలు జిల్లాలో బర్డ్‌ఫ్లూ సోకి కోళ్లు మృతి చెందడం మాంసం ప్రియుల్లో కలవరం రేపింది. చికెన్ తినేందుకు భయపడుతున్నారు. మరో పక్క కోళ్లకు అంతుచిక్కని వైరస్ సోకి కుప్పలుతిప్పలుగా చనిపోతున్నాయన్న ప్రచారంతో చికెన్ కొనుగోలు చేసుకునేందుకు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో చికెన్ దుకాణాలు వెలవెలబోతున్నారు.

ఆచూకీలేని మత్స్యకారుని పెద్దకర్మకు ఏర్పాట్లు

వాడరేవు (చీరాలటౌన్), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : సముద్రంలో వేటకు వెళ్లి ఆచూకీ లేని మత్స్యకారునికి బాధిత కుటుంబం పెద్దకర్మకు ఏర్పాట్లు చేశారు. గ్రామానికి చెందిన ఓసీపిల్లి రమణ(53) మత్స్యకారుడు. గత ఆదివారం మరి కొందరు మత్స్యకారులతో కలిసి ఆయన విజయవాడ సమీపంలోని బందరు వైపు వేటకు వెళ్లారు. అయితే అర్ధరాత్రి నుంచి రమణ ఆచూకీ లేకపోవడంతో అన్నిచోట్లా వెదికిన కుటుంబ సభ్యులకు నిరాశే మిగిలింది. దీంతో చేసేదిలేక వచ్చే శుక్రవారం పెద్ద కర్మకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే చివరి చూపైనా దక్కక పోవడంతో ఆ కుటుంబం విషాదంలో ఉంది.


రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

వేటపాలెం (చీరాలటౌన్), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని సుమారు 50 సంవత్సరాల మహిళ రైలు పట్టాలు దాటుతూ రైలు ఢీకొని మృతి చెందారు. ఈ ఘటన వేటపాలెం రైల్వే స్టేషన్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతిరాలి వద్ద ఆధారాలు లభించలేదు. ఎరువు రంగు చీర ధరించి ఉంది.

ఉత్తమ అధికారులకు సన్మానం

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండల రెవెన్యూ కార్యాలయంలో పని చేస్తూ రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లా అధికారుల చేతుల మీదుగా ఉత్తమ అధికారులుగా అవార్డులను అందుకున్న వారికి మంగళవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మాంచారు. రెవెన్యూ కార్యాలయంలో పని చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌బాబు, ఆర్ఐ రామారావు(శంకర్), సర్వేయర్ హనుమంతరావుతో పాటు తహసీల్దార్ శ్రీచరణ్ రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టర్ ద్వారా ఉత్తమ అధికారులుగా పురస్కారాలను అందుకున్న సందర్భంగా ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీచరణ్, ఏఎస్‌వో అమర్‌నాథ్, ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, ట్రెజరర్ నాగేశ్వరరావు, కార్యదర్శి శ్రీ మన్నారాయణమూర్తి, బాపట్ల జిల్లా అధ్యక్షుడు జగన్నాథం యోహాను పాల్గొన్నారు.


ఉత్తమ అధికారులను సన్మానిస్తున్న తహసీల్దార్ శ్రీచరణ్, ఐక్య వేదిక సభ్యులు



ఎలా!?

ఎన్ని గ్రామసభలు నిర్వహించినా.. మరిన్ని సమావేశాల ద్వారా అర్జీలు స్వీకరించినా రెవెన్యూ సమస్యలు మాత్రం పరిష్కారం కానంటున్నాయి. మరోవైపు ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజావిజ్ఞప్తుల కార్యక్రమం (గ్రీవెన్స్)లో భూ సమస్యలకు సంబంధించిన అర్జీల సంఖ్య మాత్రం తరగడం లేదు. ఈ ప్రభావం అటు ప్రజలపై తీవ్రంగా పడుతుండగా, ఇటు అధికారులకు కూడా ఇబ్బందిగా మారుతోంది. జిల్లా ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో భూ సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఒకసారి వచ్చిన అర్జీదారుడే మళ్లీ అదే సమస్యతో ఉన్నతాధికారుల వద్దకు వస్తున్నారు. మరోవైపు ఈ అర్జీల పరిష్కారంపై ఆడిట్ నిర్వహిస్తున్నా పరిస్థితిలో మార్పు రాకపోతుండటం ఆందోళన కలిగిస్తోంది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

- జిల్లాలో విపరీతంగా భూ సమస్యలు
- కుప్పలు తెప్పలుగా వస్తున్న అర్జీలు
- గ్రామసభల్లో వేల సంఖ్యలో నమోదు
- అయినా గ్రీవెన్స్‌లో తగ్గని విజ్ఞప్తుల సంఖ్య
- పరిష్కారంలో క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూ సమస్యలపై దృష్టి పెట్టింది. గత ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వే ద్వారా అనేక కొత్త సమస్యలు వచ్చాయని గుర్తించిన ప్రభుత్వం.. తొలుత రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సదస్సులు నిర్వహించింది. 300లకుపైగా గ్రామాల్లో గతేడాది అక్టోబరు 19 నుంచి నవంబరు 14వ తేదీ వరకూ రెవెన్యూ సదస్సులు జరిగాయి. అప్పుడు 8,406 అర్జీలు ప్రజల నుంచి అందాయి. ఆ తర్వాత మరోసారి గతేడాది డిసెంబరు 6 నుంచి ఈ ఏడాది జనవరి 8వ తేదీ వరకూ జిల్లాలో 731 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈదఫా 8,132 అర్జీలు భూ సమస్యలకు సంబంధించి అధికారులకు అందాయి. వీటన్నిటినీ ఆన్‌లైన్ చేసిన అధికారులు.. పరిష్కారానికై క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బందికి పంపారు. ఇప్పటికే సగం వరకూ అర్జీలు పరిష్కారమైనట్లు లెక్కలు చూపిస్తున్నారు.

సమస్య ఎక్కడ..?

భూ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని కూటమి ప్రభుత్వం పదే పదే ఆదేశిస్తోంది. అయితే ప్రభుత్వం ఆశించిన స్థాయిలో భూ సమస్యల పరిష్కారం జరగడం లేదని లెక్కలు చూస్తే అర్థమవుతోంది. ఇందుకు అనేక కారణాలే కనిపిస్తున్నాయి. క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం ప్రధాన కారణమైతే.. కొన్ని సమస్యలకు రాష్ట్రస్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉండటం కూడా మరో కారణంగా అధికారులు చెబుతున్నారు. తన భూమిని మరొకరి పేరుపై అక్రమంగా మ్యుటేషన్ చేశారని ఓ వ్యక్తి ఇప్పటికి పలుమార్లు అర్జీలు పెట్టుకున్నా ఆ సమస్య పరిష్కారం కాకపోవడంతో సదరు బాధితుడు పదే పదే కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నాడు. ఇది పరిష్కరించగలిగిన సమస్య అయినా క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం మూలంగా పరిష్కారం కావడం లేదు. అలానే మరోవ్యక్తి.. రీసర్వేలో తప్పు ఖాతా నంబర్ ఇచ్చారని, దీనిని సరి చేయాలని అర్జీల మీద అర్జీలు పెట్టుకుంటున్నాడు. అయితే ఈ సమస్యను పరిష్కరించేందుకు జిల్లాస్థాయిలో అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. కలెక్టరేట్‌లోని ఆడిట్ సెల్ ప్రతి అర్జీదారుడితో నేరుగా మాట్లాడుతూ వారి సంతృప్తి తెలుసుకుంటోంది. చేయగలిగి ఉండి కూడా పరిష్కారం కాని సమస్యలను రీ ఓపెన్ చేస్తున్నారు. ఇటువంటివి ప్రస్తుతం జిల్లాలో 500లకుపైగా ఉన్నాయి. జిల్లా లో 18 మంది అధికారులు కూడా ర్యాం డమ్‌గా ఆడిట్ చేస్తుండగా వారు కూడా కొన్ని అర్జీలను రీ ఓపెన్ చేస్తుండటం గమనార్హం. అంటే క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరు ఇక్కడ అర్థమవుతోంది. ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటే గానీ పరిస్థితుల్లో మార్పు రాదన్న అభి ప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అదే సమయంలో కొన్ని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ నిర్ణయం అవసరం. అయితే ఆ విషయాలను అర్జీదారులకు అర్థమయ్యే విధంగా చెప్పడంలో రెవెన్యూ యంత్రాంగం విఫలమవుతోంది. ఈ కారణంగా కూడా బాధితులు పదే పదే రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

రెండు విడతల్లో జరిగిన గ్రామసభల్లో 16 వేలకుపైగా అర్జీలు నమోదైనా అర్జీల రాక మాత్రం తగ్గడం లేదు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో జనవరి 27వ తేదీన జరిగిన ప్రజావిజ్ఞప్తుల పరిష్కార వేదిక కార్యక్రమంలో 407 అర్జీలు రాగా అందులో రెవెన్యూ శాఖకు సంబంధించినవే 157 ఉన్నాయి. అలానే ఈ నెల 3వ తేదీ జరిగిన కార్యక్రమంలో మొత్తం 294 అర్జీలు రాగా అందులో రెవెన్యూ శాఖవి 128 ఉన్నాయి. సోమవారం (10వ తేదీన) 409 అర్జీలు రాగా అందులో 160 అర్జీలు రెవెన్యూ శాఖకు చెందినవే కావడం గమనార్హం.

సవరణ చేయాలని తిరుగుతున్నా..

నా భార్య పేరుతో అల్లూరు మండలం పడమర గోగులపల్లిలో 1.4 ఎకరాల భూమి ఉంది. గత ప్రభుత్వంలో ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నాయి. అయితే రీసర్వేలో సర్వే నెంబర్లలో బిన్నాలు ఏర్పాటు చేసి ఒక్క సర్వేనెంబరుకు మూడు బిన్నాలు ఏర్పాటు చేసి వెబ్ ల్యాండ్ రికార్డును మంజూరు చేశారు. ఈ రికార్డుతో రుణం పొందాలంటే బ్యాంకర్లు తిరస్కరిస్తున్నారు. సవరణ చేయమని అధికారులకు ఇస్తే ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

- మైపాటి రాజేంద్ర ప్రసాద్, అల్లూరు

సమస్యలు పకడ్బందీగా పరిష్కరించాలి

మా గ్రామంలో అత్యధికంగా భూ సమస్యలున్నాయి. గతంలో రీసర్వే ప్రక్రియతో ఈ సమస్య నెలకొంది. అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించినా పరిష్కారం లభించలేదు.

- ఆట తిరుమల, సర్పంచి, పడమర గోగులపల్లి, అల్లూరు

ఈ మొండిగోడలకు మోక్షం!

- బీసీ భవన్ నిర్మాణంలో కదలిక
- కొత్త అంచనాలతో ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్‌కు ఆదేశం

ఒక అసమర్థపు ప్రభుత్వ పాలన ఎంతమందిపై ప్రభావం చూపుతుందో అనడానికి నిదర్శనమే బీసీ భవన్. తమకూ ఓ భవనం నిర్మించండి.. మా శుభకార్యాలు, ఇతర అవసరాలను తక్కువ ఖర్చుతో ఇక్కడే తీర్చుకుంటాం.. అంటూ బీసీ కులస్థులు కోరిన న్యాయమైన కోరికను నాటి వైసీపీ సర్కారు తుంచేసింది. తను మంచి కార్యక్రమం చేయడం అటుంచితే జరుగుతున్న పనిని కూడా ఆపేసిన ఘనత గత ప్రభుత్వానికే దక్కింది. దీంతో ఎన్నో ఏళ్ల తమ కోరిక నెరవేరుతుందని సంతోషించిన బీసీలకు నిరాశే ఎదురయ్యింది. నెల్లూరులో ప్రారంభమైన బీసీ భవన్ నిర్మాణ పనులు గత ఐదేళ్లలో పడకేశాయి. ఏదో కక్షగట్టినట్లుగా అప్పటి టీడీపీ ప్రభుత్వం వేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసినంత స్పీడుగా వైసీపీ నేతలు భవనాన్ని నిర్మించలేకపోయారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పాలనలో ఈ భవన్ నిర్మాణంలో కదలిక వచ్చింది. మరి ఇప్పుడైనా స్పీడుగా బీసీ భవన్ నిర్మాణం పూర్తవుతుందా? అన్నదే చర్చనీయాంశంగా మారింది.



పునాదుల దశలోనే ఆగిపోయిన బీసీ భవన్

6

పెంచింది 10.. తీసుకుంటున్నది 40

- మద్యం వ్యాపారుల దోపిడీ



నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మద్యం ధరలు పెంచితే ఇదే అదనుగా వ్యాపారులు నాలుగింతలు ఎక్కువగా వసూలు చేస్తూ మందు బాబులను దోచేస్తున్నారు. క్వార్టర్ నుంచి ఫుల్ వరకు ఏదైనా బాటిల్‌పై రూ.10 రూపా యలు చొప్పున ప్రభుత్వం పెంచింది. బీర్ ధరలు పెంచలేదు. అయితే వైన్‌షాపులు, బార్లలో మాత్రం క్వార్టర్‌పై రూ.10, హాఫ్‌పై రూ.20, ఫుల్‌పై రూ.40 అధికంగా వసూలు చేస్తున్నారు. కొన్నిచోట్ల బీర్ ధరలు కూడా పెం చేశారు. ఈ విషయం ఆంధ్రజ్యోతి పరిశీలనలో వెల్లడైంది. ఆంధ్రజ్యోతి మంగ ళవారం నెల్లూరులోని కొన్ని మద్యం దుకాణాలను విజిట్ చేసింది. ధరల విష యమై అక్కడి మందుబాబులతో మాట్లాడగా పెంచిన ధర కన్నా ఎక్కువ వసూ లు చేస్తున్నారని చెప్పారు. దీనిపై వైన్‌షాపుల్లోని క్యాషియర్లను ప్రశ్నించగా ధరలు పెరిగాయని... క్వార్టర్‌పై రూ.10, ఫుల్‌పై రూ.40 పెరిగిందని సమాధానం ఇచ్చారు. ఇదే విషయాన్ని ఓ క్యాషియర్‌ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులకు కూడా కరాఖండిగా చెప్పడం విశేషం.

ఆంధ్రజ్యోతి పరిశీలన

కన్నెత్తి చూడని ఎక్సైజ్ అధికారులు

మద్యం ధరలు పెరిగినప్పుడు, తగ్గినప్పుడు ఎక్సైజ్ అధికారులు ఆయా స్టేషన్ల పరిధిలోని షాపుల్లో సవరించిన ధరలు అమలయ్యేలా పర్యవేక్షించాలి. ధరల పట్టికలో మార్పులు చేసేలా చర్యలు తీసుకోవాలి. కానీ, జిల్లాలో ఎక్సైజ్ అధికారులు మాత్రం అవేవీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో వ్యాపారులు ఇష్టం వచ్చినట్లు వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

బాటిల్‌పై రూ.10 మాత్రమే పెరిగింది

ప్రభుత్వం విడుదల చేసిన జీవో మేరకు లిక్కర్‌పై మాత్రమే ధరలు పెరిగాయి. బీర్ ధరలు పెరగలేదు. క్వార్టర్, హాఫ్, ఫుల్... ఏ బాటిల్‌పైన అయినా రూ.10 మాత్ర మే పెరిగింది. ఈ విషయాన్ని వైన్‌షాపుల యజమానులకు వివరంగా తెలియజేశా ము. అధిక ధరలు వసూలు చేసేవారిపై చర్యలు తప్పవు.

- శ్రీనివాసరావు : డీసీ, దయాసాగర్ : ఏసీ

మెయిన్స్‌లో మెరిశారు!

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీలలో ఇంజనీరింగ్, బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్స్ ఫలితాలు మంగళశారం విడుదలయ్యాయి. ఫైనల్ కీ విడుదల చేసిన ఎన్‌టీఏ అధికారులు తాజాగా విద్యార్థులు సాధించిన పర్సంటైల్ స్కోర్‌తో ఫలితాలను విడుదల చేశారు. జనవరి 22 నుంచి 24వ తేదీ వరకు ఒక విడత, 28, 29వ తేదీలలో నిర్వహించిన రెండో విడతలో పేపర్-1 పరీక్షలు నిర్వహించారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) పర్యవేక్షణలో టీసీఎస్ నిర్వహించిన ఈ పరీక్షలకు జిల్లాలో 6వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాల్లో జిల్లా విద్యార్థులు పలు విభాగాల్లో సత్తాచాటుతూ ర్యాంకులను సొంతం చేసుకున్నారు. మొత్తం మీద 80 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాలల యాజమాన్యాలు తెలిపాయి.

- ఏప్రిల్ 1 నుంచి రెండోవిడత

జేఈఈ మెయిన్స్ రెండో విడత పరీక్షలను ఏప్రిల్ 1 నుంచి 8వతేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఎన్‌టీఏ అధికారులు ప్రకటించారు. తొలివిడత పరీక్షల్లో సాధించిన స్కోరుతో సంతృప్తి చెందని వారు రెండో విడత పరీక్షలు రాస్తుంటారు. ఈ రెండింటిలో ఉత్తమ స్కోరును పరిగణలోకి తీసుకుని విద్యార్థులకు ర్యాంకులు కేటాయిస్తారు. ఆ తర్వాత సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్లకు అనుగుణంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హత కల్పిస్తారు. అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటిన విద్యార్థులకు జోసా కౌన్సెలింగ్ ద్వారా ఐఐటీల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

- 80 శాతం మంది ఉత్తీర్ణత
- నారాయణకు ఉత్తమ మార్కులు..

జేఈఈ మెయిన్స్ మొదటి విడత ఫలితాల్లో నారాయణ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. కె.పూర్వజ్ మ్యాథ్స్‌లో వందకు వందతో పాటు 99.98 పర్సంటైల్ సాధించారు. కె.మధుకిరణ్‌రెడ్డి 99.93, బి.భాను రిషిక్ 99.92, ఎం.అఖిలేష్ 99.91, ఎం.హేమంత్‌సాయి 99.84, సిహెచ్.నరసింహతేజ 99.76, కె.అశ్రిత 99,74, జి.సంతోష్ 99.71, ఇ.యశ్వంత్ బాబి 99.70 పర్సంటైల్ సాధించారని ఆ విద్యా సంస్థల జనరల్ మేనేజర్ వి.విజయ భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

నాయనా లేవరా.. మాట్లాడరా!!

- వాగులో తల్లిని కాపాడబోయి కొడుకు మృతి
- గుండెలవిసేలా రోదించిన తల్లిదండ్రులు



కుమారుడి మృతదేహంపై పడి రోదిస్తున్న తల్లిదండ్రులు



ఆకాష్ (ఫైల్)

"నాయనా ఆకాష్ లేవరా! ఒకసారి మాట్లాడరా!? ఓ దేవుడా మేమేం పాపం చేశాం. చేతికి ఎదిగి వచ్చిన కొడుకును కానీయకుండా చేశావే!' నంటూ కన్నబిడ్డ మృతదేహంపై పడి ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. వీరి రోదనను చూసిన స్థానికుల్లోనూ కంట తడి తెప్పించింది. అనంతసాగరం మండలం శంకర నగరంలో మంగళవారం తల్లిని కాపాడబో యి ఓ యువకు డు నదిలో పడి మృత్యువాత పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. శంకరనగరానికి చెందిన ఉప్పలపాటి కొండయ్య, శోభలకు ఇద్దరు సంతానం. ఇటీవల కావలిలో బీటెక్ పూర్తి చేసిన పెద్ద కుమారుడు ఆకాష్ ఇంటికి వచ్చి ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. మంగళవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలో పచ్చి గడ్డి కోసం తల్లితో కలిసి వెళ్లాడు. గడ్డి కోసుకొని వచ్చే క్రమంలో తల్లి శోభ కొమ్మలేరువాగు దాటుతూ బురదలో ఇరుక్కు పోయింది. అమ్మను బయటకు లాగే క్రమంలో ఆకాష్ (22) వాగులో పడిపోయాడు. ఆకాష్‌కు ఈత రాకపోవడంతో నీటిలో గల్లంతు అయ్యాడు. నీటిలో కొట్టుకుపోతున్న కొడుకును చూసి తల్లి బిగ్గరగా కేకలు వేయడంతో అటుగా వెళ్తున్న ఒక వ్యక్తి నీటిలో దూకి రక్షించే ప్రయత్నం చేయగా అప్పటికే ఆకాష్ మృతి చెందాడు. మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు. చేతికందిన కుమారుడు అనంతలోకాలకు చేరుకోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీర య్యారు. బిడ్డ మృతదేహంపై పడి 'నువ్వు లేకుండా మేము బతికేదెలా!?' అంటూ గుండెలు పగిలిలా రోదించడం అందరినీ కంటతడి పెట్టించింది. సమాచారం తెలుసుకొన్న అనంతసాగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- అనంతసాగరం (ఆంధ్రజ్యోతి)

మనీ స్కాంలో పోలీసుల పాత్ర

- విచారించిన కావలి డీఎస్పీ
- ఇద్దరు కానిస్టేబుళ్లపై ఎస్పీ వేటు
- మరికొందరిపైనా చర్యలు తప్పవా!?

కావలి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ముసునూరు మర్రిచెట్టు గిరిజన కాలనీ కేంద్రంగా గుంటూరుకు చెందిన షేక్ మహబూబ్ సుభాన్ ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో నిర్వహిస్తున్న మనీ స్కాంలో పాత్రధారులైన ఇద్దరు కానిస్టేబుళ్లపై వేటు పడింది. కావలి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన వట్టికాల రాధాకృష్ణయ్య, జ్యోతి అయోధ్యలను సస్పెండ్ చేస్తూ ఎస్పీ కృష్ణ కాంత్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ స్కాంలో అనేక మంది పోలీసుల సహకారం ఉన్నప్పటికీ ప్రధాన సూత్రధారులుగా ఈ ఇద్దరు కానిస్టేబుళ్ల ఉండటంతో కావలి డీఎస్పీ పి.శ్రీధర్ విచారించారు. స్కాంలో వారి పాత్ర నిజమని నిర్ధారిస్తూ ఎస్పీకి నివేదిక అందచేశారు. ఆ నివేదిక ఆదారంగా ఎస్పీ ఆ ఇద్దరు కానిస్టేబుళ్లపై సస్పెండ్ వేటు వేశారు. అయితే, ఇంకా అనేక మంది పోలీసులు ఈ స్కాంలో ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. భవిష్యత్తులో అధికారులు చేపట్టే విచారణలో ఎవరెవరి పేర్లు బయటకు వస్తాయోనని అందరిలో ఆందోళన నెలకొంది.

- ఇల్లు, కార్యాలయంలో తనిఖీలు

మనీ స్కాం నిర్వాహకుడు షేక్ మహబూబ్ సుభాన్ కార్యాలయం, ఇంటి తాళాలను మంగళవారం కావలి తహసీల్దార్ పీ. శ్రావణ్‌కుమార్ సమక్షంలో డీఎస్పీ పీ.శ్రీధర్ పర్యవేక్షణలో పోలీస్‌లు పగలగొట్టారు. అనంతరం కార్యాలయం, ఇంటిలో విస్తృత తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు, కొంత నగదును సీజ్ చేసినట్లు తెలిసింది. కొన్ని ప్లాట్లు, జలదంకి మండలంలో కొంత పొలానికి సంబంధించిన డాక్యుమెంట్లు దొరికినట్లు తెలిసింది. అయితే, ఆన్‌లైన్ ట్రేడింగ్ లావాదేవీలకు సంబంధించిన కంప్యూటర్ డిస్క్‌లు ముందుగానే సుభాన్ మాయం చేసినట్లు తెలిసింది. ఈ వ్యవ హారంపై పోలీసులు లోతైన విచారణ చేపట్టి, స్కాంలో సూత్ర, పాత్రదారుల వివరాలు సేకరించే పనిలో పడ్డారు. ఈ తనిఖీ లలో సీఐలు ఫిరోజ్, గిరిబాబు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

సీబీసీఐడీ విచారణ చేట్టాలి

ఆన్‌లైన్ ట్రేడింగ్ మనీ స్కాంపై సీబీసీఐడీ విచారణ చేపట్టాలని జిల్లా టెలికాం సభ్యులు, బీజేపీ నేత కే. బ్రహ్మా నందం పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి బోర్డు తిప్పేసిన షేక్ మహబూబ్ సుభాన్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే సదరు సంస్థ నుంచి సొమ్మును రికవరీ చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. బీజేపీ తరఫున బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు కిరణ్, వెంకటేశ్వర్లు, సుజి, మురళీకృష్ణ, తిరుపతి స్వామి పాల్గొన్నారు.



సుభాన్ కార్యాలయ గది తలుపులు పగలగొడుతున్న పోలీసులు


కానిస్టేబుళ్లు అయోధ్య, రాధాకృష్ణయ్య





297 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 297 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి తెలిపారు. మంగళవారం మండలంలోని పంచేడు రైతు సేవా కేంద్రంలో రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ సీజనులో కేఎన్ఎం 1638, ఆర్ఎన్ఆర్ 15048, వరి రకాలను రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారన్నారు. ఈ మేరకు ఈ పంట నమోదు చేయించుకోవాలని, అందులో నమోదైన రైతుల ధాన్యం మాత్రమే ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేస్తారని తెలిపారు. అలాగే ఈకేవైసీ కూడా చేయించుకోవాలన్నారు. అదేవిధంగా భూమి ఉన్న ప్రతి రైతుకు ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇచ్చేందుకు ప్రభుత్వం ఫార్మర్ రిజిస్ట్రీ చేస్తుందని, ఇందుకు రైతులు సహకరించా లని కోరారు. వ్యవసాయ సహాయ సంచాలకులు సర్వేజీరావు వరి సాగులో మెళకువలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు శేషగిరి, మండల వ్యవసాయాధికారి సురేంద్ర రెడ్డి, ఏఈవో ఎస్ ఇందు, వీఏఏ కే.సుజాత, మాజీ వవ్వేరు బ్యాంకు చైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.









రాక్ బీచ్ రాకింగ్ !

ముత్తుకూరు మండలం నేలటూరు గ్రామంలోని బీచ్ సందర్శకులను అమితంగా ఆకట్టుకుంటోంది. ఇక్కడి థర్మల్ ప్రాజెక్టు పక్కనే సముద్రతీరం ఉంది. ఆ కర్మాగారానికి అనుసంధానంగా సాగరంలోకి మార్గం ఏర్పాటు చేశారు. కెరటాల తాకిడిని తట్టుకునేందుకు భారీస్థాయిలో అమర్చిన కాంక్రీట్ దిమ్మెలు, వాటిపై వేసిన సిమెంటు రోడ్డు యువతను ఆకర్షిస్తోంది. పెద్ద అలలు వచ్చి కాంక్రీట్ దిమ్మెలకు తగిలినప్పుడు ఎగిరిపడే నీటి తుంపర్లు ప్రత్యేక అనుభూతినిస్తున్నాయి. అలాగే, ఇక్కడ సముద్రంలో బోటింగ్‌కు కూడా అవకాశం ఉంది. దీంతో వారాంతంలో సందర్శకుల సందడి కనిపిస్తోంది. ముఖ్యంగా షార్ట్ వీడియోలు, రీల్స్ షూట్ చేయడానికి యూత్ ఈ బీచ్‌ను ఎంచుకుంటోంది. అయితే, సరైన రోడ్డు మార్గం, వసతులు లేకపోవడం సందర్శకులకు కొంత అసౌకర్యం కలిగిస్తోంది.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

మందులు నిల్వ ఉంచుకోవాలి

- డీఎంహెచ్‌వో సుజాత

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా నిల్వ చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత ఆదేశించారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఫార్మాసిస్టులతో ఆమె సమీక్ష నిర్వహించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రంలో మందులు, పిల్లలకు వేసే టీకాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి, ఎపిడమాలజిస్ట్ డాక్టర్ భాస్కర్ పాల్గొన్నారు.

గంగపుత్రులకు చేయూత

- వేట విరామ భృతి రూ.20 వేలకు పెంపు
- 12,440 మత్స్యకార కుటుంబాలకు లబ్ధి
- కూటమి ప్రభుత్వ నిర్ణయంపై కడలిపుత్రుల ఆనందం

కావలి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో రెండు నెలలపాటు ఉచితంగా బియ్యం ఇచ్చేవారు. ఆ తర్వాత అధికారం లోకి వచ్చిన తెలుగుదేశం వేట విరామ భృతి కింద రూ.4 వేలు అందజేసింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ భృతిని రూ.10 వేలకు పెంచింది. అయితే వివిధ కొర్రీలు పెట్టడంతో అర్హులు కూడా విరామ భృతికి దూరమయ్యారు. అయితే మత్స్యకారుల సాధక బాధకాలు తెలిసిన కూటమి ప్రభుత్వం భృతిని రెట్టింపు చేస్తూ రూ.20 వేలకు పెంచింది.

ఏప్రిల్ 15 నుంచి వేట విరామం

యేటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు సముద్రంలో చేప పిల్లలు ఉత్పత్తి జరిగే సీజన్ కావటంతో ఆ సమయంలో మత్స్య సంపదను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేట విరామం ప్రకటిస్తోంది. దీంతో ఆ రెండు నెలలు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా నిషేధిస్తారు. అయితే, సముద్రపు వేటే జీవనాధారంగా ఉండే మత్స్యకార కుటుంబాలు వేట విరామ సమయంలో జీవనోపాధి పొందేందుకు ప్రభుత్వం వారికి భృతిని అందచేస్తుంది. ఆ భృతిని కూటమి ప్రభుత్వం రూ.20 వేలకు పెంచింది. జిల్లాలో సుమారు 18 వేల మత్స్యకార కుటుంబాలు ఉండగా వీరిలో వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందే వారు కాకుండా కేవలం సముద్ర వేటపైనే ఆదారపడి జీవించే వారిని, ఆన్‌లైన్‌లో రిజిష్ట్రేషన్ అయిన బోట్ల ద్వారా 12,440 కుటుంబాలను అధికారులు గుర్తించారు. వీరికి భృతి అందచేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వేట విరామ భృతి పెంచడంతో మత్స్యకార కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

గంగపుత్రులకు ఎంతో ఊరట



కూటమి ప్రభుత్వం విరామ భృతి పెంచటం గంగపుత్రు లకు ఎంతో ఊరటనిస్తుంది. గతంలో వైసీపీ ప్రభుత్వం రూ.10 వేలు ఇవ్వడమేగాక అది కూడా నాలుగు పర్యాయాలు మాత్రమే ఇచ్చి ఒక పర్యాయం ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం నిర్ణయంతో మత్స్యకారుల జీవనోపాధికి ఢోకా ఉండదు.

- ఆవుల త్యాగరాజు, తాటిచెట్లపాలెం, బోగోలు మండలం

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు వేట విరామ భృతిని పెంచుతూ నిర్ణయిం తీసుకుంది. రూ.20వేల వరకు పెంచడంతో జిల్లాకు రూ.24.88 కోట్ల నిధులు రానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపడంతో విరామ సమయం లోపు ఆ నిధులు మత్స్యకారుల బ్యాంకు ఖాతాలలో జమకానున్నాయి.



వల విసురుతున్న మత్స్యకారుడు



జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వద్ద వలలను సరిచేసుకుంటున్న మత్స్యకారులు

ప్రభుత్వానికి రుణపడి ఉంటారు



వేట విరామ భృతిని రూ.20వేలకు పెంచటంతో మత్స్యకారులు కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటారు. కావలి మండలంలో 3,269 కుటుంబాలకు పెంచిన భృతి అందనుంది.

- సోమయ్యగారి రమణ, కావలి నియోజకవర్గ మత్స్యకారసంఘం అధ్యక్షుడు

భృతి పెంపు హర్షణీయం



కూటమి ప్రభుత్వం మత్స్యకారులను గుర్తించి వేట విరామ భృతి రూ.20 వేలకు పెంచడం శుభపరిణామం. గతంలో వైసీపీ ప్రభుత్వం రూ.10 వేలు ఇవ్వడమేగాక అనేక కొర్రీలతో అర్హులందరికీ భృతి ఇవ్వలేదు. మత్స్యకారులూ నానా ఇబ్బందులు పడ్డారు.

- కొండూరు బాబు, ఇస్కపల్లిపాలెం, అల్లూరు మండలం

ఈ మొండిగోడలకు మోక్షం!

- బీసీ భవన్ నిర్మాణంలో కదలిక
- 2019లో శంకుస్థాపన చేసిన నాటి టీడీపీ సర్కారు
- వైసీపీ హయాంలో పునాదులకే పరిమితం
- బిల్లులివ్వకపోవడంతో కాంట్రాక్టరు పరారీ
- ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ముందడుగు
- కొత్త అంచనాలతో ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్‌కు ఆదేశం



వైసీపీ హయాంలో వేసిన శిలాఫలకం

నెల్లూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కొన్ని కులాలకు భవనాలు నిర్మించాలని 2014-19 మధ్యకాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో నిర్ణయించారు. ఇందులో భాగంగానే నగరంలోని కొండాయపాలెం గేటు ప్రాంతంలో బీసీ భవన్ నిర్మాణానికి స్థలాన్ని గుర్తించారు. రూ.4.45 కోట్లతో ఈ భవనం నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. బీసీ భవన్‌లో శుభకార్యాలు జరుపుకునేందుకు పెద్ద హాల్, కొన్ని గదులను నిర్మించాల్సి ఉంటుంది. అలానే లైబ్రరీ కూడా ఏర్పాటు చేయాలి. బయటతో పోలిస్తే ఇక్కడ బీసీలకు తక్కువ అద్దెకు బుకింగ్‌లు ఇస్తారు. 2019 జనవరి 3వ తేదీన పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు బీసీ భవన్ నిర్మాణానికి ఘనంగా శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పునాదులు తవ్వడం మొదలుపెట్టారు. ఈలోపు ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచాయి.

వైసీపీ హయాంలో..

వైసీపీ హయాంలో బీసీ భవన్‌కు గ్రహణం పట్టింది. టీడీపీ ప్రభుత్వంలో వేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. ఆ తర్వాత మళ్లీ ఈ భవనం నిర్మాణానికి రివైజ్డ్ ఎస్టిమేషన్లు వేసి రూ.5.45 కోట్లకు అంచనాలు పెంచారు. 2021 జూన్ 25వ తేదీన మరోసారి బీసీ భవన్‌కు శిలాఫలకం వేశారు. అప్పటికే తవ్విన పునాదుల్లో కాలమ్స్ నిర్మించారు. ఇందుకు రూ.83 లక్షలను ఖర్చు చేశారు. కానీ ఆ తర్వాత ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించలేదు. దీంతో పనులు నిలిపేశారు. చాలా కాలం పాటు బిల్లులు ఇవ్వకపోవడంతో ఇక తాను పనులు చేయలేనంటూ కాంట్రాక్టర్ పారిపోయారు. దీంతో పూర్తయిన పునాదులు మూడేళ్లుగా పిచ్చి చెట్లతో సహవాసం చేస్తున్నాయి. బీసీ భవన్ పూర్తి చేయాలంటూ గత ప్రభుత్వంలో బీసీ నాయకులు ఎన్నిసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు అర్జీలు ఇచ్చుకున్నా ఫలితం లేకుండా పోయింది.

మళ్లీ చిగురిస్తున్న ఆశలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ బీసీ భవన్ నిర్మాణంలో ముందడుగు పడింది. ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆధ్వర్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ ముఖ్య నేతలు బీసీ భవన్‌పై చర్చించారు. వీలైనంత త్వరగా పనులు మొదలు పెట్టి పూర్తి చేయాలని నిర్ణయించారు. ఆ వెంటనే కలెక్టర్ ఆనంద్‌తోపాటు ఇతర అధికారులతో మంత్రులు, ఎమ్మెల్యేలు సమావేశమై బీసీ భవన్ పరిస్థితిపై సమీక్షించారు. ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ కొత్త ఎస్టిమేషన్లు తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని మంత్రులు ఆదేశించారు. ప్రస్తుతం అధికారులు కొత్త ఎస్టిమేషన్లు రూపొందించే పనిలో ఉన్నారు. ఈ ప్రక్రియ పూర్తి కాగానే ప్రభుత్వం నుంచి అనుమతులు తెప్పించి బీసీ భవన్ నిర్మాణాన్ని పునఃప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అయితే ఈ సారైనా ఎటువంటి ఆటంకాలు లేకుండా కాపు భవన్ మాదిరిగా బీసీ భవన్ కూడా పూర్తవుతుందో.. లేదో.. చూడాలి.

భయం గుప్పెట్లో 'కస్తూర్బా' పరిసరాలు

- అంధకారంలో విద్యాలయ ప్రాంతం
- ఆవరణలో కొరవడిన పారిశుధ్యం

కావలి రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ముసునూరు శివారులోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులు భయం గుప్పెట్లో కాలం వెళ్లదీస్తున్నారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు 260 మంది విద్యార్థినులు చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటున్నారు. ఈ నెల 8న ముసుగు ధరించిన ఓ యువకుడు హాస్టల్ వెనుక వైపు గోడదూకి లోనికి ప్రవేశించటంతో విద్యార్థినుల తల్లి దండ్రుల్లో కలవరపాటు మొదలైంది. శివారులోని విద్యాలయం కావడంతో చుట్టూ కంపచెట్లతో పాటు నిరుపయోగంగా ఉన్న జగనన్న ఇళ్లు ఉండటంతో ఆ ప్రాంతం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. అంతమంది విద్యార్థినులతో ఉన్న విద్యాలయానికి ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయలేదు. ఇందిరమ్మకాలనీ ట్రాన్స్‌ఫార్మర్ కు లైన్ కలపడంతో తరచూ లోవోల్టేజి సమస్య వస్తుందని లైట్లు ఎక్కువ వేసినపుడు ఫీజులు కాలిపోతున్నట్లు తెలిపారు. ఇలాంటి సమస్యలతో బాలికల విద్యాలయంలో రక్షణ కరువైందని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యాలయం రెండు క్యాంపస్‌లుగా ఉండటంతో రాత్రి సమయంలో విధుల్లో ఉండే ఒకే ఒక మహిళా వాచ్‌మెన్‌కు గస్తీ నిర్వహించటం కష్టతరం అవుతుంది. ఆమెకు తోడు రాత్రి సమయంలో ఇద్దరు టీచింగ్ స్టాఫ్ మాత్రమే విధుల్లో ఉండటంతో వారందరూ మహిళలు కావటంతో భయంగా ఉంటున్నారు. చుట్టూ ఉన్న ప్రహరీ ఎత్తు పల్లాలుగా ఉండటంతో విద్యార్థినులకు రక్షణ కరువైందని స్థానికులు చెబుతున్నారు.



ఆగంతకుడు ప్రవేశించిన బాలికల విద్యాలయం వెనుక భాగం

40 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



గుడ్లూరు పోలీస్ స్టేషన్‌లో పట్టుబడ్డ బియ్యం వాహనం

గుడ్లూరు, ఫిబ్రవరి 11: ఇతర పట్టణ ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్న 40బస్తాల రేషన్ బియ్యంను మంగళవారం గుడ్లూరు ఎస్‌ఐ వెంకట్రావు స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాల మేరకు.. లింగసముద్రం మండలం అంగిరేకులపాడులో బొలేరో వాహనంలో లోడు చేసుకుని గుడ్లూరు మండలం పూరేటిపల్లి మీదుగా కావలికి బియ్యం తరలిస్తున్నట్లు సమాచారంతో గుడ్లూరు శివాలయం జంక్షన్ వద్ద వాహనాన్ని పోలీసులు అదుపులోకి తీసుకుని వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అలాగే ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేశారు.

బాలల సంరక్షణ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు

నెల్లూరు (హరనాథపురం) ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని 30 అనాథ బాలల సంరక్షణ కేంద్రాలకు ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్, జిల్లా ప్రొబేషన్ అధికారి ఖాసిం దొర మంగళవారం అందజేశారు. బాలల న్యాయ చట్టం సెక్షన్ 41 ప్రకారం రిజిస్ట్రేషన్ కోసం నమోదు చేసుకున్న కేంద్రాలకు సర్టిఫికెట్లు అందించినట్లు సురేష్ తెలిపారు.

ఆ ఐదుగురు.. సమాజసేవకులు

- రోజువారి సంపాదనలో కొంత వినియోగం
- విద్యాసామగ్రి, నిత్యావసరాల పంపిణీ

ముంగమూరు భవాని ఎడ్యుకేషన్ సొసైటీలో అన్నదానం చేస్తున్న మల్యాద్రిగౌడ్, స్నేహితులు



కలిగిరి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : తాతలు, తండ్రులు సంపాదించిన ఆస్తిని మరింత పెంచుకుంటూ సేవా కార్యక్రమాలు చేయడం సహజం. అయితే ఏరోజుకారోజు పని చేస్తే తప్ప జీవనం సాగించలేని ఆ ఐదుగురు తమ సంపాదనలో కొంత సేవాకార్యక్రమాలకు వినియోగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

- కలిగిరికి చెందిన పీ మాల్యాద్రి గౌడ్ గీత కార్మిక కుటుంబానికి చెందినవారు. చిన్నతనంలో జరిగిన ఓ ప్రమాదంలో కన్ను దెబ్బతినడంతో చదువుకు స్వస్తి చెప్పి కొంతకాలం సైకిల్ షాప్, బడ్డీకొట్టులో పనిచేస్తూ కులవృత్తిలో తండ్రికి సాయపడేవాడు. వివాహం అయ్యాక ఓ హోటల్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తాను చదువుకోకపోవడం, తమ చిన్నారులను చదివించడానికి పేద తల్లిదండ్రులు పడే ఇబ్బందులు కళ్లారా చూడటం మాల్యాద్రిగౌడ్‌ను తీవ్రంగా కలచివేశాయి. దీంతో చిన్నారుల చదువులకు చేతనైన సాయం చేయాలన్న ఉద్దేశంతో బట్టలు, పుస్తకాలు, ఉపకరణాలు అందిస్తున్నారు. కొంతకాలం మల్యాద్రి గౌడ్ ఒక్కరే సాయం చేస్తూ ఉండటం గమనించి స్థానికంగా ఉన్న మరో నలుగురు షేక్ జిలానీబాషా, షేక్ గౌస్‌పీర్, షేక్ మస్తాన్, తంగేడుపల్లి మహేష్ కూడా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు.

మాల్యాద్రి గౌడ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు గౌడ సంఘం నాయకులు గుర్తించి జైగౌడ ఉద్యమం ద్వారా మరిన్ని సేవాకార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చి ఉదయగిరి నియోజకవర్గ జైగౌడ ఉద్యమం సంఘం అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. ఓ వైపు స్నేహితుల అండదండలు, మరో వైపు గౌడసంఘం సహకారంతో తన సేవా కార్యక్రమాలను దూర ప్రాంతాలకూ విస్తరించారు.

- ప్రతి ఏడాది పాఠశాలల ప్రారంభ సమయంలో పేద విద్యార్థులకు ఉపకరణాలు అందించడం, ఎస్టీ కాలనీవాసులకు చలికాలంలో దుప్పట్లు అందజేయడం, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బియ్యం, పప్పులు, దుస్తులు అందజేస్తున్నారు. పారిశుధ్య కార్మికులకు బట్టలు అందించడం, వేసవిలో మజ్జిగ చలివేంద్రాల ఏర్పాటు, అనారోగ్యానికిగురై కుటుంబ ఆర్థికపరిస్థితి బాగా లేని వారికి నగదుసాయం చేయడం, రోడ్డు ప్రమాదాల్లో గాయపడినవారికి అవసరమైన సహాయం అందించడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తాము చేస్తున్న సేవా కార్యక్రమాల స్ఫూర్తితో మరికొందరు పేదలకు సహాయపడితే అదే తమకు సంతోషాన్ని కలిగించే విషయమని ఆ ఐదుగురు స్నేహితులు చెప్పడం వారి సేవాభావానికి నిదర్శనం.



నిరుపేద కుటుంబానికి నిత్యావసరాలు అందజేస్తూ..

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

కూరగాయల విక్రయానికి

అద్దె చెల్లించాల్సిందే!

- ఈ-క్రాప్ సర్టిఫికెట్ తప్పనిసరి
- లేకుంటే నెలకు రూ.3వేల కిరాయి
- కూరగాయలు పండించే రైతులకు ఉచితం
- వ్యాపారుల వద్ద విభేదాలు



రైతుబజారు ఆవరణలో కూరగాయలు విక్రయిస్తున్న మహిళలు

కావలి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైతుబజారులో కూరగాయలు విక్రయించే రైతుల మధ్య విబేదాలు చోటుచేసుకున్నాయి. గతంలో కార్డులు పొందిన రైతులందరూ మహిళలతో సహా ఉచితంగా రైతుబజారులో కూరగాయలు విక్రయించుకునే వారు. కొందరు రైతులు దుకాణాల్లో ఉదయం నుంచి రాత్రివరకు కూరగాయలు అమ్ముకుంటారు.

● ఈ-క్రాప్ వచ్చిన తర్వాత..

మార్కెట్ ఆవరణలోని ముందుభాగంలో నేలపైనే కూర్చుని మహిళలు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కూరగాయలు అమ్ముకుంటారు. అయితే ఇప్పుడు ఈ-క్రాప్ వచ్చిన తర్వాత కూరగాయలు విక్రయించే రైతులందరూ కూరగాయలు సాగు చేసినట్లు ఈ-క్రాప్ సర్టిఫికెట్లు తేవాల్సి రావడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంత రైతులు పెద్దగా కూరగాయలు సాగు చేయకపోవటంతో దుకాణాల్లోని రైతులు మార్కెటింగ్‌శాఖకు ప్రతినెలా ఒక్కోదుకాణానికి రూ.2,500లు అద్దె చెల్లిస్తున్నారు.

● ఆకుకూరలు అమ్మేవారికి ఉచితం

అయితే మార్కెట్ ఆవరణలో ముందు భాగాన కేవలం ఆకుకూరలు విక్రయించే వారికే ఉచితంగా అమ్ముకునే అవకాశం ఉంది. అయితే మద్దూరుపాడుకు చెందిన మహిళలు స్థానికంగా హోల్‌సేల్‌గా కూరగాయలు కొనుక్కొని రైతు బజారు ఆవరణలో నేలపై కూర్చుని కుప్పలు పెట్టి అమ్ముకుంటున్నారు. అయితే దుకాణాలలో వ్యాపారాలు చేసుకునే రైతులు తాము అద్దెలు చెల్లిస్తున్నామని వారు ఉచితంగా ముందుభాగాన కూర్చుని విక్రయిస్తుండటంతో తమ వద్దకు కొనుగోలు దారులు రావటంలేదని వారు మార్కెటింగ్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రైతుబజారు ఎస్టేట్ ఆఫీసరు నేలపై కూర్చుని కూరగాయలు అమ్మే మహిళలను కూడా మీరు కూరగాయలు సాగుచేసినట్లు ఈ- క్రాప్ ద్వారా సర్టిఫికెట్లు తేవాలని లేకపోతే నెలకు రూ.3వేలు అద్దె చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. అద్దె చెల్లిం చకపోతే ఇక్కడ విక్రయాలు జరుపవద్దని చెప్పటంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అద్దె చెల్లించాలట



నేలపై కూర్చుని మండు టెండలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కూరగాయలు అమ్ముతుంటా. నాకు అధికారులు నెలకు రూ.3వేలు చెల్లించమని అడుగుతున్నారు. చెల్లించకపోతే విక్రయాలకు అనుమతి ఇవ్వమం టున్నారు.

- ఆళ్ల సుశీలమ్మ

రైతు కార్డు ఉన్నా ఇబ్బంది పెడుతున్నారు



కూరగాయలు విక్రయించుకునేలా రైతుకార్డు ఉన్నా ఇబ్బంది పెడుతున్నారు. ఎంతో కాలం నుంచి ఇక్కడ అమ్ముకుంటున్నాం. ఇప్పుడు కూరగాయల సాగు లేనందున ఈ-క్రాప్ సర్టిఫికెట్ లేకపోతే డబ్బులు కట్టాలంటున్నారు. నేలపై కూర్చుని విక్రయించుకునే వారికి అద్దె ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంలో న్యాయం చేయాలి.

- కొండా సుశీలమ్మ

న్యూస్ బాక్స్

సీఆర్‌ఎంటీకి సన్మానం

లింగసముద్రం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పెదపవని క్లస్టర్ పరిధిలోని రిజర్వ్ మొబైల్ టీచర్ పాదర్తి పురుషోత్తంను మంగళవారం హెచ్‌ఎం శ్రీనివాసులు పెదపవని హైస్కూల్ ప్రాంగణంలో పూలమాల, శాలువాతో సన్మానించారు. గత నెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా డీఈఓ, ఏపీసీల చేతుల మీదుగా జిల్లా ఉత్తమ సీఆర్‌ఎంటీగా అవార్డు తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

అల్లూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీ రుణాలకు బుధవారంతో దరఖాస్తు చేసుకునే గడువు ముగియనుందని స్థానిక నగర పంచాయతీ కమిషనరు ఉమామహేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీసీ, ఈడబ్ల్యూయస్, కాపు కులాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు సబ్సిడీ రుణాలను దరఖాస్తు చేసుకోవాలని సూచించినందున అర్హులు కుల, ఆదాయ ధ్రువీకరణ, ఆధార్ కార్డుల ఆధారంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

బిట్రగుంట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నాగులవరం పంచాయతీ చెన్నారెడ్డిపాలెం కొత్తూరులో వెలసిన పోలేరమ్మకు మంగళవారం భక్తులు పొంగళ్లు నిర్వహించారు. సోమవారం రాత్రి అమ్మవారిని గజమాలతో అలంకరించి పులి వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కాయాకర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించారు.

మద్దతు ధర కల్పించాలి

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పొగాకు, మిర్చి, వరి పంటలకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు మంగళవారం తహసీల్దార్ అబ్దుల్‌అమీద్‌కు మగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మాదాల రమణయ్య, కుమార్, దార్ల మాధవరావు, మానికొండ రమణయ్య, పిల్లి రామచంద్రారెడ్డి, మాధవరావు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు సాయం

ఉదయగిరి, ఫిబ్రవరి 11: గండిపాళెంలో మృతిచెందిన వేణు అంత్యక్రియలకు మండల వైస్, జీఎంకే ట్రస్టు అధినేత గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి రూ.10వేలు, మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్య రూ.5వేలను కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. భవిష్యత్తులో కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

అధ్యాపకుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కందుకూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంట్రాక్టు అధ్యాపకుడిగా పనిచేస్తూ మృతిచెందిన సీ హెచ్ భాస్కరరావు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షలు ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసింది. మంగళవారం ఈ చెక్కును ప్రిన్సిపాల్ షేక్ నాగూర్‌వలి మృతుడి భార్య వరలక్ష్మికి అందజేశారు. ప్రభుత్వ మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యే ఇంటూరి, ఆర్‌జేడీ వీవీ సుబ్బారావు, నెల్లూరు డీవీఈఓ మధుబాబులకు కృతజ్ఞతలు తెలిపారు.



చెక్కు అందజేస్తున్న ప్రిన్సిపాల్ షేక్ నాగూర్‌వలి

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 15న కందుకూరు విచ్చేస్తున్న సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వివిధ శాఖల అధికారులతో పరిశీలించి సూచనలిచ్చారు. ఏర్పాట్ల పరిశీలనకు బుధవారం కలెక్టరు, ఎస్పీలు రానున్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన

కావలి రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణపై యువత అవగాహనతో ఉండాలని మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ సుందర్‌రావు తెలిపారు. స్థానిక సాయి డిగ్రీ కళాశాల విద్యార్థులకు మంగళవారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. కళాశాల కరస్పాండెంట్ రమణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంవీఐలు కరుణాకర్, లక్ష్మీబాయ్, రెండో పట్టణ ఎస్ఐ గౌస్‌భాష పాల్గొన్నారు.

ప్రారంభ దశలోనే జాగ్రత్తలు తీసుకోవాలి

ఏఎస్‌పేట, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీలో మంగళవారం డీపీఎంవో మోహన్‌రావు లెప్రసీ పక్షోత్సవాల సందర్భంగా విద్యార్థులకు కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పించారు. లెప్రసీ, క్యాన్సర్, హెచ్ఐవీ వ్యాధులపై కౌమరదశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి అశ్వవాహన సేవ



కావలి టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): హనుమత్ క్షేత్రంలో వెలసిన లక్ష్మీపద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి మంగళవారం అశ్వవాహనం భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ వ్యవస్థాపక ప్రధాన అర్చకులు వేదగిరి సూర్యనారాయణాచార్యులు పర్యవేక్షణలో మున్సిపల్ ప్లాట్స్ బాపూజీ నగర్ మీదుగా గ్రామోత్సవం సాగింది. ఉదయం తోమల సేవ, హోమం పూజలు, స్వామి వ్రతమహోత్సవం చేపట్టారు. బుధవారం చక్రస్నానం, ఏకాంత సేవ నిర్వహించనున్నట్లు అర్చకులు సూర్యనారాయణాచార్యులు తెలిపారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

సీతారామపురం,ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి):బసినేనిపల్లిలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీవో సుభాషిణి మంగళవారం పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేసి, కూలీలతో మాట్లాడారు. కొలతల ప్రకారం పనులు చేపట్టి పూర్తిస్థాయిలో రూ.300 వేతనం పొందాలని, ప్రతిరోజూ కనీసం నాలుగు గంటలు పనిచేస్తే గరిష్ఠ కూలి డబ్బులు వస్తాయన్నారు. సమయపాలన పాటించి పనులు పూర్తి చేసుకోవాలని తెలిపారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

ఉదయగిరి : పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని ఎంఈవో-2 శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం వెంగళరావునగర్ జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు.

కోల్డ్ స్టోరేజీలో నిల్వకు అనుమతి తప్పనిసరి

కందుకూరు : పొగాకు రైతులు పొగాకును కోల్డ్ స్టోరేజిలలో నిల్వ చేయాలంటే బోర్డు అధికారుల నుంచి అనుమతి తప్పకుండా తీసుకోవాలని కందుకూరు 1, 2 వేలం నిర్వహణాధికారులు చంద్రశేఖర్, కిరణ్ తెలిపారు.

ముళ్లచెట్ల తొలగింపు

ఉదయగిరి, ఫిబ్రవరి 11: పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్ వద్ద వాహన రాకపోకలకు అడ్డంకిగా మారిన ముళ్లచెట్లను ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి ఎక్స్‌కవేటర్‌తో మంగళవారం తొలగింపు చర్యలు చేపట్టారు. ప్రమాదాల నివారణకు ముళ్లచెట్లను తొలగించడంతో పాటు వేగనిరోధకాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

గర్భిణులకు టీకాలు వేయించండి

కావలి టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గర్భిణిలు, పురిటి బిడ్డలను గుర్తించి సకాలంలో టీకాలు వేయించాలని వ్యాక్సినేషన్ జిల్లా అధికారి ఉమామహేశ్వరి తెలిపారు. మంగళవారం స్థానిక ఏరియా వైద్యశాల ప్రాంగణంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఇంటింటి సర్వే చేపట్టి గర్భవతులు, పురిటి బిడ్డలను గుర్తించి వారికి తగిన సమయంలో వ్యాక్సిన్లు వేయాలన్నారు. వ్యాక్సినేషన్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సకాలంలో వ్యాక్సినేషన్ చేయడం వలన అనేక ప్రమాదాలు, వైకల్యం నుంచి బయటపడవచ్చని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత, అర్బన్ మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రేపు వైద్య, రక్తదాన శిబిరం

ఉలవపాడు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ యూనియన్-1104 స్థాపించి 75ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఒంగోలు యూనియన్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 12న ఉచిత వైద్య, రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు కందుకూరు డివిజన్ అధ్యక్ష, కార్య దర్శులు నాగయ్య, మనోహర్‌లు ప్రకటనలో తెలిపారు.

మహా కుంభాభిషేకం

కలువాయి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుల్లూరులో కొత్తగా నిర్మించిన వీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విగ్రహ పునఃప్రతిష్ఠ, మహా కుంభాబిషేకం కార్యక్రమాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా మహాగణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యారాధన సంప్రోక్షణ, అఖండస్థాపన, వాస్తుశాంతి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అగ్ని ప్రతిష్ఠాపన, మూలమంత్ర హోమం, తీర్థప్రసాద వితరణ జరిగాయి. కార్యక్రమాల్లో కర్ణాటక మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నాయకులు అరవింద్ లింబావలి, మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, వడ్డెర కమ్యూనిటీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి జయశంకర్, ఆలయ సేవాట్రస్ట్ చైర్మన్ చల్లా సీతారాము, గ్రామస్థులు పాల్గొన్నారు.



అరవింద్ లింబావలిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం

తరగతుల విలీనం వద్దంటూ ఆందోళన

అనంతసాగరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మినగల్లు ఎస్సీ ప్రాథమిక పాఠశాలను పౌండేషన్ పాఠశాలగా విలీనం చేసే విధానాన్ని రద్దు చేయాలని విద్యార్థులు,వారి తల్లిదండ్రులు మంగళవారం ఆందోళన చేపట్టారు. విలీనం ఆపకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్ శాంతి, సుబ్బారాయుడు, శంకరయ్య పాల్గొన్నారు. అలాగే అనంతసాగరం ఉర్దూ పాఠశాల వద్ద విలీనంపై ఆందోళన చేశారు. తమ విద్యార్థులను మోడల్ స్కూల్‌కు పంపించేలా తీసుకుంటున్న చర్యలను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

● ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): గండిపాళెం దళితవాడ, గుడినరవ ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5వ తరగతులను గండిపాళెం మెయిన్, సున్నంవారిచింతల పాఠశాలల్లో విలీనం చేయవద్దని పీఎంసీ కమిటీసభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవో-2 శ్రీనివాసులుకు వినతిపత్రం ఇచ్చారు.

● కలువాయి, (ఆంధ్రజ్యోతి): పెన్నబద్వేలిలోని ప్రాథమికోన్నత పాఠశాలను మార్పు చేయవద్దని రెండోరోజు ఆందోళనలు కొనసాగాయి. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్ద కూడా విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన తెలిపారు. పాఠశాల గేటు ముందు నిలుచుని నినాదాలు చేశారు. ఈ ఆందోళనకు విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించారు. ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి, డీఈవో బాలాజీరావు పాఠశాల హెచ్ఎం వీ.కృష్ణారెడ్డి, మాజీ సర్పంచు వింజం బాబూరావు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులను నెల్లూరులోని డీఈవో కార్యాలయానికి పిలి పించుకుని మాట్లాడారు. సమస్యపై అధికారులు సానుకూలంగా స్పందించినట్లు హెచ్ఎం తెలిపారు.



అనంతసాగరం: ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు



కలువాయి : నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

గుర్తింపు కార్డులు ఉంటేనే పథకాలకు అర్హులు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రత్యేక గుర్తింపు రిజిస్ట్రేషన్ చేయిచుకోవాలని ఏఓ హేమంత్ భరత్‌కుమార్ తెలిపారు. చుండి, గరుకుపాలెంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోందిలో పాల్గొని మాట్లాడారు. భూమి కలిగిన ప్రతిరైతుకు గుర్తింపు సంఖ్య ఇవ్వడంతో వ్యవసాయ సేవలను సులభతరం అవుతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర పథకాలు పంటల బీమా, రుణాలపై వడ్డీ రాయితీ వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సీహెచ్ రవీంద్ర పాల్గొన్నారు.

● కొండాపురం: ప్రతిరైతుకు 11అంకెల యూనిక్ ఐడీ తప్పనిసరని మండల వ్యవసాయ అధికారి షేక్ సైదా తెలిపారు. పొలంపిలుస్తోందిలో భాగంగా వెలిగండ్ల, మర్రిగుంటలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులు మాట్లాడారు. 1-బీ లేదా పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, లింకైన ఫోన్ నెంబరును తీసుకొని రైతుసేవా కేంద్రాల్లోని వీఏఏలను కలిసి 11అంకెల యూనిక్ ఐడీ నెంబరును పొందాలన్నారు. ఈ నెంబరుతో ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు.

● ఉలవపాడు: ప్రభుత్వ పథకాలకు అర్హత పొందాలంటే ఇకపై రైతులకు గుర్తింపు కార్డు తప్పనిసరి అని మండల వ్యవసాయ అధికారి తిరుమల జ్యోతి రైతులకు సూచించారు.



కొండాపురం: మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి షేక్‌సైదా

మంగళవారం వీరేపలిలో నిర్వహించిన పొలంపిలుస్తోందిలో ఆయన పాల్గొని పలు సలహాలు ఇచ్చారు.

● ఉదయగిరి: భూమి ఉన్న ప్రతీ రైతుకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ఆంజనేయులనాయక్ పేర్కొన్నారు. పొలం పిలుస్తోందిలో భాగంగా గండిపాళెం, గుడినరవ గ్రామాల్లో రైతులకు అవగాహన నిర్వహించారు. పొలం పత్రాలతో రైతులు ఆయా ఆర్‌ఎస్‌కెలకు వెళ్లి 11అంకెల విశిష్ట సంఖ్య కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అనంతరం సాగులో ఉన్న పైర్లను పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు.

ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి):పక్కాగృహాలు మంజూరైన లబ్ధిదారులు మార్చి నెలాఖరుకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ ఈఈ ఎంవీ మోహన్‌రావు పేర్కొన్నారు. మంగళవారం గండిపాళెంలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి సూచనలిచ్చారు. అనంతరం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో ఏఈలు, వర్కు ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్లు నిర్మించేవి, లబ్ధిదారులు సొంతంగా నిర్మించుకుంటున్న ఇళ్లను మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. లేకుంటే రద్దయ్యే అవకాశముందన్నారు. ఏప్రిల్ నుంచి అవ్షన్-2.0 అమల్లోకి వస్తుందన్నారు. అనంతరం గోదాముల్లో నిల్వ ఉన్న సిమెంట్, స్టీల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ పీరాన్, ఏఈ రామకృష్ణ, వర్కుఇన్‌స్పెక్టర్ మల్లు హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

● సీతారామపురం: మార్చి 31లోపు జగనన్న కాలనీల్లో ఇళ్లు పూర్తి చేసుకోవాలని, లేకుంటే నిర్మాణ పథకంఆగిపోతుందని హౌసింగ్ ఏఈ కరీముల్లా తెలిపారు. స్థానిక హౌసింగ్ కార్యాలయంలో మంగళవారం ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ ఇంతవరకు బేస్‌మెంట్ వేయని లబ్ధిదారులు త్వరగా వేసుకోవాలన్నారు. లేనిపక్షంలో రెవెన్యూశాఖ నుంచి ప్రత్యేక టీం వచ్చి పరిశీలన చేసి, పట్టాలు రద్దు చేస్తారని తెలిపారు. ఏప్రిల్ నుంచి స్కీమ్-2 ప్రారంభమవుతుందని తెలిపారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు లబ్ధిదారులకు అవగాహన కల్పించి, త్వరగా ఇళ్లు నిర్మించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సుమతి, చిన్నయ్య, ప్రవీణ్, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా ఆటోల నిలిపివేత

బిట్రగుంట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బోగోలు రైల్వే ఎల్సీగేట్ 144 వద్ద నడిరోడ్డుపైనే ఆటోలు నిలుపుతున్నారు. అలాగే రైల్వే గేట్ వేస్తే మరలా తీసేందుకు అరగంటపైనే పట్టే సమయంలో ఈ ఆటోలతో స్థానికులు మరింత ఇబ్బందులు ఎదురు అవుతున్నాయి. కూడలిలో పోలీస్ అవుట్‌పోస్ట్ ఉన్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఆర్‌ఎంపీలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో పల్లెల్లో ఉంటూ ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్న ఆర్‌ఎంపీ వైద్యులకు తాను అండగా ఉంటానని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని మన్నెం గోపాలక్రిష్ణారెడ్డి కల్యాణ మండపంలో భారత్‌రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మంగళవారం గ్రామీణ వైద్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి మాట్లాడారు. కుల మతాలకతీతంగా రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఎమర్జెన్సీ సేవల్లో తొలుత స్పందించే వ్యక్తి ఆర్‌ఎంపీనే అన్నారు. యూనియన్లతో సంబంధం లేకుండా ప్రతి ఆర్‌ఎంపీ వైద్యుడికి తాను అండగా ఉంటానన్నారు. అసోసియేషన్‌లో నూతనంగా సభ్యత్వం తీసుకున్న వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్‌కు ఘన నివాళులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం ఆత్మకూరులో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎస్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో జనసంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని నిర్వహించారు. పలువురు నేతలు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కరటంపాటి సుధాకర్, ఏలూరు రాజగోపాల్‌రెడ్డి, కొల్లి శ్రీనివాసులు నాయుడు, వాయుగుండ్ల ఉమ, శంకర్ పాల్గొన్నారు.

● కావలి టౌన్: బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు మంద కిరణ్‌కుమార్ అధ్యక్షతన పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బ్రహ్మానందం, అమరా సుబ్బారావు, సీవీసీ సత్యం, వాయుగండ్ల సుదీర్, పరుసు వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

● కందుకూరు: స్థానిక బీజేపీ నాయకులు దీనదయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మన్నేపల్లి వరప్రసాదరావు, జొన్నాదుల రాఘవయ్య, గట్టమనేని హరిబాబు, వైకుంఠం, మువ్వల భూషయ్య, చుండి మురళీధర్, చిన్ని పాండురంగయ్య పాల్గొన్నారు.



ఆత్మకూరు: నివాళులు అర్పిస్తున్న బీజేపీ నేతలు

ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం



కందుకూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యులు మంగళవారం ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 56 మంది కార్మికులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వైద్యులు షాజుద్దీన్ మాట్లాడారు. ఆస్పత్రిలో రక్తనిల్వ కేంద్రంలో బ్లడ్‌ప్యాకెట్ల నిల్వను పెంచటమే లక్ష్యంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాలతో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ డిపో మేనేజరు శ్రీనివాసరావు సహకారంతో చేపట్టిన కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది శ్రీలత, రామారావు, సుకుమార్ ఉన్నారు.

మాచవరం రైతుకు జైలు.. జరిమానా

కందుకూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి):మాచవరంకు చెందిన రైతు పూనూరు వెంకట సుధాకరరెడ్డి కేసు విచారణ సమయంలో కోర్టులో తప్పుడు సాక్ష్యం చెప్పిన నేరానికి ఆయనకు 6నెలలు జైలు, రూ.500ల జరిమానా విధిస్తూ నెల్లూరు 2వ అదనపు మొదటి తరగతి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి తీర్పు చెప్పారు.